



ESTD: 1999
www.voodayam.com

# వుదయం

హైదరాబాద్ | 31-03-2026 మంగళవారం | సంపుటి : 27 | సంచిక : 28 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal
Follow us on






# సహజీవనానికి దాంపత్య హోదా

## సమ్మతితో కలిసి బతికే వారిని 2027 జనాభా లెక్కల్లో వివాహితులుగానే నమోదు చేయాలని కేంద్రం నిర్ణయం

**హైదరాబాద్, మార్చి 30 (వుదయం ప్రతినిధి) :** తమ బంధం స్థిరమైందని భావించే సహజీవన జంటలను కూడా వివాహిత జంటగానే లెక్కించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఇరువురి సమ్మతంతో కలిసి ఉండే వారి విషయంలో ఇతరుల జోక్యం అవసరం లేకుండా వారిని వివాహిత జంటలుగా గుర్తిస్తామని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా త్వరలో ప్రారంభం కానున్న 2027 జనగణన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సహజీవనం చేస్తున్న వారి విషయంలో స్పష్టత ఇచ్చింది. సెన్సస్ వెబ్‌సైట్‌లోని ఎఫ్‌ఏక్యూ విభాగంలో కేంద్రం ఈ అంశాన్ని పొందుపరిచింది. ఈ మేరకు జనగణన ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. కాగా 2027 జనగణనను అధికారులు మొత్తం రెండు దశల్లో నిర్వహించనున్నారు. ఈ దశలో హౌస్ లిస్టింగ్ (ఇళ్ల జాబితా), గృహ గణన నిర్వహిస్తారు. దీని ద్వారా గృహాల పరిస్థితి, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఇంధనం, ఇంటర్నెట్ వంటి వసతులతో పాటు టీవీ, కంప్యూటర్, వాహనాలు వంటి ఆస్తుల వివరాలను సేకరిస్తారు. ఈ దశలో జనాభా గణన జరుగుతుంది. వ్యక్తుల పేరు, వయస్సు, లింగం, వైవాహిక



స్థితి, కులం, మతం, విద్య, భాష, వైకల్యం, వలసలు, ఉపాధి వంటి పూర్తి వ్యక్తిగత వివరాలను సేకరిస్తారు. (హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి మంచు కురిసే ప్రాంతాల్లో ఇది సెప్టెంబర్ 2026లోనే జరుగుతుంది). ఈసారి జనగణనలో పౌరులకు ఒక ప్రత్యేక అవకాశం కల్పించారు. సాధారణంగా ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చి వివరాలు సేకరించే విధానంతో పాటు, పౌరులు తమ వివరాలను స్వయంగా వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' సౌకర్యం అందుబాటులోకి రానుంది. వెబ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన తర్వాత, ఎన్యుమరేటర్ కేవలం ధృవీకరణ కోసం మాత్రమే ఇంటికి వస్తారు.

# డాలర్ కు రూ. 95.14

**న్యూఢిల్లీ, మార్చి 30 (వుదయం) :** సోమవారం నాడు రూపాయి తొలిసారిగా డాలర్‌కు 95 మార్కును దాటింది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే 95.14 వద్ద రికార్డు కనిష్ట స్థాయికి పడిపోయింది. దిగుమతిదారుల నుండి డాలర్లకు బలమైన డిమాండ్, కంపెనీల ఆర్బిట్రేజ్ ట్రేడ్‌ల కారణంగా కరెన్సీపై ఒత్తిడి పెరగడంతో, ప్రారంభంలో వచ్చిన లాభాలు త్వరగా క్షీణించాయి. ఆ తర్వాత ఈ పతనం సంభవించింది. రూపాయి ఒక శాతం కంటే ఎక్కువ పెరిగి 93.60 వద్ద బలంగా ప్రారంభమైనప్పటికీ, మారుతున్న మార్కెట్ పరిస్థితులు, నియంత్రణల ఆధారిత పొజిషనింగ్ మధ్య రోజంతా ఆ లాభాలను నిలబెట్టుకోవడంలో విఫలమైంది.

### వ్యాపారలావాదేవీల్లో తీవ్రమైన తిరోగమనం

నియంత్రణ మార్పులు, అవకాశవాద లావాదేవీల కలయిక వల్ల ప్రారంభ ర్యాలీ దెబ్బతిందని ట్రేడర్లు తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల బ్యాంకుల విదేశీ మారక నిల్వలపై నిబంధనలను కఠినతరం చేసింది. ఇది బ్యాంకులను స్థానికంగా డాలర్ నిల్వలను తగ్గించుకోవడానికి, ఆఫ్‌షోర్ మార్కెట్లలో కార్యకలాపాలను పెంచడానికి బలవంతం చేసింది. దీనివల్ల దేశీయ, విదేశీ డాలర్ మార్కెట్ల మధ్య ధరల వ్యత్యాసం ఏర్పడింది. ఈ వ్యత్యాసం నుండి లాభం పొందడానికి కంపెనీలు వెంటనే రంగంలోకి దిగాయి. భారతదేశంలో



డాలర్లను కొని, వాటిని విదేశాలలో అమ్మడం ప్రారంభించాయి. ఈ ఆర్బిట్రేజ్ లావాదేవీలు రూపాయి పెరుగుదలను పరిమితం చేసి, సెషన్ సమయంలో అస్థిరమైన కదలికలకు దారితీశాయి. అంచనాల ప్రకారం, ఈ పునఃస్థాపన ప్రవాహాలు 25 బిలియన్ డాలర్ల నుండి 35 బిలియన్ డాలర్ల మధ్య ఉన్నాయి. ఆఫ్‌షోర్, ఆన్‌షోర్ రేట్ల మధ్య అంతరం గణనీయంగా పెరగడంతో, ఇటువంటి వ్యాపారాలు అత్యంత ఆకర్షణీయంగా మారాయి. అదే సమయంలో, దిగుమతిదారుల నుండి, ముఖ్యంగా స్వల్పకాలిక చెల్లింపులు చేసే పెద్ద సంస్థల నుంచి డాలర్లకు స్థిరమైన డిమాండ్ ఉండటం రూపాయిపై మరింత ఒత్తిడిని పెరిగింది.

## ఇరాన్ కు ట్రంప్

# అల్టిమేటం



- అమెరికాతో ఒప్పందం చేసుకోకపోయినా హార్ముజ్ జలసంధిని తెరవకపోయినా దాడులు తప్పవు
- హేతుబద్ధమైన ఇరాన్ కొత్త నాయకత్వంతో చర్చలు జరుగుతున్నాయి
- ఒప్పందం ఖచ్చితంగా కుదురుతుందని చెప్పలేను కానీ ఆ అవకాశమైతే ఉంది
- అమెరికా షరతులకు ఒప్పుకోకపోతే ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, చమురు బావులు, ఖర్గ్ ద్వీపం వంటి కీలక ప్రదేశాలపై తీవ్రమైన దాడులు చేస్తాం

**వుదయం డెస్క్, మార్చి 30 :** ఇరాన్ తన సైనిక చర్యలను ముగించేందుకు, అక్కడి నూతన, మరింత హేతుబద్ధమైన నాయకత్వంతో వాషింగ్టన్ తీవ్ర చర్చలు జరుపుతోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరిక జారీ చేశారు. ఒక ఒప్పందం కుదిరే దిశగా ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, త్వరలో ఒప్పందం కుదరకపోయినా, లేదా హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవకపోయినా, అమెరికా తన ప్రతిస్పందనను తీవ్రతరం చేయగలదని, ఇందులో భాగంగా ఇరాన్ కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటుందని, ఇది సంఘర్షణను మరింత ఉధృతం చేస్తుందని ఆయన హెచ్చరించారు.

మిగతా 2లో

# కల్తీ చేస్తే ఖబడ్దార్

## ఆహార కల్తీ నియంత్రణకు హైడ్రా, ఈగల్ తరహాలో ప్రత్యేక వ్యవస్థ : సీఎం

- ఇతర రాష్ట్రాల్లో అమలవుతోన్న చట్టాలపై అధ్యయనం
- రాష్ట్రంలో 3.39 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ
- పథకానికి యేడాది అయిన సందర్భంగా శాసనసభ సెంట్రల్ హాలులో సన్నబియ్యంతో భోజనం

**హైదరాబాద్, మార్చి 30 (వుదయం ప్రతినిధి) :** ఆహార కల్తీని నియంత్రించడానికి రాష్ట్రంలో ఒక ప్రత్యేక వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా తీసుకొచ్చిన ఈగల్, హైడ్రా తరహాలోనే ఆహార కల్తీని నియంత్రించడానికి కూడా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇందుకోసం దేశంలో ప్రస్తుతం అమలవుతున్న కల్తీ నిరోధక చట్టాలను అధ్యయనం చేసి పటిష్ట చర్యలు చేపడుతామని చెప్పారు. రాష్ట్రంలో 3.39 కోట్ల మందికి పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పథకం ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రజాప్రతినిధులకు శాసనసభ సెంట్రల్ హాలులో సన్నబియ్యంతో భోజనం ఏర్పాటు చేశారు. ఇందులో సీఎంతో పాటు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొని భోజనం చేశారు. ఈ సందర్భం గా సీఎం రేవంత్ రెడ్డి అక్క డి మీడియాతో ముచ్చటించారు. రేషన్ షాపుల ద్వారా దొడ్డు బియ్యం అందించినా తినేవారు లేకపోవడంతో ఆ బియ్యాన్ని సన్న బియ్యంగా మార్చే మాఫియా పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా దొడ్డు బియ్యం ఇవ్వడంతో ప్రభుత్వానికి ఖర్చు తప్ప పేదలకు ఉపయోగపడటం లేదని చెప్పారు. అన్ని రకాలుగా ఆలోచనలు చేసిన తర్వాత పేదలు తినగలిగే సన్నబి య్యం అందించాలని ఈ పథకాన్ని ప్రారంభించినట్లు సీఎం వివరించారు. ఇందుకోసమే క్వింటాలుకు రూ. 500 బోనస్ ప్రకటించి సన్నవడ్లు పండించాలని రైతులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. అడిగిన ప్రతి వారికి రేషన్ కార్డు జారీ చేశామన్న సీఎం.. ఇదే తరహాలో రాష్ట్రంలో విద్యార్థులక నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.



### గృహ నిర్భంధంలో కేసీఆర్ : సీఎం రేవంత్

మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవెల్లిలోని తన ఫాం హౌస్ లో విశ్రాంతి తీసుకుంటున్నారని అందరూ అనుకుంటున్నారనీ కానీ తన అనుమానం ప్రకారం ఆయన కుటుంబీకులే ఆయన్ను గృహ నిర్బంధం చేశారని సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వాస్తవానికి కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు జనానికి తెలిసేవి కావని చెప్పారు. రావణుడి చెడుతోనే రాముడి గొప్పతనం తెలిసిందన్న సీఎం.. కేసీఆర్ ఉండటంతోనే తనకు గుర్తింపు వచ్చిందని వ్యాఖ్యానించారు.

మిగతా 2లో

# 11 మంది ఎమ్మెల్సీల సస్పెన్షన్

- కౌన్సిల్‌లో మైనింగ్‌పై వాగ్యుద్ధం
- రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై హౌజ్ కమిటీకి ప్రతిపక్షం పట్టు
- మంత్రి పొంగులేటి భర్తరఫ్‌కు డిమాండ్
- ప్లకార్డులతో పోడియం దిగ్బంధం
- మార్షల్స్‌తో వాగ్వాదం
- ఆందోళన విరమించాలని చైర్మన్ ఆదేశించినా వినని విపక్షం
- కౌన్సిల్ నుంచి తొలిసారిగా సస్పెన్షన్లు
- కీలక బిల్లులకు సభ ఆమోదం
- విద్వేష ప్రసంగాల బిల్లుపై అభ్యంతరం

## విద్వేష ప్రసంగాలపై బిల్లు

సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా సాగుతున్న ద్వేషపూరిత ప్రసంగాలను అరికట్టేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించిన నూతన బిల్లుపై అసెంబ్లీలో ఆసక్తికర చర్చ జరిగింది. ఈ బిల్లులోని నిబంధనలు, శిక్షలు, పౌర హక్కుల అంశాలపై సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో, ప్రభుత్వం ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ కి రిఫర్ చేస్తూ తీర్మానం చేసింది. సోషల్ మీడియా, బహిరంగ సభల్లో కొందరు వ్యక్తులు మతపరమైన, కులపరమైన విద్వేషాలను రెచ్చగొడుతున్న నేపథ్యంలో, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఈ ప్రత్యేక బిల్లును రూపొందించింది. ద్వేషపూరిత ప్రసంగాలు చేసే వారికి భారీ జరిమానాతో పాటు, నాన్-బెయిలబుల్ సెక్షన్ల కింద జైలు శిక్ష విధించేలా ఇందులో ప్రతిపాదనలు ఉన్నాయి. దీంతో పాటు ఇంటర్నెట్ వేదికగా అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిని గుర్తించేందుకు పోలీసులకు ప్రత్యేక అధికారాలు కల్పించడం ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులతో పాటు కొందరు అధికార పార్టీ సభ్యులు కూడా కొన్ని ఆందోళనలు వ్యక్తం చేశారు. ద్వేషపూరిత ప్రసంగం అనే పదానికి స్పష్టమైన నిర్వచనం లేకపోతే, పోలీసులు దీనిని రాజకీయ కక్ష సాధింపులకు వాడుకునే ప్రమాదం ఉందని సభ్యులు అభిప్రాయపడ్డారు. సభ్యుల సూచనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, ఈ బిల్లును హడావిడిగా ఆమోదించడం కంటే సమగ్రంగా చర్చించడం మంచిదని భావించింది. ఈ మేరకు బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపుతున్నట్లు సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. కమిటీ నివేదిక సమర్పించిన తర్వాతే దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

**హైదరాబాద్, మార్చి 30 (ఎఎంఎస్) :** తెలంగాణలో వెలుగుచూసిన అక్రమ మైనింగ్ వ్యవహారం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్నది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ మైనింగ్ అక్రమ వ్యవహారం వరుసగా మూడో రోజూ ఉభయసభల్లో తీవ్ర దుమారం లేపింది. అధికార కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా మంత్రి పొంగులేటిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తోన్న ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ... రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థ అవినీతి, అక్రమాలపై హౌస్ కమిటీని వేయాలని శాసన మండలిలో డిమాండ్ చేసింది. కౌంటర్ గా అధికార పక్ష సభ్యులు, ప్రతిపక్ష సభ్యులతో వాగ్వాదానికి దిగారు. ఇరు వర్గాల విమర్శలు, ప్రతి విమర్శలతో మండలిలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఉదయం సభా కార్యకలాపాలు ప్రారంభమైన వెంటనే.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ వ్యవహారాన్ని లేవనెత్తారు. ఆ సంస్థపై హౌజ్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. అంతటితో ఆగకుండా.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించిన ప్లకార్డులతో చైర్మన్ పోడియాన్ని చుట్టుముట్టారు. సభ్యులు శాంతించాలని పలు మార్లు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.. విజ్ఞప్తి చేశారు. సభా సమయాన్ని వృథా చేయవద్దని సూచించారు. అయినప్పటికీ వారు వెనక్కి తగ్గకపోవడంతో.. జోక్యం చేసుకున్న శాసనసభా పక్ష వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు.

మిగతా 2లో

## మైనింగ్‌పై హైకోర్టు జడ్జితో విచారణ జరపండి

### గవర్నర్ కు బీఆర్ఎస్ శాసనసభ పక్షం విజ్ఞప్తి

**హైదరాబాద్, మార్చి 30 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో మైనింగ్ అక్రమాలకు పాల్పడిన రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని బీఆర్ఎస్ శాసనసభ పక్షం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు విజ్ఞప్తి చేసింది. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పరిపాలనపై ఫిర్యాదు చేసింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సోమవారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ మైనింగ్ అక్రమాలపై అసెంబ్లీలో గత రెండు రోజులుగా జరిగిన అధికార, ప్రతిపక్షాల మధ్య జరిగిన వివాదాన్ని, అక్రమాలను రుజువు చేసేలా తాము సభలో ప్రస్తావించిన అంశాలు, ఆధారాలతో పాటు అధికార పార్టీ సభ్యుల ఎదురుదాడిని ప్రతిపక్ష నేతలు గవర్నర్ కు వివరించారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజా సంపదను కొల్లగొడుతున్నారని ఆరోపించారు.

మిగతా 2లో

## సన్నబియ్యం పంపిణీకి రూ.14,560 కోట్లు ఖర్చు

### మీడియాతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 30 (ఎఎంఎస్) :** పేదలు గౌరవంగా, కడుపునిండా భోజనం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆలోచన అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. సన్నబియ్యం పంపిణీకి ఎంత ఖర్చయినా భరించడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సన్నబియ్యం పంపిణీ కోసం ప్రభుత్వం ఏటా రూ.14,560 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తీసుకొచ్చిన ఫుడ్ సెక్యూరిటీ బిల్లు ఆశయాలకు తెలంగాణలో పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతోందని ఉత్తమ్ అన్నారు. సోమవారం ఆయన అసెంబ్లీ వద్ద మీడియాతో చిట్‌చాట్ చేశారు. పేదలకు నాణ్యమైన ఆహారం అందించాలనే అద్భుతమైన ఆలోచన సీఎం రేవంత్ రెడ్డి దేననీ ఆ ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. రాష్ట్రంలోని సుమారు 3.39 కోట్ల మంది సన్నబియ్యం పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని మంత్రి ఉత్తమ్ వివరించారు. అర్హులైన వారు ఎవరైనా సరే, రాజకీయాలకు అతీతంగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు.



అడిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఇక తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రైతుల ఖాతాల్లోకి రూ.40 వేల కోట్లు జమ చేశామని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు చేరుతున్నాయని, ఎక్కడా జాప్యం జరగకుండా పౌరసరఫరాల శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

లొంగిపోయిన మరో మావోయిస్టు అగ్ర నేత చెల్లూరి 5

ఎస్సీ హోదా రద్దు ఆదేశాలు చెల్లవు



చిత్తశుద్ధి ఉంటే కుల వ్యవస్థను రద్దు చేయండి
పార్లమెంట్, న్యాయవ్యవస్థ, రాష్ట్రపతికి మందకృష్ణ డిమాండ్
ఈ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధం

2 9న మిలియన్ మార్చ్ కేసు విచారణ



కేసులు కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు

2 రుణభారం పెరుగుతోంది జాగ్రత్త

CAG

రాష్ట్ర ప్రభుత్వానికి కాగ్ హెచ్చరిక

# గృహ నిర్బంధలో కేసీఆర్

మొదటి పేజీ తరువాయి..

రాష్ట్రంలో డీలిమిటేషన్‌పై బీజేపీ నేత లక్ష్మణ్ అవగాహన లేని వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. లక్ష్మణ్ ఎలా డాక్టర్ అయ్యారో అర్థం కావడం లేదన్నారు. తెలంగాణను చాలా తెలివిగా మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎన్ని సీట్లు పెరిగితే అన్ని మహిళా రిజర్వేషన్లు వస్తాయని, ఒకవేళ 50 శాతం సీట్లు పెంచితే 410 సీట్ల గ్యాప్ వస్తుందని తెలిపారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగినా కూడా భౌగోళికంగా గ్యాప్ అలాగే ఉంటుందని అన్నారు. సీట్ల పెంపులో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రానికి కేవలం ఐదు ఉత్తరాది రాష్ట్రాల సీట్లు సరి పోతాయని, అదే జరిగితే దక్షిణాది రాష్ట్రాల సీట్లతో పని ఉండదని, ఇప్పటికే తమను పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పుడు ఎంతోకొంత దక్షిణాదిని గుర్తిస్తున్నారని, సీట్ల పెంపులో వ్యత్యాసం వస్తే బండి సంజయ్, కిషన్‌రెడ్డిలకు రాజకీయంగా అవకాశాలు ఉండవన్న ఆయన దేశంలో నియంత పోకడలు వస్తాయని సీఎం సెటైర్లు వేశారు.

# మైనింగ్‌పై హైకోర్టు జడ్జితో విచారణ జరపండి

మొదటి పేజీ తరువాయి..

నిబంధనలు తుంగలో తొక్కి అక్రమ మైనింగ్ చేస్తున్నారని అన్నారు. ఎటువంటి పర్మిషన్ లేకుండా వందల కోట్ల ప్రజా సంపద కొల్లగొడుతున్నారని.. వివరాలతో గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఇదే విషయమై మా నాయకుడు హరీష్ రావు అసెంబ్లీలో లేవనెత్తితే ఎదురుదాడి చేశారు. అక్రమ మైనింగ్‌పై సిబిసీఐడీ విచారణ చేయిస్తాం అని సీఎం అంటున్నారు మేము హౌస్ కమిటీ వెయ్యాలని డిమాండ్ చేశాము. హౌస్ కమిటీలకు విలువ లేదని మంత్రి శ్రీధర్ బాబు అనడం విడ్డూరం. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ హౌస్ కమిటీకి అనేక సార్లు డిమాండ్ చేశారు. ఇక్కడేమో హౌస్ కమిటీలకు విలువ లేదని ప్రభుత్వం అనడం ఎంత వరకు సబబుని కేటీఆర్ ప్రశ్నించారు. సిబిసీఐడీ రాష్ట్ర ప్రభుత్వంలో ఒక విభాగం, మంత్రిపై విచారణ నిష్పక్షపాతంగా జరగదన్నారు మంత్రివర్గం నుంచి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశామన్న కేటీఆర్... ఇదే విషయమై సోమవారం మండలిలో తమ ఎమ్మెల్సీలు నిలదీస్తే వారిని సస్పెండ్ చేశారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలే గద్దలుగా మారితే, రక్షకులే భక్షకులు అయితే ఎలా ప్రజలకు ఎవరు దిక్కు అని ప్రశ్నించారు. అందుకే ఈ అంశంపై హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని గవర్నర్‌కు వివరించామని చెప్పారు. ఎమర్జెన్సీ ఇందిరమ్మ పాలన తెలంగాణలో కనిపిస్తుందన్న కేటీఆర్.. ప్రజా సంపద దోపిడీ అడ్డుకోవాలని గవర్నర్‌కు వివరించినట్లు వెల్లడించారు.

# డాలర్‌కు రూ. 95.14

మొదటి పేజీ తరువాయి..

విధాన మార్పు కాదు, సంకేతమే : కేంద్ర బ్యాంకు తీసుకున్న ఈ చర్య, విధాన దిశను మార్చడం కన్నా ఒక సంకేతం ఇవ్వడానికేఎక్కువ పోలి ఉందని ఆర్థికవేత్తలు అన్నారు. అధికారులు మార్కెట్లను నిశితంగా గమనిస్తున్నారని చూపించడం, మితిమీరిన ఊహాగానాలను తగ్గించడమే దీని లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఆర్థికవేత్తల ప్రకారం, రూపాయికి సంబంధించిన విస్తృత దృక్పథం మారలేదు. స్వల్పకాలిక విధానపరమైన చర్యల కన్నా, ప్రపంచ వాణిజ్య పరిస్థితులు, పరిమిత మూలధన ప్రవాహాల నుండి ఇది ఒత్తిడిని ఎదుర్కొంటూనే ఉంది.

ఇదిలా ఉండగా, భారతదేశ ఆర్థిక పునాదులు బలంగానే ఉన్నాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. డాలర్‌తో పోలిస్తే అనేక ఆసియా కరెన్సీలు మరింతగా బలహీనపడిన నేపథ్యంలో, రూపాయి పతనాన్ని ప్రపంచ దృక్పథంతో చూడాలని ఆమె నొక్కి చెప్పారు. రూపాయి మార్కెట్ ఆధారితమైనదని, ప్రపంచ పోకడలు, మూలధన ప్రవాహాలు, వాణిజ్య కారకాల వల్ల ప్రభావితమవుతుందని అధికారులు పునరుద్ఘాటించారు. అదే సమయంలో, అధికారులు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తూనే ఉన్నారు.

# ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం

మొదటి పేజీ తరువాయి..

**ఒత్తిడితో కూడిన చర్చలు...**

చర్చలు కొనసాగుతున్నాయని, ఒప్పందం ఖచ్చితం కాకపోయినా కుదిరే అవకాశం ఉందని ట్రంప్ సూచించారు. ఉద్రిక్తతలను తగ్గించి, ఈ ప్రాంతంలో స్థిరత్వాన్ని పునరుద్ధరించడంలో హొర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం ఒక కీలకమైన అడుగు అవుతుందని ఆయన సూచించారు. షరతులు నెరవేర్చకపోతే, ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, చమురు బావులు, ఖర్గ్ ద్వీపం వంటి వ్యూహాత్మక ప్రదేశాలపై అమెరికా దాడి చేయగలదని ట్రంప్ తెలిపారు. ఇప్పటి వరకు ఈ లక్ష్యాలపై ఉద్దేశపూర్వకంగా దాడులు జరగలేదని, ఇది ఇప్పటి వరకు సంయమనం పాటించడాన్ని సూచిస్తుందని ఆయన పేర్కొన్నారు.

**ప్రతీకార చర్యల హెచ్చరిక...**

అమెరికా సిబ్బందిపై గతంలో జరిగిన దాడులకు ప్రతిస్పందనగా ఈ హెచ్చరిక ఉండేలా అమెరికా అధ్యక్షుడు రూపొందించారు. అనేక దశాబ్దాలుగా అమెరికా సైనికులు, ఇతరుల మరణాలకు ఇరాన్‌దే బాధ్యత అని ఆరోపిస్తూ, దీనిని సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న శత్రుత్వంగా ఆయన అభివర్ణించారు. చర్చలు విఫలమైనా లేదా కీలక డిమాండ్లను విస్మరించినా, భవిష్యత్తులో తీసుకునే ఏ చర్య అయినా ప్రతీకార చర్యగానే ఉంటుందని ట్రంప్ అన్నారు. దౌత్యపరమైన సంప్రదింపులను కొనసాగిస్తూనే, సైనిక చర్యలకు దిగే అవకాశాన్ని కూడా కలిగి ఉండాలనే ఆయన ద్వంద్వ వైఖరిని ఆయన వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ప్రకటన ఆ ప్రాంతంలోని సున్నితమైన పరిస్థితిని నొక్కి చెబుతోంది. అక్కడ చర్చలు పురోగమిస్తున్నప్పటికీ ఉద్రిక్తతలు అధికంగానే ఉన్నాయి. చర్చలు విజయవంతమవుతాయా లేదా, రాబోయే రోజుల్లో హొర్ముజ్ జలసంధిని తిరిగి తెరుస్తారా లేదా అనే దానిపై చాలా ఆధారపడి ఉంటుంది.

# చిత్తశుద్ధి ఉంటే కుల వ్యవస్థను రద్దు చేయండి

**పార్లమెంట్, న్యాయవ్యవస్థ, రాష్ట్రపతికి మందకృష్ణ డిమాండ్**

**మతం మారితే ఎస్సీ హోదా రద్దు తగదు**

**ఈ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధం**



**హైదరాబాద్, మార్చి 30 (వుదయం ప్రతినిధి) :** పార్లమెంట్, న్యాయవ్యవస్థ, రాష్ట్రపతికి చిత్తశుద్ధి ఉంటే దేశంలో కుల వ్యవస్థ రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాప అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ్ ప్రెస్ క్లబ్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. క్రిస్టియన్ మతంలోకి మారాక ఎస్సీ హోదా ఉండదని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మందకృష్ణ స్పందించారు. దళితులు క్రిస్టియన్‌గా మారితే వారి ఎస్సీ హోదా రద్దు అవుతుందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. క్రిస్టియన్ గా మారితే ఎస్సీ హోదా రద్దు చేయడం కాదు దేశంలో కుల వ్యవస్థను రద్దు చేయాలన్నారు. 1950లో వచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగా సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చిందని అయితే ఈ ఉత్తర్వులే రాజ్యాంగ విరుద్ధమని ఇవి వివక్షతో కూడిన ఉత్తర్వులు అన్నారు. కుల వ్యవస్థను రద్దు చేసే చర్యల కోసం ముందుకు ఏ పార్టీ, ఏ సంస్థ తీసుకున్నా దానిని స్వాగతిస్తామని, వారికి అండగా నిలబడతామన్నారు. ఈ కుల వ్యవవస్థలో అత్యంత బాధితులు దళితులేనన్న మందకృష్ణ...పశువులకంటే హీనంగా చూడబడ్డది దళితులేనన్నారు. ఈ దేశ కులవ్యవస్థలో బ్రాహ్మణేతర వర్గాలన్ని బాధితులేనన్నారు. కుల వ్యవస్థలో ఏ రెండు కులాల మధ్య సాఫీక సామరస్యత లేదనీ కానీ అన్నీ కులాల మీద ఆధిపత్యం, గౌరవం పొందుతున్నది మాత్రం బ్రాహ్మణ వ్యవస్థ అన్నారు. తాము కుల వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కుల వ్యవస్థను ఏ రాజకీయ పార్టీ సమర్థిస్తదో బహిరంగ పరచాలన్నారు. అస్పృశ్యత ఏ వ్యవస్థ నుంచి రాజకీయ పార్టీలు బహిరంగ పరచాలన్నారు. సమానత్వాన్ని కోరుకునే కుల వ్యవస్థ రద్దు చేయాలని కోరుకుంటారు. సమాజంలో అసమానతలను కోరుకునే వారు కుల వ్యవస్థను కోరుకుంటారు. అందువల్ల కుల వ్యవస్థ ఉండాలనుకునే వారెవరో, కుల వ్యవస్థ రద్దు కోరుకునే వారెవరో బహిరంగంగా రావాలని డిమాండ్ చేశారు.

# 11 మంది ఎమ్మెల్సీల సస్పెన్షన్

మొదటి పేజీ తరువాయి..

సభ్యులు ఆందోళన విరమించాలని ఛైర్మన్ చెప్పినప్పటికీ.. వినకుండా సభా కార్యకలాపాలకు అడ్డుపడటం సరికాదని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనను మంత్రి గుర్తు చేశారు. అదే సమయంలో ఉద్దేశపూర్వకంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు సభలో గందరగోళం సృష్టిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి జోక్యం చేసుకున్న మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.. పదకొండు మంది బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. వారిని సోమవారం ఒక రోజంతా సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత సభ్యులను సభ నుంచి మార్షల్స్ బయటికి పంపించేశారు. అనంతరం శాసనమండలి కొద్దిసేపు వాయిదా పడింది. సస్పెండ్ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీల్లో మధుసూదనాచారి, రవీందర్‌రావు, దేశపతి శ్రీనివాస్, ఎల్. రమణ, యాదవరెడ్డి, సుంకరి రాజు, నవీన్ కుమార్‌రెడ్డి, మధుసూదన్, వాణీదేవి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎం.కోటిరెడ్డి ఉన్నారు.

**పొంగులేటి రాజీనామా చేసేవరకూ పోరాటం...**

సభ నుంచి బయటికి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మీడియాతో మాట్లాడారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై వస్తున్న ఆరోపణల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి పొంగులేటి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేసేవరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సభలోనే కాకుండా బయట కూడా నిరసన కొనసాగిస్తామని తేల్చి చెప్పారు.

**యుద్ధం ఆపడానికి కేంద్రం చొరవ తీసుకోవాలి**

*డిప్యూటీ సీఎం భట్టి తీర్మానం సభ ఏకగ్రీవ ఆమోదం*

పశ్చిమ ఆసియాలో ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య మొదలైన యుద్ధం అనేక రూపాంతరాలు చెంది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుంది. క్రూడాయిల్ (పెట్రోల్, డీజిల్, గ్యాస్) లాంటి వాటిపై ప్రతీ దేశ ఆర్థిక పరిస్థితులను ప్రభావితం చేసే విషయం మన అందరికి తెలుసు.క్రూడాయిల్ ఉత్పత్తి రవాణాల ఈ యుద్ధ ప్రభావానికి లోనై సరఫరాలో ప్రభావం చూపిస్తుంది. అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరన్ మరియు లెబనాన్ మీద దాడి చేస్తుంది. అలాగే ఇరాన్ కూడా గల్ఫ్ మరియు మిడిల్ ఈస్ట్ దేశాలలో ఉన్నటువంటి అమెరికా చెందిన డిఫెన్స్ స్థావరాలను టార్గెట్ గా చేసుకొని దాడి చేస్తుంది. ఈ దాడులు ఫైటర్ బాంబర్స్, బాలిస్టిక్ మిస్సెల్స్ డ్రోన్స్ వంటి అత్యంత ఆధునికమైన ఆయుధాలతో పరస్పర దాడులు చేసుకుంటున్నాయి. ఇటువంటి మాస్ డిస్ట్రక్టివ్ ఆయుదాలతో జరిగే ఈ విధ్వంసంలో అనేక మంది అమాయకులు దాదాపు 4,000 మంది మరణించారు.

ఈ మరణాలతో పాటు, ఆర్థిక పరమైన విధ్వంసం మరొక ప్రక్కన జరుగుతుంది. మరణాలు అయా దేశాలకు మాత్రమే పరిమితమైతే, ఆర్థిక విధ్వంసం మాత్రం ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది. మరీ ముఖ్యంగా ఆసియా దేశాలకు మరింత ప్రమాదకరంగా మారింది. మన దేశం పైన కూడా తీవ్రమైన ప్రభావం కనపడుతుంది. కనీసం ఇంతటితోనైనా ఈ యుద్ధాన్ని ఆపకపోతే ప్రపంచ భవష్యత్తు ఆందోళనకరంగా మారుతుంది. ఈ యుద్ధం ఇలాగే కొనసాగినా, ఆపకపోయిన ఇది మూడో ప్రపంచ యుద్ధానికి కూడా దారితీయవచ్చు. ఇది ప్రపంచ మానవాళి మనుగడకే ముప్పు. ఇటువంటి అత్యంత ప్రమాదకర పర్యవసనాల దృష్ట్యా భారత ప్రభుత్వం చొరవ తీసుకుని యుద్ధాన్ని ఆపడానికి ప్రపంచ శాంతిని నెలకొల్పడానికి తగిన చొరవ తీసుకోవాలని ఈ సభ కోరుతూ తీర్మానాన్ని ప్రవేశ పెడుతున్నాం.

**వాట్సాప్ గ్రూప్ సభ్యులందరిపై చర్యలు తీసుకునేలా ఉంది**

*బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి*

శాంతిభద్రతల పేరుతో తీసుకువస్తున్న హేట్ స్పీచ్ బిల్లును మేం పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. ఈ బిల్లు ప్రజాస్వామ్యానికి హానికరం. ఈ బిల్లులోని శిక్షలకు ముందస్తు బెయిల్ ఉండదు. రాజకీయ ప్రత్యర్థులను నియంత్రించేందుకు తీసుకువస్తున్న ఈ బిల్లు ఇవాళ మీకు బాగానే అనిపించవచ్చు. కానీ అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని మీరు ప్రతిపక్షంలోకి రాగానే ఈ బిల్లును వ్యతిరేకించే అవకాశం ఉంది. బతికున్నవారిమీదనే భరోసా లేని ఈ సమాజంలో చనిపోయిన వ్యక్తుల మీదనో, నిజాంపాలకుల మీదనో, మరెవరో రచయితల మీదనో మాట్లాడినా కూడా కేసులు పెట్టేలా నిబంధనలు ఇందులో ఉన్నాయి. ఇలాంటి చట్టాలు చేసే ముందు ఆలోచించుకోవాలి. ఇందులోని సెక్షన్ 4 ప్రజాస్వామ్యానికి డెత్ వారెంట్ లాంటిది. ఏదైనా వాట్సాప్ గ్రూప్ లో అడ్మిన్ వేసే పోస్టుకు గ్రూప్ లోని సభ్యులందరిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీనిపై ఎలాంటి క్లారిటీ లేదు.

**బ్రిటిషన్ కాలంలో ఇలాంటి చట్టాలు**

*సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు*

ఈ హేట్ స్పీచ్ బిల్లును నేను వ్యతిరేకిస్తున్న. ఇది రాజకీయాలతో సంబంధించినదని కాదు. భావ స్వేచ్ఛ, భాషా, కవులు, కళాకారులు, సాంస్కృతిక రంగాలపై అన్ని రకాలుగా దాడులు చేయడానికి ఉపయోగపడుతుంది. బ్రిటీష్ కాలంలో ఇటువంటి బిల్లులు ఉండేవి. ఈ బిల్లులో స్పష్టత లేదు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం చేతిలో ప్రజాస్వామ్యం బంధిగా ఉంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా తోడైతే ఇక చెప్పుకోవడానికి ఏమీ ఉండదు. ఉపా చట్టం కింద ఎవరినైనా ఎప్పుడైనా లోపల పెడుతున్నారు. ఎన్ఐఏ ఎవరినైనా అరెస్టు చేస్తున్నారు.

**ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్‌కు ఎలాంటి భంగం లేదు**

*మంత్రి పొన్నం*

మానవ హక్కులను హరించే విషయాలు ఈ బిల్లులో లేవు. కక్ష సాధింపు కోసమే, ఎవరికో అన్యాయం చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. ప్రజాస్వామ్యంలో విలువలు ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ బిల్లును తీసుకువచ్చాం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19కు సంబంధించిన ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్ కు ఎలాంటి భంగం కలిగించదు. ఈ బిల్లు విషయంలో విపక్ష సభ్యుల ఆలోచనలో పొరపాటు ఉంది. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించడం చాలా తప్పు. ఈ బిల్లులోని అంశాలు అందరికీ వర్తిస్తాయి.



**'రోడ్ల నెట్‌వర్క్'తో ఆర్థిక విప్లవానికి పునాది**

*ఆర్అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి*

ప్రజా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తూ ఆర్థిక విప్లవానికి పునాది వేస్తోంది. మంచి రోడ్డు ఆర్థిక ప్రగతికి మొదటి అడుగు. రోడ్డు అంటే కేవలం దూరాన్ని తగ్గించే మార్గం మాత్రమే కాదు.. అవకాశాలను దగ్గర చేసే అద్భుత సాధనం అని మేం భావిస్తున్నాం. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ అమలు చేస్తోంది. ఈ విధానం కింద 12,000 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఫేజ్-1లో సుమారు రూ. 13,006కోట్ల వ్యయంతో 6,092 కి.మీ రోడ్ల పనులను చేపడుతున్నాం. 30 నెలల్లో నిర్మాణం పూర్తి చేసి, 15 ఏళ్ల పాటు పటిష్టమైన నిర్వహణ చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత 27 నెలల్లో రూ. వేల కోట్లతో వందల కిలోమీటర్ల రోడ్లు, డజన్ల కొద్దీ వంతెనల నిర్మాణాన్ని పూర్తి చేశాం. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్-విజయవాడ 6 లేన్ల విస్తరణ, అమరావతి-బందరు పోర్టు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర రూపురేఖలను మార్చేస్తాయి. చెన్నై, పుణే, బెంగళూరు తదితర నగరాలను కలుపుతూ హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ కారిడార్లను ఏర్పాటు చేయబోతున్నాం. దీనికోసం శంషాబాద్ సమీపంలోని 'ఫ్యూచర్ సిటీ'లో 500 ఎకరాలను కేంద్ర బిందువుగా ప్రభుత్వం కేటాయించనుంది. రాష్ట్రంలో ఆర్అండ్ బి శాఖ పరిధిలోని 29,079 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులు, 4,983 కిలోమీటర్ల జాతీయ రహదారులతో కలిపి మొత్తం 34,062 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధిపై మేము ప్రత్యేక దృష్టి సారించాం. అర్బన్, ఇండస్ట్రియల్ రోడ్ల విస్తరణ ద్వారా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే మా లక్ష్యం. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రోడ్ల ద్వారా రైతు పండించిన పంటను మార్కెట్‌కు చేరవేయడం.. విద్యార్థులకు విద్యావకాశాలు.. రోగులకు సకాలంలో వైద్యం.. యువతకు ఉపాధి మార్గాలను సుగమం చేస్తున్నాం. దేశంలో, రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తెలంగాణలో సగటున రోజుకు 18 నుంచి 20 మంది ప్రాణాలు కోల్పోతుండటం, అందులోనూ యువతే ఎక్కువగా ఉండటం విచారకరం. "అరైవ్ - అలైవ్" వంటి కార్యక్రమాల ద్వారా రోడ్డు అభివృద్ధిని కేవలం మౌలిక సదుపాయాల కల్పనగానే కాకుండా.. ప్రజల ప్రాణాలను కాపాడే బాధ్యతగా మా ప్రభుత్వం భావిస్తోంది. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణమే మా ప్రాధాన్యత. నగర ప్రజలకు మెరుగైన వైద్య, మౌలిక వసతులు కల్పించే దిశగా ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నలువైపులా రూ. 8 వేల కోట్లతో నిర్మిస్తున్న నాలుగు టిమ్స్ ఆస్పత్రుల్లో.. సనత్‌నగర్‌లో రూ.2 వేల కోట్లతో చేపట్టిన టిమ్స్ పనులు జూన్ నాటికి ప్రారంభ దశ పూర్తవుతుంది. అలాగే ఉస్మానియా కొత్త ఆసుపత్రి, కొత్త హైకోర్టు భవనాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.

**ఉద్యమకారులను గుర్తించి ఆదుకోవాలి**

*శాసన మండలిలో ఎమ్మెల్సీ విజయశాంతి*

తెలంగాణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులు లేకపోతే, నేడు రాష్ట్రంలో ముఖ్యమంత్రులు, మంత్రులు ఉండేవారు కారు. పదవుల కంటే ముందు వారి త్యాగాలను గుర్తించాలి. ఎన్నికల సమయంలో ప్రజలతో పాటు వివిధ సందర్భాల్లో ఉద్యమకారులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం తప్పనిసరిగా నిలబెట్టుకోవాలి. ఉద్యమకారులను ఆదుకోవడమనేది ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం సక్రమంగా నిర్వర్తిస్తే అది చరిత్రగా నిలుస్తుంది.. వారిని నిర్లక్ష్యం చేస్తే మాత్రం అది చారిత్రక తప్పిదంగా మిగిలిపోతుంది. ఇప్పటికైనా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులను గుర్తించి, వారికి తగిన గౌరవం, పునరావాసం కల్పించాల్సిన అవసరం ఉందని నేను ప్రభుత్వానికి సూచిస్తున్న.

# రుణభారం పెరుగుతోంది జాగ్రత్త




**ప్రభుత్వానికి కాగ్ హెచ్చరిక**

**నష్టాల్లో మెజార్టీ శాఖలు**

**83 ప్రభుత్వ రంగ సంస్థల్లో ఆరు మాత్రమే లాభాల్లో**

**ప్రభుత్వ రంగ సంస్థల తీరుపై విస్తుపోయే నిజాలు**

**బడ్జెట్ కేటాయింపుల కంటే రూ.31,229 కోట్లు అదనపు ఖర్చు**

**రూ 5.62 లక్షల కోట్లకు చేరిన రాష్ట్ర అప్పులు**

**ఎఫ్.ఆర్.బి.ఎం నిబంధనలను మించిన రుణ పరిమితి**

**నష్టాల్లో ఉన్న ప్రభుత్వ సంస్థల పనితీరుపై తక్షణమే సమీక్ష నిర్వహించాలి**

**హైదరాబాద్, మార్చి 30 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణలోని ప్రభుత్వ రంగ సంస్థల తీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విస్తుపోయే నిజాలును బట్టబయలు చేసింది. తెలంగాణ రాష్ట్ర రుణ భారం భారీగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్ర మొత్తం అప్పులు రూ5.62 లక్షల కోట్లకు చేరాయని, ఇది జీఎస్‌డీపీలో 34.29 శాతంగా ఉందని తెలిపింది. ఎఫ్.ఆర్.బి.ఎం నిబంధనల ప్రకారం ఉండాల్సిన 32.8శాతం పరిమితిని రాష్ట్రం మించిపోయినట్లు వెల్లడించింది. బడ్జెట్ కేటాయింపుల కంటే రూ.31,229 కోట్లు అదనంగా ఖర్చు చేయడం ఆర్థిక అస్తవ్యస్తతకు నిదర్శనమని కాగ్ వివరించింది. మరోవైపు నష్టాల్లో ఉన్న ప్రభుత్వ సంస్థల పనితీరుపై తక్షణమే సమీక్ష నిర్వహించాలని కాగ్ ప్రభుత్వానికి కీలక సూచన చేసింది. ఎకౌంట్స్ సబ్మిట్ చేయడంలో ఆలస్యాన్ని నివారించాలని, పర్యావరణ నిధుల ఏర్పాటులో కఠినంగా వ్యవహరించాలని కోరింది. ముఖ్యంగా వ్యర్థాల నిర్వహణలో వార్డ్ లెవెల్ కమిటీలను ఏర్పాటు చేసి, మానిటరింగ్ టీమ్‌ల ద్వారా పర్యవేక్షణ పెంచాలని అప్రమత్తం చేసింది. ఈ మేరకు కాగ్ సోమవారం రాష్ట్ర ఆర్థిక, ప్రస్తుత అంశాలను వెల్లడించింది.

2023 మార్చి వరకు పబ్లిక్ సెక్టార్ పనితీరుపై కాగ్ తన నివేదికలో కీలక సమాచారం వెల్లడించింది. రాష్ట్రంలోని మెజారిటీ సంస్థలు నష్టాల ఊబిలో కూరుకుపోయాయని, కనీసం లెక్కలు సమర్పించడంలోనూ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని స్పష్టం చేసింది. రాష్ట్రంలో మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నట్టు స్పష్టం చేసింది. వాటిలో 16సంస్థలు మూతపడినవి లేదా లిక్విడేషన్‌లో ఉన్నట్టు కాగ్ నివేదికలో వెల్లడైంది. 67 పని చేస్తున్న సంస్థల్లో 49 సంస్థలు ఖాతాలు సమర్పించడంలో ఆలస్యం చేశాయి. కేవలం 18 సంస్థల పనితీరే విశ్లేషణకు తీసుకున్నట్టు తెలిపింది. ఈ 18 సంస్థల టర్నోవర్ రూ.95,204 కోట్లుగా నివేదిక చెబుతోంది. 18 సంస్థల్లో 11 నష్టాల్లో, కేవలం ఆరు సంస్థలు మాత్రమే లాభాల్లో ఉన్నట్లు రిపోర్టు ఇచ్చింది. ఆయా సంస్థల్లో మొత్తం పెట్టుబడులు రూ. 98,572 కోట్లుగా నమోదయ్యాయి. వీటిలో తొమ్మిది సంస్థల నెట్‌విలువ పూర్తిగా నష్టాలతో కరిగిపోయింది. మొత్తం నెట్‌విలువ రూ.-50,930 కోట్లుగా తగ్గింది. 71 సంస్థలు సమయానికి ఖాతాలు సమర్పించకపోవడంపై కాగ్ ఆందోళన వ్యక్తం చేసింది. అలాగు సంస్థల పాలనలో తీవ్ర లోపాలున్నట్లు కాగ్ నివేదిక వెల్లడించింది.15 సంస్థల్లో 9సంస్థలు స్వతంత్ర డైరెక్టర్ల నియామకం చేయలేదు. ఎక్కడా ఇండిపెండెంట్ డైరెక్టర్ల సమావేశాలు నిర్వహించలేదు. ఐదు సంస్థల్లో ఆడిట్ కమిటీ లేకపోవడం గమనార్హం. తొమ్మిది సంస్థల్లో ఎన్ఆర్సీ కమిటీ ఏర్పాటు కాలేదు. అలాగే.. సింగరేణి కంపెనీపై కాగ్ ప్రత్యేక ఆడిట్ నిర్వహించింది. డీజిల్ వినియోగంలో భారీ వ్యత్యాసాలు గుర్తించింది. కాగ్ నివేదిక ప్రకారం.. కొన్ని ఒప్పందాల్లో అవసరానికి మించి డీజిల్ వినియోగం జరిగింది. కాంట్రాక్టుల్లో లోపాల వల్ల రూ. 251 కోట్ల అనవసర ఖర్చులు చేశారు. ఒప్పంద నిబంధనలు అమలు కాక రూ.74 కోట్ల అదనపు భారం పడింది. కోల్ రవాణాలో లోపాలు రూ. 25 కోట్ల నష్టం వాటిల్లింది. ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీల వల్ల రూ. 1,078 కోట్ల అదనపు వసూళ్లు జరిగాయి. పర్యావరణ నిబంధనలు పాటించకలేదు. కాంట్రాక్టర్లు ఎఫ్లువెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయలేదు. నష్టాల్లో ఉన్న సంస్థల పనితీరు సమీక్షించాలి. ఖాతాలు త్వరగా పూర్తి చేయాలని కాగ్ సూచించింది. మూతపడిన సంస్థలపై పునరుద్ధరణ లేదా మూసివేతపై నిర్ణయం అవసరమని పేర్కొంది. డీజిల్ వినియోగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్టుల్లో కఠిన నిబంధనలు అమలు చేయాలి. పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలని నివేదిక స్పష్టం చేసింది. మరోవైపు రాష్ట్రంలోని అర్బన్ లోకల్ బాడీస్ లో ఆర్థిక క్రమశిక్షణ పూర్తిగా లేకుండా పోయిందని కాగ్ చెప్పింది. సుమారు రూ. 324.96 కోట్ల రూపాయల లైబ్రరీ సెస్ సరిగా వసూలు కాలేదని రిపోర్ట్ లో పేర్కొంది. జీహెచ్ఎంసీ పరిధిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలు గాలికి వదిలేశారని చెప్పిన కాగ్.. చెత్త వర్గీకరణ లక్ష్యం అమలు కాకపోవడం, మిక్స్‌డ్ వేస్ట్‌ను నేరుగా డంపింగ్ యార్డులకు తరలించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. డ్రై వేస్ట్ ప్రాసెసింగ్ జరగకపోయినా కాంట్రాక్టర్లకు రూ.313.20కోట్లు చెల్లించదాన్ని కాగ్ రిపోర్ట్ ఎత్తి చూపింది.


# ఏప్రిల్ 9న మిలియన్ మార్చి కేసు విచారణ

**కేసులు కొటివేయాలని హైకోరును ఆశ్రయించిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు**

**హైదరాబాద్, మార్చి 30 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్ర సాధన పోరులో అత్యంత కీలకమైన 'మిలియన్ మార్చి' సందర్భంగా తమపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తెలంగాణ హైకోర్టులో దాకలు చేసిన పిటిషన్లపై విచారణ వచ్చే నెల 9కి వాయిదా పడింది. కేసులు కొట్టి వేయాలని కోరుతూ దాఖలైన పిటీషన్లను సోమవారం విచారణకు స్వీకరించిన హైకోర్టు.. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ప్రతివాదులైన ప్రభుత్వానికి, సంబంధిత పోలీసు అధికారులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను ఏప్రిల్ 9కి వాయిదా వేసింది. ఆ రోజున ప్రభుత్వం దాఖలు చేసే వివరణ ఆధారంగా కోర్టు తదుపరి నిర్ణయం తీసుకోనుంది. ఈ నేపథ్యంలో 2011లో ట్యాంక్‌బండ్‌పై జరిగిన మిలియన్ మార్చి సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు పాల్గొన్న తమపై రాజకీయ ప్రేరేపిత కేసులు నమోదయ్యాయని, వాటిని వెంటనే కొట్టివేయాలని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు.

# అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లులో ప్రమాదకర అంశాలు

**ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**



**హైదరాబాద్, మార్చి 30 (వుదయం ప్రతినిధి) :** న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లుకు సోమవారం శాసనసభ ఆమోదం తెలుపగా శాసనమండలిలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఈ బిల్లులో కొన్ని ప్రమాదకరమైన అంశాలు ఉన్నాయన్నారు. న్యాయవాదిని అరెస్టు చేయాలంటే ప్రత్యేకంగా అంశంగా పేర్కొన్నారన్నారు. న్యాయవాది నేరానికి పాల్పడితే పోలీసులు బీఎన్ఎస్ ప్రకారం నడుచుకోవాలా లేక ఇతను అడ్వకేట్ కాబట్టి ఈ బిల్లు ప్రకారం ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలా? నేరం చేసిన సాధారణ పౌరుడికి ఒక చట్టం, న్యాయవాదికి మరో చట్టమా దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ బిల్లులో అడ్వకేట్ అయితే ఒక ప్రక్రియ, ఇతరులైతే మరో ప్రక్రియ అనే భావన ఈ బిల్లులో కనిపిస్తోందన్నారు. ఈ బిల్లు న్యాయవాదులకు రక్షణ కాదు ప్రత్యేక రాయితీ కింద కనిపిస్తోందన్నారు. మరోవైపు.. ఈ బిల్లులో పేర్కొన్న కమిటీల రక్షణ ద్వారా న్యాయవాదులపై నిజమైన ఫిర్యాదులను కూడా చల్లార్చే ప్రమాదం ఉందన్నారు. ఒక మహిళా బాధితురాలు న్యాయవాదిపై ఫిర్యాదు చేస్తే ఆ ఫిర్యాదు ఈ కమిటీ వ్యవస్థ నిజాన్ని కనుగొంటుందా లేక సదరు న్యాయవాదికి రక్షణ గోడగా మారుతుందా స్పష్టత ఇవ్వాలన్నారు. హక్కులు విపరీతంగా ఉంచి బాధ్యతలు బలహీనంగా పొందుపర్చారన్నారు.

# ఒకేసారి 3 నెలల రేషన్

- ఏప్రిల్ నెల మొత్తం బియ్యం పంపిణీ
- చర్యలు చేపట్టిన అధికారులు
- సాఫ్ట్ వేర్ అప్ డేట్

**హైదరాబాద్, మార్చి 30 (వుదయం ప్రతినిధి) :** రేషన్ పంపిణీకి సంబంధించి.. కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 3 నెలల బియ్యాన్ని సరఫరా చేయాలని నిర్ణయించింది. అయితే అందుకు ప్రధాన కారణం.. గత సీజన్లకు సంబంధించిన రేషన్ బియ్యం నిల్వలు పెరిగిపోవడంతో ఆ స్టాక్‌ను ఖాళీ చేసేందుకు.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక త్వరలో ఈ సీజన్ బియ్యం కూడా రానుండటంతో.. ఆలోగా ఉన్న నిల్వలను రేషన్ కార్డు దారులకు పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి రాష్ట్రాలకు కీలక సూచనలు చేసింది. భారీగా రేషన్ బియ్యం గోదాముల్లో పేరుకుపోవడంతో.. ఆ స్టాక్ మొత్తం ఖాళీ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే వచ్చే 3 నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని ఒకే నెలలో పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని.. ఏప్రిల్ నెలలోనే సరఫరా చేయనుంది. అయితే ఏప్రిల్ నెల మొత్తం రేషన్ బియ్యం పంపిణీ కొనసాగుతుందని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే ఒకేసారి 3 నెలల బియ్యం సరఫరాకు అధికారులు చర్యలు చేపట్టారు. మరోవైపు.. రాష్ట్రంలో కొత్త రేషన్ దుకాణాలు కూడా అందుబాటులోకి రానున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

**విరివిగా నిల్వలు...**

గత సీజన్లలో సేకరించిన ధాన్యం నిల్వలు పెరిగిపోవడం.. మరోవైపు మిల్లింగ్ పూర్తి అయి వచ్చిన బియ్యంతో గోదాముల్లో భారీగా నిల్వలు పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలోనే ఈ నిల్వలను వెంటనే పంపిణీ చేసేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు రేషన్ బియ్యం తరలింపు ప్రక్రియ ప్రారంభమైంది. రేషన్ బియ్యం సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని.. అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**వేలిముద్ర ఎలా..?**

ఒకేసారి వేలిముద్ర వేస్తే లబ్ధిదారులకు 3 నెలల కోటాను అందించాలా లేక 3 నెలల రేషన్ కోసం 3 సార్లు వేయాలా అనే దానిపై అధికారులు చర్చిస్తున్నారు. ఒక్కొక్కరూ 3 సార్లు వేలి ముద్రలు వేయాలంటే.. రేషన్ దుకాణాల వద్ద బియ్యం సరఫరా ఆలస్యమై భారీగా క్యూ లైన్లు పెరిగిపోతాయనే ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి.. ఒకసారి వేలి ముద్ర వేసినా.. 3 నెలల బియ్యాన్ని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసి.. ఏప్రిల్ 1వ తేదీ నాటికి.. బియ్యం పంపిణీ చేసేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఎఫ్‌సీఐ (భారత ఆహార సంస్థ) వద్ద భారీగా బియ్యం నిల్వలు పేరుకుపోయి ఉండడంతో.. కొత్తగా ఈ సీజన్‌లో వచ్చే ధాన్యానికి చోటు లేకుండా పోయింది. గత వర్షాకాలం, యాసంగి సీజన్లలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) భారీగా గోదాముల వద్దకు చేరుతోంది. ఈ నేపథ్యంలోనే ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన బియ్యం.. ఆదివారం నుంచి రేషన్ షాపులకు సరఫరా అవుతోంది.

అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రేషన్ డీలర్లకు పెద్ద తలనొప్పిగా మారింది. ఒకేసారి 3 నెలలకు సరిపడా స్టాక్‌ను అందుబాటులో ఉంచుకునేందుకు రేషన్ దుకాణాల్లో సరిపడా స్థలం లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒకేసారి వందల క్వింటాళ్ల బియ్యాన్ని తమ వద్ద ఉంచుకునేంత పరిస్థితి లేకపోవడంతో.. డిమాండ్‌కు తగ్గట్లు రేషన్ డీలర్లకు బియ్యం సరఫరా చేయలని పౌరసరఫరాల శాఖ అధికారులు భావిస్తున్నారు. మరోవైపు.. ఏప్రిల్ నెల నుంచే.. రాష్ట్రంలో కొత్త రేషన్ దుకాణాలను ప్రారంభించనున్నట్లు తెలంగాణ పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. కొత్త రేషన్ షాపులను ఓపెన్ చేయడం వల్ల ప్రజలకు రేషన్ సరుకులను సరఫరా చేయడంలో మరింత వేగం పెరుగుతుందని తెలిపారు.



# గ్రేటర్ హైదరాబాద్



## ఆస్తి పన్ను బకాయిలు చెల్లించండి

- ఓటీఎస్ కింద రాయితీ పొందేందుకు చివరి తేదీ ఈ నెల 31
- వడ్డీపై 90 శాతం రాయితీ పొందండి: కమిషనర్ ఆర్ వి కర్ణన్



**హైదరాబాద్, మార్చి 30 (వుదయం):** వన్ టైం సెటిల్మెంట్ స్కీం కింద ఆస్తి పన్నుబకాయిలపై వడ్డీపై 90 శాతం మాఫీ పొందేందుకు ఈ నెల 31 వ తేదీ తుది గడువు అని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న గృహ యజమానులు ఆస్తి పన్ను బకాయిలు తక్షణమే చెల్లించి వడ్డీపై 90 శాతం రాయితీ పొందాలని కమిషనర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 202526 సంవత్సరంకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిలు ఈ నెల 31 వ తేదీలోగా చెల్లించే వారికి ఓటీఎస్ పథకం కింద వడ్డీపై 90 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఆస్తిపన్ను బకాయిలు ఆన్లైన్ లో మాత్రమే స్వీకరిస్తామని కమిషనర్ తెలిపారు. ఆన్లైన్ వేదికలైన www ghmc.gov.in పోర్టల్, MyCURE యాప్, మీ సేవ కేంద్రాలు సిటిజన్ సర్వీస్ సెంటర్ లలో తక్షణమే చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి తద్వారా నగరాభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఆస్తి పన్ను మొండి బకాయిదారుల పై జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

## ఎన్ఎస్ఎస్ శిబిరం విజయవంతం




**చేవెళ్ల, మార్చి 30 (వుదయం):** చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కమ్మెట గ్రామంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం విజయవంతంగా సోమవారం ముగిసింది. మార్చి 23 నుండి 30 వరకు వారం రోజుల పాటు జరిగిన ఈ శిబిరంలో విద్యార్థి వాలంటీర్లు సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామ సేవ, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహణ విద్యార్థుల్లో సేవాభావం, నాయకత్వ లక్షణాలు పెంపొ గ్రామస్తులతో పరస్పర చర్చలు, శుభత చేశారు. విజయవంతం ప్రారంభోత్సవం, శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. కాంచనలత ప్రారంభించగా, జెడ్పిహెచ్ఎస్ కమ్మెట ప్రధానోపాధ్యాయులు జితేందర్ విద్యార్థులకు సేవా భావం, క్రమశిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. మాలెక్టివ్ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందించి, సమాజ సేవలో నిరంతరం పాల్గొనాలని సూచించారు. డా. ఎం.ఎ. మాలిక్ ఎన్ఎస్ఎస్ ప్రాధాన్యతను వివరించారు. శ్రీ జితేందర్ విద్యార్థుల సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఎం. రమేష్ బాబు శిబిర కార్యక్రమాలను సమీక్షించి ప్రిన్సిపాల్ అధ్యాపకులు గ్రామస్తుల అతిథులు మరియు వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## డయాలసిస్ సేవలు పునరుద్ధరణ

**మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకటరెడ్డికి సన్మానం**



**చేవెళ్ల, మార్చి 30 (వుదయం):** చేవెళ్ల మున్సిపాలిటీ లోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి ముందుకొచ్చారు. రూ.50 వేల వ్యయంతో ఆసుపత్రిలో వైరింగ్, పైపులైన్ పనులను పూర్తి చేయించి డయాలసిస్ సేవలను మళ్లీ సోమవారం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సేవల్లో డయాలసిస్ రోగులు చైర్పర్సన్ను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ... ప్రజలకు సేవ చేయడం తమ బాధ్యత అని, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లియాకత్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాజేంద్రప్రసాద్, చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజా ఆగిరెడ్డి, మద్దెల శ్రీనివాస్, తాళ్లపల్లి నర్సింలు, కృష్ణ నాయక్, మాజీ సర్పంచ్ అరుంధతి సాయిరెడ్డి పాల్గొన్నారు.

## పెంచిన స్కూల్ ఫీజులు తగ్గించాలి

**సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన**




**మేడిపల్లి, మార్చి 30 (వుదయం ప్రతినిధి):** బోడుప్పల్ జీహెచ్ఎంసీ సర్కిల్ లోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ లో ఫీజు అధికంగా పెంచారంటూ సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాఠశాల యాజమాన్యం ప్రతి సంవత్సరం ఫీజులు అధికంగా పెంచడంతో భారం పెరుగుతుందని వాపోయారు. పాఠశాలలో జాయిన్ అయినప్పుడు 2 నుండి 5 శాతం పెంచుతామని తెలియజేసి ఇప్పుడు ఏకంగా 15 నుండి 20 శాతం ఫీజులు పెంచడంతో విద్యార్థులను చదివించాలంటే భారం ఎక్కువ అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫీజు అలస్యంగా కట్టడంతో అపరాధ రుసుము (పెనాల్టీ) పేరుతో అధికంగా కడుతున్నామని, యూనిఫామ్ స్కూల్ బుక్స్ మార్కెట్ తో పోలిస్తే ఇక్కడ అధిక ధరలు పెరుగుతుందని ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికైనా పాఠశాల యాజమాన్యం స్పందించి పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటికే అక్రమ దందాకు అడ్డా!

**బంజారాహిల్స్‌లో భారీ అక్రమ గ్యాస్ నిల్వల గుట్టురట్టు**

**పది మంది ముఠా అరెస్ట్.. 414 సిలిండర్లు స్వాధీనం**




**బంజారాహిల్స్, మార్చి 30 (వుదయం) :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వంటగ్యాస్ బండలను నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయిస్తున్న భారీ ముఠా గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు బయటపెట్టారు. బంజారాహిల్స్ పరిధిలో సోమవారం జరిగిన ఈ మెరుపు దాడిలో పది మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి లక్షలాది రూపాయల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయమైన సమాచారం మేరకు హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులతో కలిసి ఉమ్మడిగా ఈ దాడులు నిర్వహించింది. శంషాబాద్ కేంద్రంగా 'మెట్రో గ్యాస్ సంస్థ'ను నడుపుతున్న మొహమ్మద్ అమీర్ అనే వ్యక్తి ఈ అక్రమ వ్యాపారానికి ప్రధాన సూత్రధారిగా తేలింది. ఇతడు బంజారాహిల్స్ నాగార్జున చౌరస్తా సమీపంలోని ఒక శ్మశాన వాటికను అక్రమ నిల్వ కేంద్రంగా మార్చుకున్నాడు. నిబంధనలను తుంగలో తొక్కి, ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ మొత్తానికి ఖాతాదారులకు విక్రయిస్తూ అక్రమంగా లాభాలు గడిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ దాడిలో పోలీసులు వివిధ పరిమాణాల్లో ఉన్న మొత్తం 414 గ్యాస్ బండలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మొహమ్మద్ అమీర్‌తో పాటు, అతడికి సహకరిస్తున్న పంపిణీదారులు, వాహన చోదకులు, కూలీలు, సదరు స్థలాన్ని అద్దెకు ఇచ్చిన వ్యక్తితో కలిపి మొత్తం పది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీటితో పాటు నిల్వ ఉంచిన బండలను తరలించేందుకు ఉపయోగిస్తున్న 10 రవాణా వాహనాలను సీజ్ చేశారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.21,88,000ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ నిరీక్షకులు చ. యదేందర్, ఉప నిరీక్షకులు డి. రవిరాజ్ బృందం ఈ దాడిని విజయవంతంగా నిర్వహించింది. పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ వెల్లడించారు.

## ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి



**రంగారెడ్డి, మార్చి 30 (వుదయం):** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (33) ఫిర్యాదులు అందాయి. ప్రజల నుండి వివిధ అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల వినతి పత్రాలు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని, వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమము కేవలం సమస్యలు విని దరఖాస్తులు స్వీకరించే విధంగా కాకుండా, పరిష్కారాల వేదికగా నిలిచేలా ప్రతి ఒక్కరు పని చేయాలని, ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సమస్యలు పరిష్కరించే వేదికగా మార్చాలని తెలిపారు. ఫిర్యాదులు సమర్పించడానికి వచ్చిన ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయం అందించడంలో అధికారులు సిబ్బంది చొరవ చూపాలని అన్నారు.

## భక్తి శ్రద్ధలతో కల్యాణ మహోత్సవం



**షాద్ నగర్, మార్చి 30 (వుదయం):** జానంపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ భక్తులతో కలిసి భక్తి భావంతో తిలకించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు ఆధ్వర్యంలో ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతూ, వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన అంజయ్య యాదవ్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి కూర్చొని కల్యాణ మహోత్సవాన్ని వీక్షిస్తూ, స్వామివారి దివ్య కృప ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ప్రాంత ప్రజలందరూ సుఖసంతోషాలతో, శాంతి సమృద్ధులతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. భక్తి, నమ్మకం మన జీవన విధానాన్ని మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు, మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, గోపాల్, ఎస్పీ శివ మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, కానుగు అనంతయ్య, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు..

## ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులు

**అట్లాస్ సంస్థకు ఘన సన్మానం**



**చేవెళ్ల, మార్చి 30 (వుదయం) :** చేవెళ్ల మండల పరిధిలోని సోమవారం మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)లో విద్యార్థుల సౌకర్యార్థం కీలక అభివృద్ధి పనులు చేపట్టబడ్డాయి. ఎన్ సి ఆర్ అట్లాస్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో నూతన టాయిలెట్స్ నిర్మాణం, శుద్ధమైన తాగునీటి కోసం వాటర్ ఫిల్టర్ ఏర్పాటు, అలాగే పాఠశాల భవనానికి పెయింటింగ్ పనులు పూర్తి చేయడం జరిగింది.ఈ పనుల కోసం మొత్తం రూ.12,50,000 వ్యయం చేశారు.ఈ సేవలకు గాను పాఠశాల యాజమాన్యం తరపున (ఎన్ సిఆర్ అట్లాస్) సంస్థ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎల్. పురం దాస్, (ఎన్ సిఆర్ అట్లాస్) ప్రతినిధి సాయి కృష్ణ (హూవినహోళె) ఫౌండేషన్ ప్రతినిధి నంది,అవార్డు ఇండియా ప్రతినిధి తపస్య, పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయులు హనుమంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, చేవెళ్ల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, రావులపల్లి సర్పంచ్ రామచంద్రయ్య, కుర కుమ్మెర గ్రామ ఉపసర్పంచ్ పాండు, గ్రామ పెద్దలు శివరాజ్, రవి, మల్లారెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 143 దరఖాస్తులు



**మేడ్చల్ / మల్కాజ్గిరి, మార్చి 30 (వుదయం):** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి తో కలిసి అదనపు కలెక్టరు (143) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ అండ్ సర్వే స్పెషల్ డిప్యూటి కలెక్టర్ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కేబీఆర్ పార్క్ ఫ్లైఓవర్ పనులపై సమీక్ష

**పనుల్లో మరింత వేగం పెంచాలి : అధికారులకు కమిషనర్ ఆదేశం**



**హైదరాబాద్, మార్చి 30 (వుదయం):** బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని పార్క్ హయత్ హోటల్ వద్ద జరుగుతున్న కేబీఆర్ పార్క్ ప్యాకేజ్ ఫ్లైఓవర్ పనులను కమిషనర్ ఆర్ వి కర్ణన్, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ తో కలిసి సోమవారం పరిశీలించారు.మొత్తం 6 పియర్ ఫౌండేషన్‌ల తవ్వకాలు పూర్తయ్యాయని, అందులో 3 పియర్‌లకు పీసీసీ బెడ్ పనులు పూర్తయ్యాయని అధికారులు కమిషనర్ కు తెలిపారు. రాఫ్ట్ ఫౌండేషన్‌ల కోసం స్టీల్ ఫ్యాబ్రికేషన్ పనులు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా పనులు సాగుతున్న తీరుపట్ల కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో మరింత వేగం పెంచేందుకు ఎంఈఐఎల్ (మెగా) సంస్థ అదనంగా మెషిన్ , మ్యాన్ పవర్ ను సమకూర్చుకోవాలని కమిషనర్ ఆదేశించారు. తనిఖీలో కమిషనర్ తో పాటు ఈఈ (ప్రాజెక్ట్స్), డీఈఈ, ఏఈఈ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాలికలకు ఎచ్ఐవి వ్యాక్సినేషన్



**మేడ్చల్ / మల్కాజ్గిరి, మార్చి 30 (వుదయం):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్, హాస్టల్స్, స్కూల్స్ లోని 14 నుంచి 15 సంవత్సరాల వయసు గల బాలికలకు అందరికి ఎచ్ఐవి వ్యాక్సినేషన్‌ను అందించేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. సోమవారం కీసర మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ నివారణకై బాలికలకు ఎచ్ఐవి వ్యాక్సినేషన్ అందించే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యాక్సిన్ ఎంత డోసు ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ తీసుకున్న బాలికలకు కలెక్టర్ ఎచ్ఐవి వ్యాక్సినేషన్ సర్టిఫికెట్ అందజేసారు. జిల్లాలోని బిసి, ఎస్సీ, మైనారిటి రెసిడెన్షియల్, హాస్టల్స్, స్కూల్స్ లలోని బాలికలకు కూడా ఎచ్ పివి వ్యాక్సినేషన్ అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య అధికారికి సూచించారు. దీనికి సంబంధించి డిఎంహెచ్ ఓ సంబంధిత శాఖల సమన్వయంతో పిల్లలందరిని మొబిలైజ్ చేసుకొని వ్యాక్సిన్ అందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డిఓ రాజేష్, జిల్లా డిఎంఅండ్ హెచ్ఓ ఉమాగౌరి, డిప్యూటి డిఎంహెచ్ఓ సత్యవతి, కౌషిక్ పిఓ, పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ మంజుల, బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్లో పారిశుధ్య సంక్షోభం



**శంకర్పల్లి, మార్చి 30 (వుదయం):** శంకర్పల్లి మున్సిపల్ పరిధిలోని ప్రధాన కూరగాయల మార్కెట్ పారిశుధ్య సమస్యలతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మార్కెట్‌లో ఏర్పాటు చేసిన సులభ్ కాంప్లెక్స్ నుంచి మురుగు నీళ్లు తరచూ పొంగిపొర్లుతూ మార్కెట్ మొత్తం అపరిశుభ్రంగా మారింది. దీంతో వ్యాపారులు, రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో రోజూ వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుండగా, దుర్వాసన భరించలేని స్థాయికి చేరింది. మురుగు నీటి నిల్వల కారణంగా ఈగలు, దోమలు విపరీతంగా పెరిగి ఆరోగ్య సమస్యలకు దారితీసే పరిస్థితి ఏర్పడింది. స్థానికుల ప్రకారం, ఈ సమస్య గత రెండేళ్లుగా కొనసాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మార్కెట్‌లోని రెండు సులభ్ కాంప్లెక్స్‌లలో ఒకటి పూర్తిగా పనికిరాకుండా ఉండగా, మరొకటి నుంచి వచ్చే మురుగు నీళ్లు డ్రైనేజీ సరిగా లేక బయటకు పొంగి మార్కెట్‌లోకి చేరుతున్నాయి. గాలి ప్రసరణ సరిగా లేకపోవడం వల్ల దుర్వాసన మరింత తీవ్రంగా మారింది. వ్యాపారులు ముక్కుకు గుడ్డలు కట్టుకుని వ్యాపారం చేయాల్సి వస్తుండగా, వినియోగదారులు కూడా మార్కెట్‌లో నిలవలేని పరిస్థితి ఏర్పడింది. కొందరు కొనుగోలు చేయకుండానే వెనుదిరుగుతున్నారని వ్యాపారులు చెబుతున్నారు. గత ఆదివారం పరిస్థితి మరింత దారుణంగా మారింది. మురుగు నీళ్లు మార్కెట్‌లోకి చేరడంతో రైతులు తమ కూరగాయలను అదే నీళ్లలో ఉంచి అమ్ముకోవాల్సి వచ్చింది. ఇది ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే అంటువ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది అప్పుడప్పుడు శుభ్రపరిచినా అది తాత్కాలిక పరిష్కారమే అవుతుందని, శాశ్వత చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని వ్యాపారులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వ్యాపారులు, రైతులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## బార్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**చేవెళ్ల, మార్చి 30 (వుదయం) :** చేవెళ్ల మున్సిపాలిటీ లోని జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం మధ్యాహ్నం నూతన అధ్యక్షుడు పాటి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి న్యాయవర్గ ప్రముఖులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు న్యాయమూర్తి బృంగి శ్రీనివాసులు, సీనియర్ సివిల్ న్యాయమూర్తి దశరథ రామయ్య, జూనియర్ సివిల్ న్యాయమూర్తి విజయకుమార్ ఉపాధ్యాయ మాట్లాడుతూ...కక్షిదారులకు సత్వర, ఖచ్చితమైన న్యాయ సేవలు అందించేందుకు బార్‌బెంచ్ మధ్య సమన్వయం కీలకమని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంపొందించేలా న్యాయవాదులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.సీనియర్ న్యాయవాది రాంరెడ్డి మాట్లాడుతూ...చేవెళ్ల కోర్టు రంగారెడ్డి జిల్లాలో ప్రత్యేక స్థానం సంపాదించిందన్నారు.సుమారు 40 సంవత్సరాల క్రితం నాలుగు మంది న్యాయవాదులతో మున్సిఫ్ కోర్టుగా ప్రారంభమైన ఈ కోర్టు, నేడు జిల్లా కోర్టుగా 151 మంది సభ్యులతో కొనసాగడం ప్రాంత అభివృద్ధికి నిదర్శనమని తెలిపారు.ఈ కార్యక్రమంలో నూతన మరియు గత పాలకవర్గ సభ్యులను న్యాయవాదులు పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్లు ఎన్. చంద్రశేఖర్, ఎన్. మాధురి, జనరల్ సెక్రెటరీ పి. మల్లేష్ యాదవ్, జాయింట్ సెక్రెటరీ ఈ. రవీందర్ రెడ్డి, ట్రెజరర్ ఈ. జనార్ధన్, స్పోర్ట్స్ & కల్చరల్ సెక్రెటరీ ఏ. ప్రభాకర్ రెడ్డి, లైబ్రేరియన్ టి. మహేష్, లేడీ రిప్రెసెంటేటివ్ ఈ. కవితతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎమ్. మహేష్, కె. సుదర్శన్, బి. ఆనంద్,సి ప్రవీణ్ రెడ్డి, కె. ప్రవీణ,బి మనీషా రెడ్డి మరియు ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE: AT SECUNDERABAD**
**OS NO. 482 / 2022**

**Between:**
State Bank of India, Retail Assets Central Processing Centre -I, SARC Wing, Patny Centre, Secunderabad, Rep. by its Manager
**...Plaintiffs**

**AND**

Mr. Thota Kumar
**...Defendant**

To,
Mr. Thota Kumar S/o Sri Jangaiah Thota R/o H.No. 2-95, Astakameshwari Nagar Kuntur, Pedda Amberpet, Rangareddy, Telangana-501505 O/o Supervisor Information & Reservation Office TSTDC-UN, Tankbund- Hyderabad-63.

Please take notice that the above-named plaintiff instituted the above suit against you as"Defendants for recovery of Rs 3,64,563-00 Ps You are hereby summoned to appear in this"court in person or by pleader duly instructed and able to answer all material questions 16 04-"2026 at 10.30 AM. In default of your appearance, the suit will be heard and decided in your"absence.

**(BY ORDER OF THE COURT)**

Sd/-
**D.K. Lakshmi Kumari, Advocate**
**Flat no.304, Manikanta Paradise Apart. Dwarakanagar, Phase-II, Uppal, Hyderabad-39**
**Counsel for the Plaintiff**




“ ఇరాన్ చమురుని తెచ్చుకోవడమే నా ప్రాధాన్యం. టెహ్రాన్ లోని ప్రధానమైన చమురు ఎగుమతి కేంద్రం ఖర్గ్ ఐలాండ్ కు అమెరికా సేనలను పంపగలదు. ఈ సంవత్సరం ప్రారంభంలో వెనెజువెలా నేత నికోలాస్ మదురోను పట్టుకొని అక్కడి ఆయిల్ నిల్వలను నిరవధికంగా స్వాధీనం చేసుకున్నమాదిరిగానే ఇరాన్ లోని ఆయిల్ ను అమెరికా సొంతం చేస్తాను. ఉన్నది ఉన్నట్టు చెప్పాలంటే ఇరాన్ ఆయిల్ ను తెచ్చుకోవడమే నాకు ప్రీతిపాత్రమైన విషయం. అది తప్పు అని అమెరికాలోని కొంతమంది మూర్ఖులు అంటున్నారు. ఖర్గ్ ఐలాండ్ లోని భారీ నిల్వలను వశపరచుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఖర్గ్ ద్వీపాన్ని మేము స్వాధీనం చేసుకోనూవచ్చు, చేసుకోకపోనూవచ్చు. మాముందు అనేక మార్గాలు ఉన్నాయి. మమ్మల్ని ఎదురించే శక్తి ఇరాన్ కు బొత్తిగా లేదు. మేము చాలా సులభంగా ఏమైనా చేయగలం. ”

* డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

## వే'మన'పద్యం

**ఎలుకతోలు దెచ్చి యేడాది యుతికిన**
**నలుపు నలుపేగాని తెలుపురాదు**
**కొయ్యబొమ్మ దెచ్చి కొట్టిన బలుకునా**
**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# కష్టాల్లో క్యూబా

వెనెజువెలాను ట్రంప్ పాదాక్రాంతం చేసుకొని దాని అధినేత మదురోను చెరబట్టి ఖైదీగా తీసుకుపోయి అక్కడి చమురునిల్వలను స్వాధీనం చేసుకున్న తర్వాత దాని తక్షణ ప్రత్యక్ష దుష్ప్రభావం క్యూబా మీద పడింది. ఒకప్పటి క్యాస్ట్రో క్యూబా వైపు కన్నెత్తి చూడడానికి భయపడిన అమెరికా ఇప్పుడు ఆ చిన్న మిన్న దేశాన్ని గుప్పెట్లో పెట్టుకుని దానితో క్రూర క్రీడ సాగిస్తున్నది. వెనెజువెలా నుంచి చమురు ఆగిపోవడంతో క్యూబా పరిస్థితి ఒడ్డున పడిన చేప మాదిరిగా తయారయింది.ఇంధన కొరతతో కరెంటు నిలిచి పోయింది. తరచూ షట్ డౌన్లతో అంధకారం అలముకున్నది. ఆఫీస్ ల పనిగంటలను పరి మి తం చేశారు. దుకాణాలు ఖాళీ అయిపోతున్నా యి. క్యూబాకు వస్తున్న ఆయిల్ ట్యాంకర్లను అమెరికా మధ్యలోనే ఆపివేస్తుండడం ములిగే నక్క మీద పిడుగు పాటులా నిరూపించుకుంటున్నది.ఫిడెల్ క్యాస్ట్రో 1959లో బాటిస్టా నియంత్రత్వాన్ని కూల దోసి అక్కడి అమెరికన్ ఆస్తులన్నీటినీ జాతీయం చేసినప్పటినుంచి ఆ రెండు దేశాలకు మధ్య ఉప్పు నిప్పుగా కొనసాగింది.సోవియెట్ యూనియన్ బలంగా ఉన్నంత కాలం క్యూబా పరిస్థితి తిరుగులేని విధంగా ఉండేది . సి ఐ ఎ కూడా విఫలమైంది. ఒబామా అధ్యక్షతన అమెరికా అటు ఇరాన్ తోనూ ఇటు క్యూబా తోనూ మెరుగైన సంబంధాలు పెట్టుకున్నది. ట్రంప్ రాకతో రెండు వైపులా పరిస్థితి తల్లకిందులైంది.గ్రిడ్ వైఫల్యంతో, ఆయిల్ నిల్వలు అడగంటడంతో క్యూబా కమ్యూనిస్టు పాలన తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయింది. ట్రంప్ మరింత సంక్షోభాన్ని సృష్టించి క్యూబాలో ప్రైవేటు పెట్టుబడులకు చోటు సాధిం చగలుగుతాడో లేక అక్కడి ప్రజలే ఈ గడ్డు పరిస్థితిని అధిగమించి నిలదొక్కుకోగలుగుతారో వేచి చూడాలి. పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యానికి, కమ్యూనిజానికి గల వైరుధ్యమే ప్రధాన యుద్ధాలకు కారణమైంది. అవుతున్నది. అయితే ట్రంప్ పాలన వంటి వ్యవస్థలు అమెరికా ప్రజాస్వామ్య నీతుల బండారాన్ని బట్టబయలు చేస్తున్నాయి, పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం స్థానంలో ఫాసిస్టు ప్రజాస్వామ్యలు ఏర్పడితే ప్రజల ఉనికికే ప్రమాదం సంభవించి వసుధైక నిరంకుశత్వం దాపురిస్తుందేమో!!!

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ఏకాకులు చైనా, భారత్ : మధ్యవర్తి పాకిస్తాన్

పశ్చిమాసియాలో నెలరోజులకు పైగా సాగుతున్న యుద్ధంతో రాబోయే రోజులలో పశ్చిమాసియా రాజకీయ ఆధిపత్యం చదరంగంలో కీలక పరిణామాలకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వ్యూహాత్మకంగా యుద్ధం ప్రారంభం కాగానే గల్ఫ్ దేశాలపై దాడులకు తెగబడడంతో పాటుగా చమురు రవాణాను అడ్డుకొనే ప్రయత్నం ఇరాన్ చేయడంతో మొత్తం ప్రపంచం అతలాకుతలమైపోతుంది. యుద్ధాన్ని ఆపివేసి సంధి చేసుకోవాలని అమెరికా ఆసక్తిగా ఉన్నప్పటికి ఇరాన్ మొండికేస్తుంది. ఈ సందర్భంగా పాకిస్తాన్ ప్రధాన సంధానకర్తగా తెరపైకి రావడం ఓ విధంగా విస్మయకర పరిణామమే అని చెప్పవచ్చు. రాబోయే రోజులలో ప్రపంచ గణామాన్ని నిర్దేశించడంలో కీలక శక్తిగా ఎదుగుతున్న బ్రిక్స్ ద్వారా 'గ్లోబల్ సౌత్' నాయకత్వం కోసం పోటీ పడుతున్న భారత్, చైనాలకు ఈ పరిణామాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. మొత్తం ఈ ఘర్షణలో ఈ రెండు దేశాలు ప్రేక్షక పాత్ర పోషించేందుకు పరిమితం కావాల్సి వస్తోంది. ప్రపంచంలోనే బహిరంగంగా ఉగ్రవాద సంస్థలకు స్థావరాలు కల్పిస్తున్న దేశంగా పాకిస్థాన్ ను ప్రపంచం ముందు దోషిగా నిలబెట్టడంలో భారత్ శతాబ్దాలుగా చేస్తున్న ప్రయత్నాలకు 'సానుభూతి' వ్యక్తం చేసేవారే గాని ఈ విషయమై ఆ దేశాన్ని ఖండించేవారు కనిపించడం లేదు. గత ఏడాది పహల్గమ్ ఉగ్రదాడి సందర్భంగా పాకిస్థాన్ ఉగ్రవాద చర్యను ఖండించింది కేవలం ఇజ్రాయిల్, ఆఫ్ఘానిస్తాన్ మాత్రమే కావడం గమనార్హం. పైగా, పాకిస్థాన్ కు గుణపాఠం చెప్పేందుకు భారత్ 'ఆపరేషన్ సిందూర్'కు పాల్పడితే, తానే తన మాట వినకపోతే 200 శాతం సుంకాలు విధిస్తానని బెదిరించడం ద్వారా 'కాల్పుల విరమణ'కు ఆ రెండు దేశాలను ఒప్పించానని ఇప్పటికీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఘనంగా చెప్పుకొంటున్నారు. అంతేకాదు తన జోక్యంతో ఆ రెండు దేశాల మధ్య అణు యుద్ధాన్ని నివారింపగలిగానని, లేనిపక్షంలో కనీసం కోటిమంది జనం చనిపోయి ఉండేవారంటూ ప్రచారం చేసుకుంటున్నారు.

సీమాంతర ఉగ్రవాదంకు కేంద్రబిందువుగా పేరొందిన పాకిస్తాన్ నేడు అటు ఇరాన్, ఇటు అమెరికాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఈజిప్ట్, టర్కీలతో కలిసి ముమ్మరంగా ప్రయాణాలు ప్రారంభించింది. బ్రిక్స్ అధ్యక్ష స్థానంలో ఉన్న భారత్ ఈ యుద్ధంపై ఇప్పటికీ ఓ స్పష్టమైన ప్రకటన కూడా చేయలేకపోయింది. బ్రిక్స్ జోక్యం చేసుకోవాలని స్వయంగా ఇరాన్




అధ్యక్షుడు ప్రధాని మోదీని కోరినా ప్రయోజనం లేక పోయింది. పాకిస్థాన్ లో ఉగ్రవాదులకు బలమైన మద్దతుదారునిగా పేరొందిన ఆర్మీ చీఫ్ ఆసిన్ మునీర్ నేడు ట్రంప్ కు వాణిజ్య భాగస్వామి మాత్రమే కాకుండా, ఈ యుద్ధంలో కీలక సంధానకర్తగా మారడం ఓ విధంగా భారత్ కు మింగుడు పడటం లేదు. 'విశ్వ మిత్ర'గా, 'విశ్వ గురు'గా స్వదేశంలో ప్రచారం చేసుకుంటున్న భారత ప్రభుత్వ నేతలు ఈ విషయమై మాట్లాడలేని పరిస్థితులలో ఉన్నారు.

గత వారం పశ్చిమాసియా ఘర్షణలపై భారత ప్రభుత్వం జరిపిన అఖిల పక్ష సమావేశంకు ప్రధాని హాజరై వాస్తవ పరిస్థితులను వివరించే ప్రయత్నం చేయలేక పోయారు. ఈ విషయమై పార్లమెంట్ ఉభయసభలలో ప్రకటనలు చేసేముందు ప్రధాని మోదీ ముఖం పాలిపోయిన్నట్లు కనిపించింది. బహుశా మొదటిసారిగా తన ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తే నెహ్రూ విధానాలను, గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతీరుతెన్నులను విమర్శించడంతో పాటు పాకిస్తాన్ అకృత్యాలనపై మండిపడి ప్రయత్నం చేయలేదు. మొత్తం ప్రభుత్వం ఆత్మరక్షణలో పడినట్లు స్పష్టం అవుతుంది. పాకిస్థాన్ ఈ విషయంలో రాజీ చర్చలు జరుపుతుంటే భారత్ దౌత్యపరంగా ఏమి చేస్తుందని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే విదేశాంగమంత్రి జైశంకర్ అసహనంతో పాకిస్థాన్ మాదిరిగా తాము 'దళారులం' కామంటూ తన అక్కసు అంతా వెళ్లగక్కారు. తనజీవితం అంతా దౌత్యవేత్త లాగా పనిచేసిన ఆయన నుండి అటువంటి పదజాలం రావడం మొత్తం ప్రపంచాన్ని విస్మయపరిచింది. తన దిక్కుతోచని పరిస్థితులను కప్పుపుచ్చుకొనేందుకు, సహనం కోల్పోయి ఆ విధంగా మాట్లాడినట్లు స్పష్టం అవుతుంది. గత ఆదివారం 132 వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ పశ్చిమాసియా యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా పెట్రోలు, డీజిల్ సంక్షోభం ఏర్పడుతోందని, అయితే ప్రపంచ దేశాలతో ఉన్న బలమైన సంబంధాల వల్ల ఈ సవాళ్లను భారత్ నిబద్ధతతో ఎదుర్కొంటోందని చెప్పుకొచ్చారు. భారత్ దౌత్యం ఫలితంగానే ఇరాన్ మన నౌకలకు అనుమతి ఇస్తుందని కూడా మన నాయకులు ఘనంగా ప్రచారం చేసుకుంటున్నారు. అయితే, యుద్ధం కారణంగా హార్ముజ్ జలసంధి వద్ద 28 భారత్ నౌకలు చిక్కుకుపోతే ఇప్పటివరకు కేవలం 8 నౌకలు మాత్రమే దానిని దాటుకొని రాగలిగాయి. యుద్ధం ప్రారంభమైన తర్వాత అదనంగా ఒక్క నౌక కూడా బయలుదేరలేదని గమనించాలి. దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతలేదని ప్రభుత్వం ప్రతిరోజూ భరోసా ఇస్తున్నప్పటికీ ఎన్ని రోజులకు సరిపడిన నిల్వలు ఉన్నాయో నిర్దుష్టంగా చెప్పలేక పోతుంది. సాధారణంగా మూడు నెలలకు సరిపడిన నిల్వలు దేశంలో ఉండే విధంగా ప్రభుత్వం ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. జపాన్ వంటి దేశాలయితే ఆరు నెలలకు సరిపడిన నిల్వలు ఉంచుకొంటున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే నేడు దేశంలో ఆందోళయాంకర పరిస్థితులు నెలకొన్నాయని పలువురు భావిస్తున్నారు. పైగా, రష్యా నుండి భారీగా దిగుమతి చేసుకున్న చమురును ప్రైవేట్ ఆయిల్ కంపెనీలు విదేశాలలో అమ్ముకున్నాయని కూడా చెబుతున్నారు.

మరోవంక, పశ్చిమాసియా యుద్ధంలో మధ్యవర్తి పాత్ర పోషించాలన్న బీజింగ్ ప్రయత్నాన్ని, అలాగే హోర్ముజ్ జలసంధి గుండా చైనా సరుకు రవాణా నౌకలకు సురక్షిత మార్గం కల్పించాలన్న అభ్యర్థనను ఇరాన్ తిరస్కరించిందని 'ది ఎపోక్ టైమ్స్'తో మాట్లాడిన చైనా దౌత్య వర్గాల అంతర్గత వ్యక్తులు తెలిపారు. అమెరికా-ఇరాన్ మధ్య సంఘర్షణలో కీలక మధ్యవర్తిగా వ్యవహరించడానికి, ఇరాన్ ప్రభుత్వంతో ఉన్న తన ప్రత్యేక సంబంధాన్ని ఉపయోగించుకోవాలని బీజింగ్ మొదట ప్రణాళిక వేసింది. తద్వారా ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియాలోని అభివృద్ధి చెందుతున్న దేశాలైన "గ్లోబల్ సౌత్"పై నాయకత్వాన్ని దక్కించుకోవాలని చైనా చూసింది. అయితే, ఇరాన్ ఈ ఆలోచనను తిరస్కరించింది. ఇరాన్, చైనా, రష్యా ప్రభుత్వాల మధ్య సన్నిహిత సహకారం ఉందన్న బాహ్య అభిప్రాయాలకు విరుద్ధంగా, ఇరాన్ విషయంలో చైనా, రష్యాలకు వాస్తవానికి పరస్పర విరుద్ధమైన ఉద్దేశాలు ఉన్నాయని ఇరాన్ గ్రహించడమే అందుకు ప్రధాన కారణం. బీజింగ్, మాస్కో రెండూ అమెరికాతో రాయితీలు పొందడానికి, తమ దౌత్యపరమైన ఒత్తిళ్లను తగ్గించుకోవడానికి ఇరాన్‌ను ఒక "బేరసారాల సాధనంగా" ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి.

చైనా కమ్యూనిస్ట్ పార్టీ (సిసిపి), రష్యా నాయకులు ఇద్దరి నుండి దౌత్యపరమైన సలహాలు కాకుండా ఆయుధ, సైనిక సహకారం కావాలని ఇరాన్ స్పష్టం చేస్తూ వస్తున్నది. కానీ, ఆ విధంగా చేయడం ద్వారా అమెరికాతో ప్రత్యక్షంగా ఘర్షణకు దిగేందుకు వీరిద్దరూ వెనకడుగు వేస్తున్నారు. ఇరాన్ ధోరణి బీజింగ్‌ను ఒక సందిగ్ధంలో పడేసింది. ఇరాన్‌కు సైనిక సహాయం అందించడం అమెరికా, దాని మిత్రదేశాలతో పూర్తిస్థాయి ఘర్షణకు దారితీస్తుంది. అందుకు విరుద్ధంగా, అలా చేయడానికి నిరాకరిస్తే ఇరాన్ పాలనపై తనకున్న ప్రభావాన్ని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుంది. చైనా వాణిజ్య నౌకల సముద్ర భద్రతను నిర్ధారించడమే ఇప్పుడు చైనా ప్రధాన అలక్ష్యంగా ఉంది. అయితే, ఇరాన్ స్పందన నిరుత్సాహపరిచింది. ఇరాన్‌కు వచ్చే సరుకులలో 'కొంత' భాగానికి మాత్రమే భద్రతకు హామీ ఇవ్వగలమని టెహ్రాన్ పేర్కొంది. సైనిక సహాయం అందించడానికి బీజింగ్ నిరాకరించడంతో ఈ "ఎంపిక చేసిన భద్రత" హామీని ఇరాన్ "మృదువైన బ్లాక్‌మెయిల్" అని భావిస్తున్నారు. "గణనీయమైన సైనిక మద్దతు ఇవ్వడమా? లేక తమ వాణిజ్య ప్రయోజనాల భద్రతను కాపాడుకోవడమా? అనే కీలకమైన నిర్ణయం తీసుకునేలా బీజింగ్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఇరాన్ దీనిని ఒక బెదిరింపుగా వాడుకుంటోంది. తృలితంగా రహస్యంగా మధ్యవర్తిత్వం వహించడానికి పదేపదే చైనా చేసిన ప్రయత్నాలు పూర్తిగా నిష్ఫలమయ్యాయి. ఈ జలసంధిని దిగ్బంధించడం ఇప్పటికే చైనా ఆర్థిక వ్యవస్థను పెద్ద ఎత్తున దెబ్బతీసింది. రసాయనాలు, పందుల మేత, ధాన్యాల ధరలు పెరిగాయి. మరోవైపు, చైనా ప్రభుత్వానికి చెందిన ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఈ సంఘర్షణను సాకుగా చూపి ధరలు పెంచుతున్నాయి. చైనా ఎగుమతి రంగాలు ముఖ్యంగా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇరాన్ యుద్ధం చైనా తయారీ పరిశ్రమపై అత్యంత తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. "ఫిరంగి గుళ్లకు కళ్లు ఉండవు. రవాణా, బీమా ఖర్చులు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం సంస్థలకు ఉన్న ఏకైక కోరిక కాల్పుల విరమణ. లేకపోతే, చైనా ఎగుమతి వ్యవస్థ సమూల పతనాన్ని ఎదుర్కొంటుంది," అని చైనా పారిశ్రామికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవంక, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశంగా పాకిస్థాన్ ను అంతర్జాతీయంగా ఏకాకి చేయాలని 1990వ దశకం నుండి ప్రయత్నిస్తున్న భారత్ కు పశ్చిమాసియా ఘర్షణలతో ఈ దేశం ప్రధాన మధ్యవర్తిగా మారడం, చైనాతో పాటు తాము కూడా ప్రేక్షకపాత్ర వహించాల్సి రావడం భారత్ అనుసరిస్తున్న దౌత్య విధానాలు కుప్పకూలిన్నట్లు అవుతుంది. అంతర్జాతీయ వ్యవహారాలలో 'గ్లోబల్ సౌత్' ప్రతినిధిగా 'నాయకత్వ' పాత్రవహించేందుకు పోటీ పడుతున్న భారత్, చైనాల ప్రభావాన్ని ఈ యుద్ధం నెట్టి వేస్తున్నట్లు అవుతుంది.



చలసాని నరేంద్ర
9849569050

# అడగని ప్రశ్న... ఆపలేని వివరణ!

మనం రోజూవారీ జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు గమనించే ఉంటాం. ఆఫీసుకి పది నిమిషాలు ఆలస్యంగా వెళ్తాం, బాస్ మనల్ని చూసి చూడనట్టు వెళ్ళిపోతున్నా, మనమే వెనక్కి పిలిచి మరీ సార్, దారిలో ట్రాఫిక్ వల్ల లేట్ అయింది అని చెబుతాం. స్నేహితుడికి ఫోన్ చేయడంలో ఆలస్యమైతే, వాడు అడగకముందే అరేయ్, నిన్న ఫుల్ బిజీ రా, అందుకే చేయలేకపోయాను అని సర్దిచెప్పుకుంటాం. సోషల్ మీడియాలో ఒక ఫోటో పెట్టి, దాని కింద ఇది పాత ఫోటోనే లెండి అని క్యాప్షన్ ఇస్తాం.నిజానికి అక్కడ ఎవరూ మనల్ని ప్రశ్నించలేదు. ఎవరూ వివరణ కోరలేదు. అయినా సరే, మనసులో ఒక రకమైన తొందర పాటు ఎదుటివారు మనల్ని తప్పుగా అనుకుంటారేమో అన్న ఒక చిన్నపాటి గుబులు. దీన్నే



మనస్తత్వ శాస్త్ర పరిభాషలో "Unsolicited Justification" అంటారు. అంటే, అడగని చోట ఇచ్చే అనవసరపు వివరణ. ఈ అలవాటు మనలో ఎందుకు ఉంది? ఇది మన వ్యక్తిత్వంలోని లోపమా లేక మానవ సహజ నైజమా?

మన ప్రతీ చర్య వెనుక ఒక కారణం ఉంటుంది. కానీ ఆ కారణాన్ని ప్రపంచానికి చాటి చెప్పాల్సిన అవసరం మనకెందుకు కలుగుతుంది? దీని వెనుక భయం, గుర్తింపు కోసం తపన, మరియు సంబంధాలను కాపాడుకోవాలనే ఆరాటం కలిసి ఒక వింతైన నృత్యాన్ని చేస్తాయి. ప్రముఖ మనస్తత్వవేత్త లియోన్ ఫెస్టింజర్ ప్రతిపాదించిన "Cognitive Dissonance" (జ్ఞానాత్మక వైరుధ్యం) సిద్ధాంతం ఇక్కడ కీలకం. మన ఆలోచనలకు, మన ప్రవర్తనకు మధ్య ఎప్పుడైనా పొంతన కుదరనప్పుడు మనసులో ఒక విధమైన అసౌకర్యం కలుగుతుంది. ఆ అసౌకర్యాన్ని పోగొట్టుకోవడానికి, మనల్ని మనం సమర్థించుకోవడానికి మనం వివరణల ఆశ్రయం పొందుతాం వివరించాలనుకోవడం అనేది మన బలహీనత కాదు

మన తెలుగు సమాజంలో ఈ వివరణాత్మక ధోరణి కొంచెం ఎక్కువే అని చెప్పాలి. మనది సమిష్టి సంస్కృతి. ఇక్కడ వ్యక్తిగత నిర్ణయాల కంటే సామాజిక అంగీకారానికి విలువ ఎక్కువ. నాలుగు గోడల మధ్య జరిగిన విషయం బయటపడితే పరువు పోతుంది లేదా చుట్టాలు ఏమనుకుంటారో అన్న ఆందోళన మనల్ని నిరంతరం సంజాయిషీలు ఇమ్మని ప్రేరేపిస్తుంది. పెళ్లిళ్లు, పేరంటాలు, పండగలు. ఇలా ఏ సందర్భంలోనైనా మన నిర్ణయాలకు వంద వివరణలు సిద్ధం చేసుకుంటాం. ఇది కేవలం మనస్తత్వమే కాదు, ఒక సామాజిక ఒత్తిడి కూడా. ఈ వలయం నుండి బయటపడటం ఎలా? మనం ఇచ్చే ప్రతి వివరణ మన శక్తిని ఖర్చు చేస్తుంది.

మీరు మంచివారా కాదా అన్నది మీ ప్రవర్తన నిర్ణయిస్తుంది తప్ప, మీరు ఇచ్చే మాటలు కాదు. మీ జీవితంలోని ముఖ్యమైన వ్యక్తులకు (కుటుంబం, ఆత్మీయులు) వివరణ ఇవ్వడం అవసరం కావచ్చు. కానీ దారిపోయే ప్రతి ఒక్కరికీ సంజాయిషీ ఇవ్వడం అనవసరం.చివరగా, ఎవరూ అడగకపోయినా వివరణలు ఇచ్చుకోవడం అనేది మనలోని మానవత్వాన్ని చూపిస్తుంది.

అది మనం ఎదుటివారి మనసులో నిలవాలనుకుంటున్నామని ఇచ్చే ఒక సున్నితమైన సంకేతం.ఈ సంజాయిషీల వెనుక ప్రధానంగా నాలుగు బలమైన ప్రేరణలు కనిపిస్తాయి, సామాజిక ఆమోదం (Social Validation) కోసం చూడటం మానవుడు పుట్టుకతోనే సంఘజీవి. పూర్వ కాలంలో అడవుల్లో బతికేటప్పుడు, గుంపు నుంచి విడిపోవడం అంటే మరణంతో సమానం. అందుకే మన చుట్టూ ఉన్నవారు మన గురించి ఏమనుకుంటున్నారనేది మన మనుగడకు సంబంధించిన ప్రశ్నగా మారి పోయింది. వాళ్లు నన్ను తప్పుగా అర్థం చేసుకుంటే నా ఉనికికే ప్రమాదం అనే ఆ పురాతన భయం నేటికీ మన జన్యువుల్లో దాగి ఉంది. అందుకే మనం ఇచ్చే వివరణలు ఎదుటి వారి మెప్పు కోసం కాదు, వారి ఆమోదం పొంది సురక్షితంగా ఉండటం కోసం. అపరాధ భావన (The Guilt Factor) ,తప్పు చేశామన్న భావన మనసును తొలిచేస్తూ ఉంటుంది. ఒక్కోసారి మనం చేసింది తప్పు కాక పోయినా, మన అంతరాత్మలో ఎక్కడో ఒక చిన్న సందిగ్ధం ఉంటే చాలు, వెంటనే వివరణల పరంపర మొదలవుతుంది. ఈ గిల్ట్ అనేది చాలా శక్తివంతమైనది. మనం ఎదుటివారికి ఇచ్చే వివరణ నిజానికి వారి కోసం కాదు, మనల్ని మనం శాంతింప జేసుకోవ డం కోసం. "నేను చేసింది కరెక్టే కదా?" అని వారి కళ్ళలో వెతుక్కునే ఆమోద ముద్ర కోసమే ఈ తపన.ఆత్మ గౌరవం - ఐడెంటిటీ ప్రొటెక్షన్,ప్రతి మనిషికి తన గురించి తను ఒక ఊహాచిత్రాన్ని గీసుకుంటాడు. నేను చాలా బాధ్యత గల వ్యక్తిని,నేను క్రమశిక్షణ గలవాడిని అని మనం నమ్ముతాం. ఎప్పుడైనా మన ప్రవర్తన ఆ చిత్రానికి భిన్నంగా అనిపించినప్పుడు, మన ఇమేజ్ డ్యామేజ్ అవుతుందేమోనన్న భయం మొదలవుతుంది. ఆ ఇమేజ్‌ను కాపాడుకోవడానికి పరిస్థితులు అనుకూలించలేదు కాబట్టే ఇలా చేశాను అని చెప్పుకుంటాం. ఇది మన సెల్ఫ్-ఇమేజ్ కు వేసుకునే ఒక రక్షణ కవచం. పారదర్శకతపై ప్రేమ తో కొన్నిసార్లు వివరణ ఇవ్వడం అనేది కేవలం గౌరవ సూచకం. సంబంధాల్లో ఎటువంటి అపోహలకు తావుండ కూడదనే ఉద్దేశంతో కొందరు ముందే విషయాలను స్పష్టం చేస్తారు. ఇది వారిలోని ఎంపతీ (Empathy) లేదా సానుభూతిని చూపిస్తుంది. నా చర్య వల్ల నీ మనసు నొచ్చుకోకూడదు అనే ఆలోచన ఇందులో అంతర్లీనంగా ఉంటుంది.అవసరమైన చోట వివరణ ఇవ్వడం సంబంధాలను బలపరుస్తుంది. కానీ అడగకముందే అతిగా సంజాయిషీలు ఇవ్వడం వల్ల కొన్ని ప్రతికూలతలు కూడా ఉన్నాయి. మీరు గమనించారో లేదో, అతిగా వివరణలు ఇచ్చే వారిని లోకం ఒక్కోసారి నమ్మదు. నేను దొంగతనం చేయలేదు అని అడగకముందే పది సార్లు చెబితే, నిజంగానే చేశాడేమో అన్న అనుమానం కలుగుతుంది.అతి వివరణలు మనలోని అభద్రతా భావాన్ని (In-security) బయటపెడతాయి. మనం ఎంతగా మనల్ని మనం సమర్థించుకోవాలని చూస్తామో, అంతగా మనం బలహీనంగా కనిపిస్తాం. ఇది ఎదుటివారికి మనపై ఒక రకమైన అధికారాన్ని ఇచ్చినట్లు అవుతుంది. మన జీవితానికి మనం వివరణకర్తలుగా మారకూడదు, కర్తలుగా ఉండాలి. మన తెలుగు సమాజంలో ఈ వివరణాత్మక ధోరణి కొంచెం ఎక్కువే అని చెప్పాలి. మనది సమిష్టి సంస్కృతి. ఇక్కడ వ్యక్తిగత నిర్ణయాల కంటే సామాజిక అంగీకారానికి విలువ ఎక్కువ. నాలుగు గోడల మధ్య జరిగిన విషయం బయటపడితే పరువు పోతుంది లేదా చుట్టాలు ఏమనుకుంటారో అన్న ఆందోళన మనల్ని నిరంతరం సంజాయిషీలు ఇమ్మని ప్రేరేపిస్తుంది. పెళ్లిళ్లు, పేరంటాలు, పండగలు.ఇలా ఏ సందర్భంలోనైనా మన నిర్ణయాలకు వంద వివరణలు సిద్ధం చేసుకుంటాం. ఇది కేవలం మనస్తత్వమే కాదు, ఒక సామాజిక ఒత్తిడి కూడా.ఈ వలయం నుండి బయటపడటం ఎలా?మనం ఇచ్చే ప్రతి వివరణ మన శక్తిని ఖర్చు చేస్తుంది. మరి ఈ అలవాటును ఎలా నియంత్రించుకోవాలి?ఏదైనా వివరణ ఇచ్చే ముందు ఒక క్షణం ఆగండి. నేను ఇప్పుడు ఇది ఎందుకు చెప్పాలనుకుంటున్నాను? అవతలి వ్యక్తి అడిగారా? ఇది చెప్పకపోతే వచ్చే నష్టం ఏంటి? అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి.కొన్నిసార్లు మౌనం కంటే గొప్ప వివరణ లేదు. మీరు తీసుకున్న నిర్ణయం సరైనదని మీకు నమ్మకం ఉన్నప్పుడు, దాన్ని అందరికీ నిరూపించాల్సిన అవసరం లేదు. మీ సెల్ఫ్-వర్త్ (Self-worth) ఎదుటివారి ఆమోదంపై ఆధారపడి ఉండకూడదు. మీరు మంచివారా కాదా అన్నది మీ ప్రవర్తన నిర్ణయిస్తుంది తప్ప, మీరు ఇచ్చే మాటలు కాదు.మీ జీవితంలోని ముఖ్యమైన వ్యక్తులకు (కుటుంబం, ఆత్మీయులు) వివరణ ఇవ్వడం అవసరం కావచ్చు. కానీ దారిపోయే ప్రతి ఒక్కరికీ సంజాయిషీ ఇవ్వడం అనవసరం.చివరగా, ఎవరూ అడగకపోయినా వివరణలు ఇచ్చుకోవడం అనేది మనలోని మానవత్వాన్ని చూపిస్తుంది. మనకు మనుషులు ముఖ్యం, సంబంధాలు ముఖ్యం అని చెప్పడానికి అది ఒక సంకేతం. కానీ, ఈ ప్రపంచంలో అందరినీ సంతృప్తి పరచడం అసాధ్యం. మనం ఎంత వివరించినా, అర్థం చేసుకోవాలనుకునే వారు వివరణ లేకుండానే అర్థం చేసుకుంటారు, అపార్థం చేసుకోవాలనుకునే వారు మీ వివరణలో కూడా తప్పులు వెతుకుతారు.అందుకే, ఒక్కోసారి వివరణలు ఆపేసి, మనల్ని మనం నమ్మడం నేర్చుకోవాలి. మన చర్యలే మన భాష కావాలి. అప్పుడే మన మనసుకి నిజమైన ప్రశాంతత లభిస్తుంది.మీ నిజాయితీకి సాక్ష్యం మీ ప్రవర్తన కావాలి కానీ, మీ ప్రసంగం కాదు.



డా.సూర్యదేవర రామకృష్ణ
9490754169

## భ్రూణ హత్యలు పెను శాపాలు

పుట్టిన బిడ్డతో పోల్చితే తల్లి గర్భంలో పురుడు పోసుకున్న బిడ్డకు సమాన హక్కులు ఉండవు. తల్లితండ్రుల ఇష్టాయిష్టాలు బట్టి గర్భంలో దాగిన శిశువు జీవితం ఆధారపడి వుంటుంది. మూడు, నాలుగు నెలల గర్భవతి పలు కారణాలతో అబార్షన్ చేయించుకోవడం చూస్తున్నాం. తల్లి గర్భంలో మొలిచిన 3 లేదా 4 మాసాల చిరు ప్రాణం అమ్మాయిని తెలిసి తల్లితండ్రులు బలవంతంగా అబార్షన్ చేయించుకోవడం అనే అమానవీయ సంఘటనలను మనం నిత్యం చూస్తున్నాం. పోప్ జాన్ పాల్-2 ఆలోచనల పర్యవసానంగా 1999 నుంచి ప్రతి ఏట 25 మార్చి రోజున "అంతర్జాతీయ పుట్టబోయే బిడ్డ దినం లేదా ఇంటర్నేషనల్ అన్‌బార్న్ చైల్డ్"ను పాటించుట ఆనవాయితీగా మారింది. తల్లి గర్భంలో కోటి ఆశలతో జన్మించనున్న బిడ్డను తొలి మొగ్గ దశలోనే శిశువును బలవంతంగా అబార్షన్ పేరుతో చంపి వేయడం అమానుషం, ఘోర పాపం.

**భ్రూణ హత్యలకు కారణాలు:** క్రీస్తు జన్మించిన 25 డిసెంబర్ కన్న 9 నెలల ముందు 25 మార్చిన ఈ వేడుకలను నిర్వహించడం సముచితంగా ఉన్నది. తల్లి గర్భంలో ఉన్న 3-4 మాసాల పసి గుడ్డును పలు కారణాలతో ఆదిలోనే అబార్షన్ రూపంలో తుంచి వేయడం అనే దుర్మార్గ ఆచారం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి 25 మార్చిన ఈ వేదిక ఉపయోగపడుతున్నది. పిల్లలు ఇప్పుడే వద్దని, ఆర్థిక ఇబ్బందులు వస్తాయని, తల్లి ఆరోగ్యం బాగాలేదని, పలు లోపాలున్న శిశువు జన్మించవచ్చని, ఆడ బిడ్డ అని తెలుసుకొని, సామాజిక ఆర్థిక సమస్యలు, మహిళలపై గృహ హింసలు, ఆడ వారికి స్వేచ్ఛ లేకపోవడం, మగ పిల్లాడిపై ప్రేమ, కుటుంబ నియంత్రణతో చిన్న కుటుంబాల భావనలు పెరగడం లాంటి పలు కారణాలతో తల్లులు అబార్షన్ చేయించుకోవడం చూస్తున్నాం. వీటిలో ఆడ బిడ్డ గర్భంలో ఉందని తెలిసి, అమ్మాయి రేపటి బరువు అని తలచి, వరకట్నం ఇవ్వవలసి ఉంటుందని తెలిసి తల్లిదండ్రులు అబార్షన్ వరకు వెళ్లడం సోచనీయం.

**భారతంలో భ్రూణ హత్యలు:** భారత్‌లో సాలీనా దాదాపు 15.6 మిలియన్ల అబార్షన్లు జరుగుతున్నాయని, ప్రతి వెయ్యి మంది తల్లుల్లో 48 మంది అబార్షన్ చేయించుకుంటున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వీటిలో దాదాపు 75 శాతం ఆడ శిశువు అని తెలిసి జరుగుతున్నట్లు అర్థం అవుతున్నది. 2000-2019 మధ్య కాలంలో భారత్‌లో కనీసం 9 మిలియన్ల ఆడ శిశువు అబార్షన్లు జరిగినట్లు తెలుస్తున్నది. సాధారణంగా సహజ ప్రకృతి నియమాల ప్రకారం ప్రతి 100 మంది ఆడ శిశువులకు 103-107 వరకు మగ శిశువులు జన్మించడం గమనించారు. భారత్‌లో లైంగిక నిష్పత్తి మహారాష్ట్రలో 100 మంది ఆడ శిశువులకు 118 మగ శిశువులు, హర్యానాలో 120, జె అండ్ కెలో 116 మంది మగ శిశువులు జన్మించడం జన్మించారు.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037




# జాతీయం - అంతర్జాతీయం



## తమిళనాడులో నామినేషన్ల జోరు

**సోమవారం స్టాలిన్, విజయ్ నామినేషన్ల దాఖలు**



**చెన్నై, మార్చి 30 (ఉదయం) :**

తమిళనాడులో ఎన్నికల జోరు, నామినేషన్ల హోరు ఊపందుకుంది. ఏప్రిల్ 23న జరుగనున్న ఎన్నికలకు సోమవారం నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ కొలత్తూర్ నియోజకవర్గంలో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆయన ఇదే నియోజకవర్గం నుంచి 2011, 2016, 2021 ఎన్నికలలో గెలుపొందారు. మరోవైపు, టీవీకే అధినేత, నటుడు విజయ్ కూడా నామినేషన్ సమర్పించారు.

వరుసగా మూడు సార్లు కొలతూరు నియోజక వర్గం నుంచి గెలుపొందిన స్టాలిన్ మరోసారి అక్కడ నుంచే తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. నామినేషన్ పత్రాలు సమర్పించిన అనంతరం, ఆయన రోడ్ షో నిర్వహించారు. ఢిల్లీకి వ్యతిరేకంగా తమిళనాడు పోరాడుతోందని. ఈసారి గొప్ప విజయాన్ని అందుకోబోతున్నామని స్టాలిన్ ధీమావ్యక్తం చేశారు.

ఇక, తమిళగ వెట్రి కళగం (టివికె) అధినేత, నటుడు విజయ్ ఈ ఎన్నికల్లో రెండు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేస్తున్నారు. పెరంబూర్, తూర్పు తిరుచ్చి నుంచి బరిలో దిగుతున్నారు. తాజాగా పెరంబూర్ స్థానంలో నామినేషన్ దాఖలు చేశారు. ఆయనను చూసేందుకు అభిమానులు, పార్టీ నాయకులు పెద్దఎత్తున తరలి వచ్చారు. తాను ఎంపిక చేసిన వారు కేవలం ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు మాత్రమే కాదని, ప్రజల రక్షకులు కూడా, కనుక వారికి మీ మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నా అని విజయ్ ప్రజలను కోరారు.

234 శాసనసభ స్థానాలున్న తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో డీఎంకే 164 స్థానాల్లో బరిలోకి దిగుతోంది. మరో 70 స్థానాలను కాంగ్రెస్ సహా తమ మిత్రపక్షాలకు కేటాయించింది. అటు టీవీకే అన్ని స్థానాల్లో పోటీ చేస్తోంది. ఇప్పటికే పలు పార్టీలు తొలి విడత అభ్యర్థుల జాబితాలను విడుదల చేశాయి.

## ఎమ్మెల్సీగా రాజీనామా చేసిన బీహార్ సిఎం నితీష్



**పాట్నా, మార్చి 30 (ఉదయం) :**

బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సోమవారం శాసన మండలి సభ్యుడిగా (ఎమ్మెల్సీ) తన పదవికి రాజీనామాను సమర్పించారు. ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఆయన బీహార్ శాసన మండలి ఛైర్మన్ అవధేష్ నారాయణ్ సింగ్‌కు తన రాజీనామాను అందజేశారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ 13 తర్వాత కుమార్ ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలుగుతారని భావిస్తున్నారు. మార్చి 16న జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం నితీష్ కుమార్ తన పదవికి రాజీనామా చేశారు. నిబంధనల ప్రకారం, పార్లమెంటుకు ఎన్నికైన 14 రోజులలోపు కుమార్ రాష్ట్ర శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేయాల్సి ఉంది. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ రాజీనామాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది.

ఇదిలా ఉండగా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, నూతనంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యుడు నితిన్ నబిన్, తాను ఈ రోజే బీహార్ శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. ఆయన బాంకీపూర్ నియోజకవర్గం నుండి వైదొలగనున్నారు.

సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్‌లో, నబిన్ తన నిర్ణయాన్ని ధృవీకరిస్తూ, తన పదవీకాలంలో తనకు మద్దతుగా నిలిచిన ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. శాసనసభ స్థానం నుండి వైదొలుగుతున్నప్పటికీ, తన నియోజకవర్గంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉంటానని ఆయన పునరుద్ఘాటించారు.

బీహార్ శాసనసభలో బాంకీపూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎన్నికైన సభ్యుడిగా నా పదవికి నేను రాజీనామా చేస్తున్నాను. పార్టీ నాకు అప్పగించిన ఈ కొత్త బాధ్యత ద్వారా, నా నియోజకవర్గ, బీహార్ రాష్ట్ర అభివృద్ధి పట్ల నేను ఎల్లప్పుడూ సంసిద్ధంగా, కట్టుబడి ఉంటాను. నా పార్టీ కార్యకర్తలతోనూ, బీహార్ ప్రజలతోనూ నాకు ఉన్న చెక్కుచెదరని బంధం శాశ్వతంగా నిలిచి ఉంటుంది అంటూ ఆయన ఎక్స్‌పై పోస్టు చేశారు.

2047 నాటికి వికసిత భారత, వికసిత బీహార్ సాధించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతో తాను ఏకీభవిస్తున్నట్లు ఆయన నొక్కిచెప్పారు; తద్వారా తన రాజకీయ ప్రాధాన్యతలలో కొనసాగింపు ఉంటుందని సంకేతమిచ్చారు. ఎమ్మెల్యే పదవికి లాంఛనంగా రాజీనామా చేయడానికి తన ఛాంబర్‌కు వస్తారని భావించిన బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్, ఒక అత్యవసర పరిస్థితి కారణంగా పాట్నా విడిచి వెళ్లారని తెలియడంతో, బీహార్ అసెంబ్లీ స్పీకర్ ప్రేమ్ కుమార్ ఆదివారం విస్తుపోయారు. అనుకున్న ప్రకారం రాజీనామా జరగకపోవడంతో, స్పీకర్ అనూహ్యంగా నిశ్చేష్టులయ్యారు.

**జాతీయ స్థాయి పాత్రకు..**

రాజ్యసభకు ఇటీవల ఎన్నికైన నేపథ్యంలో, రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్ర శాసనసభ నుండి వైదొలగడం అనివార్యం కావడంతో నబిన్ తన పదవికి రాజీనామా చేశారు. పార్లమెంటుకు మారిన ఈ బీజేపీ నాయకుడు, బిహార్ రాజకీయాల్లో తన క్రియాశీలతను కొనసాగిస్తూనే, జాతీయ స్థాయిలో మరింత ప్రముఖమైన పాత్రను పోషించనున్నారని భావిస్తున్నారు.

### నక్సలిజం నిర్మూలనకు కేంద్రం చేస్తున్న కృషిపై

## లోక్‌సభలో ఎన్డీయే, కాంగ్రెస్ వాగ్వాదం

**న్యూఢిల్లీ, మార్చి 30 (ఉదయం) :**



నక్సలిజాన్ని అరికట్టడంలో విఫలమైందంటూ గత యుపిఎ ప్రభుత్వంపై లోక్‌సభలోని బిజెపి, ఎన్డీయే సభ్యులు సోమవారం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అయితే, వామపక్ష తీవ్రవాదాన్ని కట్టడి చేయడానికి తాము అనేక ప్రయత్నాలు చేశామని, ఈ 'తీవ్రవాదం' కారణంగా తమ అగ్రశ్రేణి నాయకులను పలువురిని కోల్పోయామని కాంగ్రెస్ ప్రత్యుత్తరమిచ్చింది.

బీజేపీ పాలనలో రెడ్ కారిడార్ గణనీయంగా కుంచించుకుపోయిందని, దాని స్థానంలో ఒక అభివృద్ధి కారిడార్ ఏర్పడిందని దేశాన్ని వామపక్ష తీవ్రవాదం నుంచి విముక్తం చేసే ప్రయత్నాలు అనే అంశంపై చర్చను ప్రారంభిస్తూ శివసేన సభ్యుడు శ్రీకాంత్ షిండే పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు సకాలంలో జోక్యం చేసుకుని ఉంటే, పరిస్థితి వేరేలా ఉండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం మజ్బూత్ (బలమైనది) కాకుండా, మజ్బూర్ (నిస్సహాయమైనది)గా ఉండటం వల్లే ఇది జరిగిందని ఆయన ఆరోపించారు.

నక్సలిజాన్ని ఎదుర్కోవడానికి తగిన రాజకీయ సంకల్పం లేకపోవడం, విధానపరమైన స్తంభన, ఇవే మీ (కాంగ్రెస్) లోపాలు. దేశాన్ని అంతర్గతంగా బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతుండేవని, విదేశీ కుట్రలు పనిచేస్తుండేవని, అయినా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జాతీయ భద్రత విషయంలో రాజీపడింది, అని ఆయన అన్నారు. గణాంకాలను ఉటంకిస్తూ, గత ఏడాది 317 మంది నక్సలైట్లు హతమయ్యారని, 862 మంది అరెస్టు అయ్యారని, మరో 1,900 మంది లొంగిపోయారని షిండే పేర్కొన్నారు.

ఒక్క 2024, 2025లో, కేంద్ర కమిటీకి చెందిన ఆరుగురు సభ్యులతో సహా కనీసం 28 మంది నక్సల్ నాయకులు హతమయ్యారు. 2026లో ఇప్పటివరకు, 630 మంది కార్యకర్తలు హింసామార్గాన్ని విడనాడారు. ఈ గణాంకాలు మనం బుల్లెట్ నుండి బ్యాలెట్ వైపుకు సాగిన ప్రయాణాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి, అని ఆయన అన్నారు. వామపక్ష తీవ్రవాదం కారణంగా తాను తన కుటుంబాన్ని కోల్పోయానని టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి సభకు తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో నక్సల్ దాడులు అత్యధిక సంఖ్యలో జరిగాయి. అయితే, ప్రధాని నరేంద్ర మోడీ విధానాలు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అవిశ్రాంత కృషి ఫలితంగా, నక్సలిజం ఇప్పుడు అంతరించిపోయే దశలో ఉంది, అని ఆమె పేర్కొన్నారు.

దీనికి కాంగ్రెస్ సభ్యుడు సప్తగిరి ఉలక దీటుగా బదులిస్తూ, నక్సల్ ముప్పును ఎదుర్కోవడానికి యుపిఎ ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్ హంట్ ను ప్రారంభించిందని, అలాగే కమాండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్ (కోబ్రా)ను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.

నక్సలిజం కారణంగా ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ తన అగ్ర నాయకత్వాన్ని మొత్తంగా కోల్పోయిందని, ఆ పార్టీ వామపక్ష తీవ్రవాదానికి బాధితురాలిగా మారిందని ఉలక పేర్కొన్నారు. సంక్షేమం, భద్రత అన్న రెండింటికీ యుపిఎ ప్రభుత్వం సమాన ప్రాధాన్యతనిచ్చిందని, కేవలం తుపాకీ గుళ్ళతో మాత్రమే నక్సలిజాన్ని అరికట్టలేమని అది విశ్వసించిందని ఆయన తెలిపారు.

ఈ చర్చలో పాల్గొంటూ, ఎన్డీయే, యుపిఎ ప్రభుత్వాల మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం, ఈ ముప్పును ఎదుర్కోవడంలో అవి అనుసరించిన విధానమేనని బిజెపి ఎంపి సంబిత్ పాత్ర వ్యాఖ్యానించారు.

మోడీ ప్రభుత్వానికి స్పష్టత, దృఢ సంకల్పం ఉన్నాయని, అయితే యుపిఎ గందరగోళం, కుమ్మక్కులతో సతమతమైందని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు సన్నిహితంగా ఉన్న ఒక మేధావి నక్సల్స్‌ను తుపాకులతో ఉన్న గాంధేయులుగా అభివర్ణించారని పాత్రా ఆరోపించారు. సోనియా గాంధీ నేతృత్వంలోని జాతీయ సలహా మండలిలో అర్బన్ నక్సల్స్ సభ్యులుగా ఉన్నారని ఆయన ఆరోపించారు. నాటి యుపిఎ ప్రభుత్వం న్యాయస్థానంలో దాఖలు చేసినట్లుగా తెలిసిన ఒక అఫిడవిట్‌ను ప్రస్తావిస్తూ, అభివృద్ధి, భద్రతా రంగాలలో ఏర్పడిన శూన్యమే నక్సలిజం పెరుగుదలకు దారితీసిందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్వయంగా అంగీకరించిందని ఆయన పేర్కొన్నారు.

యుపిఎ ప్రభుత్వం నక్సలిజాన్ని అణచివేయడానికి బదులుగా, దానిని ప్రధాన స్రవంతిలో కలిపేందుకు ప్రయత్నించిందని ఆయన ఆరోపించారు.

పశ్చిమ ఆసియాలో నెలకొన్న తీవ్రమైన సంక్షోభం దేశంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నప్పుడు, సభలో నక్సలిజంపై చర్చ ఎందుకు జరుగుతోందని టిఎంసి నాయకురాలు మహువా మొయిత్రా ప్రశ్నించారు.

ప్రభుత్వం తనను తాను గొప్పగా చెప్పుకోవాలని చూస్తుండగా, ఎల్‌పిజి , ఇంధన కొరత, విమాన ప్రయాణ ఛార్జీలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె పేర్కొన్నారు.

మార్చి 31, 2026 నాటికి నక్సల్ ముప్పు పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. నక్సల్ హింసా ప్రభావిత ప్రాంతాలపై జరిపిన తాజా సమీక్ష ఫలితంగా, దేశంలో వామపక్ష తీవ్రవాద ప్రభావం ఉన్న జిల్లాల సంఖ్య, డిసెంబర్ 2025 నాటి సమీక్షలో ఉన్న ఎనిమిది నుండి ఏడుకు తగ్గింది.

కేంద్ర ప్రభుత్వం ఇటీవల జార్ఖండ్, బీహార్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ అనే తొమ్మిది రాష్ట్రాల్లోని 38 జిల్లాల్లో వామపక్ష తీవ్రవాదాన్ని పరిష్కరించడానికి జాతీయ విధానం, కార్యాచరణ ప్రణాళికను సమీక్షించింది.

## మార్చి 31 నక్సల్స్ లొంగుబాటుకు గడువు

**లోక్‌సభ వేదికగా గుర్తు చేసిన హోం మంత్రి అమిత్ షా**

**న్యూఢిల్లీ, మార్చి 30 (ఉదయం) :**




నక్సలిజం నిర్మూలనపై సోమవారం లోక్‌సభలో ప్రారంభమైన చర్చలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే, కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. దీనిపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమాధానమిచ్చారు. మావోయిస్టుల ఏరివేతకు మార్చి 31 గడువు అన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆయుధాలు చేపట్టేవారు మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందనే విషయాన్ని నక్సలిజాన్ని సమర్థించేవారు అర్థం చేసుకోవాలని షా పేర్కొన్నారు.

తాము గిరిజనుల హక్కుల కోసం, వారికి న్యాయం తీసుకురావడం కోసం పోరాడుతున్నామని అమాయక గిరిజనుల ముందు ఒక సిద్ధాంతాన్ని, ఒక తప్పుడు కథనాన్ని, ఒక తప్పుడు కలను వారు ప్రచారం చేశారన్నారు. నేడు బస్తర్‌లో నక్సలిజం దాదాపుగా అంతమైందని, పాఠశాలలు పెట్టడానికి, ప్రతి గ్రామంలో రేషన్ దుకాణాలు పెట్టడానికి ఒక ఉద్యమం జరిగిందన్నారు. 5 కేజీల ఆహార ధాన్యాలు పంపిణీ చేస్తున్నారని, తాము ఆధార్ కార్డులు తయారు చేస్తున్నామని తెలిపారు. 1970 నుండి ఇవి ఎందుకు ఇవ్వలేదు అని నక్సల్స్‌కు మద్దతు ఇచ్చిన వారిని నేను అడగాలనుకుంటున్నాను అని షా అన్నారు. 2014లో ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రతి పేదవాడికి ఇల్లు, గ్యాస్, తాగునీరు, 5 లక్షల బీమా కవరేజ్, 5 కేజీల ఆహార ధాన్యాలు అందాయి, మరి బస్తర్ ప్రజలు ఎందుకు వెలివేతకు గురయ్యారు అన్నదే ప్రశ్న. రెడ్ టెర్రరిజం కారణంగా బస్తర్ ప్రజలు వెలివేతకు గురయ్యారని, అయితే, ఇప్పుడు బస్తర్ అభివృద్ధి చెందుతోందని షా తెలిపారు. మావోల లొంగుబాటుకు రేపే (మంగళవారం) ఆఖరి తేదీ అని.. అభివృద్ధి లేదంటూ ఆయుధాలు పట్టుకోవడం సరికాదనిఅమిత్ షా హితవుపలికారు. ఆయుధాలు వీడని వారి అంతు చూస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో విలీన ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారని, కాంగ్రెస్ పాలనలోనే గిరిజన ప్రాంతాలు ఎందుకు అభివృద్ధి చెందలేదని ప్రశ్నించారు. వారి పాలనలో బస్తర్ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని.. గిరిజనులను 60 ఏళ్లపాటు కాంగ్రెస్ విస్మరించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ నిర్వాకం వల్లే దేశంలో మావోయిజం పెరిగిందని కేంద్ర హోంమంత్రి ఆరోపించారు.

మావోయిజం వల్ల 12 రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడిందని అమిత్ షా ధ్వజమెత్తారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని, తమ వల్లే నక్సల్స్ విముక్త భారత్ సాధ్యమవుతోందని లోక్‌సభ వేదికగా కేంద్ర మంత్రి ప్రకటించారు.

## కువైట్‌పై దాడిలో భారతీయుడి మృతి

**ఉదయం డెస్క్, మార్చి 30 :**



కువైట్‌లో ఒక విద్యుత్, నీటి శుద్ధి కర్మాగారంపై ఇరాన్ జరిపిన దాడుల్లో ఒక భారతీయ పౌరుడు మరణించాడని భారత రాయబార కార్యాలయం సోమవారం వెల్లడించింది. దీనితో, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలో మరణించిన భారత జాతీయుల సంఖ్య తాజా మృతితో ఎనిమిదికి చేరుకుంది.

ఆదివారం జరిగిన దాడిలో ఒక భారతీయ పౌరుడు విషాదకరంగా మరణించినందుకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, సాధ్యమైనంత మేర అన్ని రకాల మద్దతు, సహాయాన్ని అందించేందుకు కువైట్ అధికారులతో తాము సన్నిహితంగా సమన్వయం చేసుకుంటున్నామని భారత రాయబార కార్యాలయం ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపింది.

ప్రభుత్వ ఆధ్వర్యంలోని కునా వార్తా సంస్థ ప్రకారం, తమ విద్యుత్, నీటి శుద్ధి కేంద్రాలలో ఒకదానిపై దాడి జరిగి అది దెబ్బ తిన్నట్టు కువైట్ విద్యుత, జల, పునరావృత ఇంధన శాఖ పేర్కొంది. అధికారులు దీనిని క్రూరమైన దాడిగా అభివర్ణించారు. ఈ దాడి జరిగిన కేంద్రాన్ని గుర్తించలేదు. ఈ దాడి ఫలితంగా భారత జాతీయుడైన ఒక కార్మికుడు మరణించాడని మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఫాతిమా జవహర్ హయత్ తెలిపారని గల్ఫ్ న్యూస్ వెల్లడించింది.

మంత్రిత్వ శాఖ ఆమోదించిన అత్యవసర ప్రణాళికకు అనుగుణంగా, పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి, తదనంతర పరిణామాలను నిర్వహించడానికి సాంకేతిక, అత్యవసర ప్రతిస్పందన బృందాలను వెంటనే సంఘటనా స్థలానికి పంపినట్లు ఆమె తెలిపారు.

భద్రతా అధికారులు, ఇతర సంబంధిత ఏజెన్సీలతో సన్నిహితంగా సమన్వయం చేసుకుంటూ, దెబ్బతిన్న సౌకర్యాలను భద్రపరచడానికి ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని హయత్ చెప్పారు. దేశవ్యాప్తంగా విద్యుత్ , నీటి సరఫరా వ్యవస్థల నిర్వహణ సామర్థ్యం చెక్కు చెదరకుండా ఉందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇటీవల, యుఎఇలో ఆ దేశ వాయు రక్షణ వ్యవస్థ అడ్డుకున్న క్షిపణుల శకలాలు ఒక వీధిలో పడటంతో మరణించిన ఇద్దరిలో ఒక భారతీయ పౌరుడు ఉన్నారు.

సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్ సహా పలు ప్రాంతాలలో, అలాగే వాణిజ్య నౌకలకు సంబంధించిన సముద్ర ప్రమాదాలలో మరణాలు సంభవించినట్లు వార్తలు వచ్చాయి.

ఫిబ్రవరి 28న టెహ్రాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల అనంతరం ఇరాన్ జరిపిన ప్రతీకార చర్యలు యుద్ధాన్ని మొత్తం గల్ఫ్ ప్రాంతానికి విస్తరింపజేసింది.

## లొంగిపోయిన మరో మావోయిస్టు అగ్ర నేత

**విజయవాడ, మార్చి 30 (ఉదయం):**

ఒక కీలక పరిణామంలో, సీనియర్ మావోయిస్టు నాయకుడు చెల్లూరి నారాయణరావు, మరో ఎనిమిది మంది కార్యకర్తలతో కలిసి మార్చి 30, 2026న విజయవాడలో ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలలో ఇది ఒక గణనీయమైన ముందడుగుగా పరిగణిస్తున్నారు.

**పోలీసు ఉన్నతాధికారుల ఎదుట లొంగుబాటు**

రాష్ట్రంలో మావోయిస్టు నెట్‌వర్క్‌లను నిర్మూలించే దిశగా ఇది ఒక కీలక ముందడుగు అని అధికారులు అభివర్ణించగా, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా ఎదుట రావు ఆయుధాలను స్వాధీనం చేశారు.

ముఖ్యంగా కీలక కార్యాచరణ ప్రాంతాలలో, రహస్య మావోయిస్టుల ఉనికిని తగ్గించడానికి ఈ లొంగుబాటు సహాయపడుతుందని పోలీసు అధికారులు తెలిపారు.

నిషేధిత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు) ప్రముఖ సభ్యుడైన రావు, గత కొన్ని ఏళ్లుగా పార్టీలో ఉన్నత స్థాయి పదవులను నిర్వహించారు.ఆయన కేంద్ర కమిటీ సభ్యుడిగా సేవలందించడంతో పాటు, ఆంధ్రఒడిశా సరిహద్దు ప్రత్యేక జోనల్ కమిటీ (ఎఒబిఎస్‌జెడ్‌సి) కార్యదర్శిగానూ వ్యవహరించారు. తద్వారా మావోయిస్టు కార్యకలాపాలలో ఆయన ఒక కీలక వ్యూహకర్తగా నిలిచారు.

**తిరుగుబాటు నెట్‌వర్క్ లో బహుళ పాత్రలు**

తన రాజకీయ పాత్రతో పాటు, రావు సైనిక కార్యకలాపాలలో కూడా సన్నిహితంగా పాలుపంచుకున్నారు. ఆయన రాష్ట్ర సైనిక కమిషన్‌లో సభ్యుడిగా ఉంటూనే, కేంద్ర ప్రాంతీయ కమిటీలోని 3వ కంపెనీకి నాయకత్వం వహించారు. కార్యాచరణ ప్రణాళిక, నియామకాలు, తిరుగుబాటు కార్యకలాపాల అమలు వంటి అంశాలన్నింటిలోనూ ఆయన ప్రభావం విస్తరించి ఉంది.

**ఎఒబి ప్రాంతంలో దాదాపు నాలుగు దశాబ్దాల పాటు క్రియాశీలక పాత్ర**

అత్యంత సున్నితమైన మావోయిస్టు కారిడార్లలో ఒకటైన ఆంధ్ర, ఒడిశా సరిహద్దు (ఎఒబి) ప్రాంతంలో, రావు దాదాపు 36 నుండి 40 సంవత్సరాల పాటు విస్తృతంగా కార్యకలాపాలు సాగించారు. సురేష్, సోమన్న వంటి మారుపేర్లు కలిగిన ఆయన, అటవీ, సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల ఉనికిని కొనసాగించడంలో ఒక కీలక వ్యక్తిగా నిలిచారు.



**ప్రధాన మావోయిస్టు కార్యకలాపాలతో సంబంధం**

ఏఓబీ జోన్‌లో పలు మావోయిస్టు కార్యకలాపాలు, సహాయక చర్యలలో రావు ప్రమేయంపై భద్రతా సంస్థలు చాలాకాలంగా నిఘా పెట్టాయి. అతను 2025లో అగ్రశ్రేణి మావోయిస్టు కమాండర్ మాడ్వి హిడ్మా మరణంతో ముడిపడి ఉన్న ఆపరేషన్లతో సహా మావోయిస్టు వ్యతిరేక చర్యల నుంచి, పలు ఎన్‌కౌంటర్ల నుండి తప్పించుకున్నట్టు సమాచారం.

**మావోయిస్టు నెట్‌వర్క్ కు ఎదురుదెబ్బ**

ఈ లొంగుబాటును ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టు కార్యకలాపాలకు ఒక పెద్ద ఎదురుదెబ్బగా అధికారులు అభివర్ణించారు. ముఖ్యంగా, గ్రేహౌండ్స్ వంటి ఉన్నత శ్రేణి దళాలు తిరుగుబాటు గ్రూపులపై నిరంతర ఒత్తిడిని పెంచుతున్న తరుణంలో ఈ ఎదురుదెబ్బ తగిలింది.

ఇలాంటి పరిణామాలు కొన్ని ప్రాంతాలలో మావోయిస్టుల ఉనికిని దాదాపు సున్నాకు చేర్చగలవని అధికారులు భావిస్తున్నారు.

## కేంద్ర బిందువైన ఖర్గ్ ద్వీపం

**ఉదయం డెస్క్, మార్చి 30 :**

ఇరాన్, యుఎస్ మధ్య తీవ్రమవుతున్న యుద్ధంలో పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న ఖర్గ్ ద్వీపం చిన్నదైనప్పటికీ వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ఇరాన్ స్థావరం ఒక ప్రధాన కేంద్రంగా అవతరించింది. ఈ ద్వీపం ఇరాన్ చమురు సంపదకు గుండెకాయ వంటిది.

డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలతో ఖర్గ్ ద్వీపం తిరిగి భౌగోళిక రాజకీయ వార్తల్లోకి వచ్చింది. సోమవారం ఫైనాన్షియల్ టైమ్స్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో, అమెరికా దళాలు ఆ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని ట్రంప్ సూచించారు.

**ప్రమాదంలో ఉన్న చమురు లైఫ్‌లైన్**

ఖర్గ్ ద్వీపం ఇరాన్ ప్రాథమిక చమురు ఎగుమతి టెర్మినల్‌గా పనిచేస్తుంది. ఇది దేశపు ముడి చమురు రవాణాలో అధిక భాగాన్ని నిర్వహిస్తుంది. ఇక్కడ ఏ చిన్న అంతరాయం కలిగినా, ఇప్పటికే కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా ఒత్తిడికి గురవుతున్న ప్రపంచ చమురు సరఫరా గొలుసులను నేరుగా ప్రభావితం చేస్తుంది. ప్రపంచ చమురులో గణనీయమైన భాగం ప్రయాణించే హార్ముజ్ జలసంధికి ఈ ద్వీపం సమీపంలో ఉండటం, దాని వ్యూహాత్మక ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. ఈ ఇరుకైన మార్గాన్ని నియంత్రించగల ఇరాన్ దీర్ఘకాలిక సామర్థ్యం ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది, చమురు ధరలను పెంచి, సరఫరాలో అంతరాయాల భయాలను రేకెత్తించింది. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవాలన్న ట్రంప్ సూచన, ఉద్రిక్తతను నాటకీయంగా పెంచడమే కాక, యుద్ధాన్ని వైమానిక, నావికా ఘర్షణల నుండి భూతల దాడి దిశగా మళ్లే అవకాశం కూడా ఉంది.

**ఉద్రిక్తతలు పెరగడానికి కారణం**

ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి చేసే ఏ ప్రయత్నమైనా దాదాపుగా ఇరాన్ నుండి తీవ్రమైన ప్రతిస్పందనను రేకెత్తిస్తుంది. తమ భూభాగంపై దాడి జరిగితే పర్షియన్ గల్ఫ్‌లో పేలుడు పదార్థాలతో గనులను అమర్చగలమని టెహ్రాన్ ఇప్పటికే హెచ్చరించింది; ఈ చర్య సముద్ర వాణిజ్యాన్ని స్తంభింపజేయగలదు.

ఎర్ర సముద్రంలోని నౌకా మార్గాలను లక్ష్యంగా చేసుకుని, కొత్త యుద్ధరంగం తెరవడానికి యెమెన్‌లోని హౌతీ దళాలతో సహా తమ ప్రాంతీయ పరోక్ష దళాలను క్రియాశీలం చేయగలమని కూడా ఇరాన్ సంకేతాలు ఇచ్చింది. మరోవైపు, అమెరికా ఈ ప్రాంతంలో తన సైనిక ఉనికిని క్రమంగా పెంచుకుంటూ వస్తోంది. ఖర్గ్ ద్వీపంతో సహా ఇరాన్, దాని కీలక మౌలిక సదుపాయాల సమీపంలో వేలాది మంది సైనికులు ఉభయచర దళాలను మోహరించింది.

**యుద్ధం, మార్కెట్లు, ప్రపంచ పరిణామాలు**

ఖర్గ్ ద్వీపంపై పోరాటం కేవలం భూభాగం గురించే కాదు , ఇది ఇంధన సరఫరాలపై నియంత్రణకు సంబంధించినది. ఈ సంఘర్షణ ఇప్పటికే చమురు ధరలను విపరీతంగా పెంచింది, విమాన ప్రయాణాలకు అంతరాయం కలిగించింది, స్థిరమైన ఇంధన సరఫరాలపై ఆధారపడిన ఎరువుల వంటి రంగాలలో కొరతను సృష్టించింది. ఇరాన్ పెట్రోకెమికల్ ప్లాంట్ల నుండి ఇజ్రాయెల్ రిఫైనరీల వరకు ఉన్న ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు, ఇరు పక్షాలు ఆర్థిక జీవనాధారాలను ఎలా లక్ష్యంగా చేసుకుంటున్నాయో స్పష్టం చేస్తున్నాయి. దీని ఫలితంగా ప్రపంచవ్యాప్త పరిణామాలతో కూడిన యుద్ధం ఏర్పడింది, ఇందులో ఖర్గ్ ద్వీపం చుట్టూ పెరిగే ఉద్రిక్తత, మధ్యప్రాచ్యానికి ఆవల కూడా తీవ్ర ప్రకంపనలు సృష్టించగలదు.

**చర్చలు - వైరుధ్యాలు**

ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పటికీ, సమాంతరంగా దౌత్యం కొనసాగుతోంది. కాల్పుల విరమణ చర్చలలో అమెరికా డిమాండ్లలో చాలావాటికి ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ పేర్కొన్నప్పటికీ, టెహ్రాన్ వాషింగ్టన్ షరతులను బహిరంగంగా తిరస్కరించింది. చర్చలు చాలా బాగా జరుగుతున్నాయి అని ట్రంప్ నొక్కి చెబుతున్నప్పటికీ, చర్చలు తదుపరి సైనిక చర్యను తోసిపుచ్చలేవని కూడా ఆయన హెచ్చరించారు.

**ఖర్గ్ ఇప్పుడు మరింత ప్రాముఖ్యతను ఎందుకు సంతరించుకుంది?**

ఖర్గ్ ద్వీపం సైనిక వ్యూహం, ఆర్థిక పరపతి, భౌగోళిక రాజకీయ సంకేతాల కూడలిలో ఉంది. దీనిని అమెరికా స్వాధీనం చేసుకుంటే, అది ఇరాన్ చమురు ఆదాయాలను దెబ్బతీయగలదు. ఇరాన్‌కు, దీనిని రక్షించుకోవడం దాని ఆర్థిక వ్యవస్థకు, సార్వభౌమత్వానికి రెండింటికీ అత్యవసరం.




# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## రాజీ మార్గమే రాజమార్గం అనే భావన ప్రతి ఒక్కరికి ఉండాలి



**జాతీయ మెగా లోక్ అదాలత్ లో 353 కేసుల రాజీ**

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 30(వుదయం జిల్లా ప్రతినిధి):**

రాజీ మార్గమే రాజమార్గం అనే భావన ప్రతి ఒక్కరిలో ఉండడంవల్ల సమస్యలు పరిష్కారం అవుతాయని జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా, భూపాలపల్లి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన రాజీ పడదగిన కేసులను పరిష్కరించడం జరిగిందని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసుల వివరాలకు సంబంధించి ఇలా ఉన్నాయని ఐపీసీ, బిఎన్ఎస్, కేసులు 232, సైబర్ క్రైమ్ కేసులు 24, డీడీ & ఎంవీ యాక్ట్ కేసులు 96, ఈపెట్టి కేసులు 01, ఇలా మొత్తం 353 కేసులకు సంబందించి ఇరు వర్గాలను సమన్వయం చేసి రాజీ కుదిర్చి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరిగిందని వెల్లడించారు ముఖ్యంగా, సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులకు న్యాయం చేయడం లోక్ అదాలత్ ముఖ్య ఫలితంగా నిలిచింది. 24 సైబర్ క్రైమ్ కేసుల్లో రూ. 1,61,441/ మొత్తాన్ని బాధితుల ఖాతాల్లో జమ చేయుటకు సంబంధిత బ్యాంక్ నోడల్ అధికారులకు ఆర్డర్ కాపీలు పంపడం జరిగిందని ఇది బాధితులకు గొప్ప ఉపశమనంగా మారిందని అన్నారు. లోక్అదాలత్ అనేది క్షణికావేశంలో జరిగిన తప్పులను సరిదిద్దుకునే అద్భుతమైన వేదిక అని పేర్కొన్నారు. చిన్న చిన్న గొడవలు, వివాదాలు కోర్టుల్లో సంవత్సరాల పాటు కొనసాగకుండా, ఇరు వర్గాలు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. "రాజీ మార్గమే రాజమార్గం అనే భావన ప్రతి ఒక్కరికి ఉండాలని సూచించారు. ఈ లోక్అదాలత్ విజయవంతం కావడానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది, సైబర్ క్రైమ్ యూనిట్ మరియు ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

లోక్అదాలత్వంటి వేదికలు సమాజంలో శాంతి, సామరస్యాలను నెలకొల్పడంలో కీలకపాత్ర పోషిస్తాయని, ప్రజలు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



**– జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మార్చి 30 (వుదయం ప్రతినిధి) :**

ప్రజావాణిలో ప్రజలు సమర్పించే వివిధ సమస్యల అర్జీలను ప్రాధాన్యత క్రమంలో, సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి ఆయన ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వారం ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ మొత్తం 232 దరఖాస్తులను స్వీకరించారు.

స్వీకరించిన అర్జీలను వెంటనే సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేస్తూ, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ మ్యుటేషన్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూముల రిజిస్ట్రేషన్ సమస్యలు మరియు పింఛన్ల కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు.భూ మ్యుటేషన్ కొరకు స్టేషన్ ఘన్పూర్ మండలానికి చెందిన ఆర్. దీనమ్మ తన తండ్రి ఇచ్చిన భూమికి కొత్త పాస్ బుక్ ఇవ్వాలని కోరారు.ఇందిరమ్మ ఇళ్లు కోసం సంజయ్ నగర్కు చెందిన ఆర్. సరిత, సర్వేలో పేరు ఉన్నప్పటికీ తమకు ఇల్లు మంజూరు కాలేదని మొరపెట్టుకున్నారు.రిజిస్ట్రేషన్ ఇబ్బందులు కోసం తన స్థలం రిజిస్ట్రేషన్ కావడం లేదని ఘన్పూర్ కు చెందిన గీతాదేవి రాథోడ్ కలెక్టర్కు విన్నవించారు.గీత కార్మిక పింఛను పథకాన్ని 50 ఏళ్లు నిండిన తనకు ప్రభుత్వం నుండి రావాల్సిన రూ. 2000 పింఛను ఇప్పించాలని జఫర్గడ్ మండలానికి చెందిన రంగు సారంగపాణి దరఖాస్తు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్నతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు: జిల్లా కలెక్టర్



**సూర్యాపేట కలెక్టరేట్ మార్చి 30(వుదయం):**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, రాష్ట్ర స్థాయి గ్రీవెన్స్ దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో భూ సమస్యలకు సంబంధించిన 33 దరఖాస్తులు, డిఆర్డిఏ 6, డిపిఓ 5, డిడబ్ల్యుఓ 5, మిగిలిన 29 దరఖాస్తులు వివిధ శాఖలకు సంబంధించినవిగా మొత్తం 78 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, ఆర్డీవో వేణు మాధవరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికుల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్, మార్చి 30 (వుదయం ప్రతినిధి) :**

తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా నుండి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఐఎంఏ) హాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరియు జిల్లా హజ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "హజ్ యాత్రికుల ఉచిత వ్యాక్సినేషన్" కార్యక్రమాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారు శారీరకంగా, మానసిక ఆరోగ్యంగా ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. యాత్రలో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తుగా ఈ టీకా కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు.

యాత్రికులందరూ ఆరోగ్యంగా, సురక్షితంగా తమ ప్రయాణాన్ని పూర్తి చేసుకుని తిరిగి రావాలని ఆమె ఆకాంక్షించారు. ప్రయాణ సమయంలో వైద్యులు సూచించిన ముందస్తు జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని యాత్రికులకు సూచించారు.వ్యాక్సినేషన్ ప్రాధాన్యతతో అంతర్జాతీయ ఆరోగ్య నిబంధనల మేరకు యాత్రికులకు అవసరమైన పోలియో, మెనింజైటిస్ వంటి టీకాలను పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ మరియు హజ్ కమిటీ సమన్వయంతో యాత్రికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సాంబశివరావు, జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షులు, వివిధ విభాగాల అధికారులు, పెద్ద సంఖ్యలో హజ్ యాత్రికులు పాల్గొన్నారు. సూచించబడిన ఇతర శీర్షికలు:వరంగల్: ఘనంగా ప్రారంభమైన హజ్ యాత్రికుల వ్యాక్సినేషన్ క్యాంప్.హజ్ యాత్రికులకు కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుభాకాంక్షలు; టీకా పంపిణీ ప్రారంభం.సురక్షితమైన హజ్ యాత్ర కోసం ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి: కలెక్టర్.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**- కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి భువనగిరి / మార్చి వుదయం జిల్లా ప్రతినిధి :**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 30 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 25, జిల్లా గ్రామీణ అభివృద్ధి 2, హౌసింగ్ 2, మున్సిపాలిటీ ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సి.ఈ.ఓ శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 2న జిల్లాలోని పంచాయతీలలో గ్రామసభలు



**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 30(వుదయం జిల్లా ప్రతినిధి):**

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పురోగతిని ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. గ్రామసభల్లో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలను పారదర్శకంగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభలు నిర్వహణకు ముందస్తుగానే షెడ్యూల్ తయారు చేసి పంచాయతి కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన ప్రాంతంలో గ్రామసభలు నిర్వహణతో పాటు గ్రామంలో ప్రభుత్వం ద్వారా లబ్ది పొందిన లబ్ధిదారుల జాబితా చదివి వినిపించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, పంచాయతీ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలి



**జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ఏటూర్ నాగారం ఇంచార్జ్ ప్రాజెక్టు ఆఫీసర్ దివాకర టిఎస్.**

**ములుగు, మార్చి 30 (వుదయం ప్రతినిధి) :**

ప్రజల సమస్యల పరిష్కారం కోసం సత్వర చర్యలు తీసుకోవాలని దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి గిరివాణి గిరిజన దర్బార్ కార్యక్రమంలో స్వయంగా ప్రజల నుండి దరఖాస్తులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. స్వీకరించారు. ప్రజావాణి గిరివాణి గిరిజన దర్బార్ కార్యక్రమానికి భూ సమస్యలకు 32, ఇందిరమ్మ ఇళ్లకు 09, పెన్షన్ 32, ఉపాధి కల్పన 01,ఇతర సమస్యలు 22, మొత్తం 96 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. వచ్చిన అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ప్రజా సమస్యల దరఖాస్తులను నిర్లక్ష్యం వహించకుండా వెనువెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగం పెంచేలా చూడాలని, బిల్లుల చెల్లింపులలో అలసత్వం వహించకూడదని పేర్కొన్నారు. ఎల్పిజి గ్యాస్, పెట్రోల్, డీజిల్ అక్రమంగా నిలువ చేసుకోకుండ అధికారులు తనిఖీలు చేపట్టాలని, ఉద్దేశపూర్వకంగా ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, డిఆర్డిఓ శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి సంజీవరావు, డి ఎం హెచ్ ఓ వేణుగోపాలరావు, డిపిఓ వెంకయ్య, డీఈవో సిద్ధార్థ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపి ఓ డి లు, ఎంపి ఓ లు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి



**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, మహబూబాబాద్ జిల్లా**

**మార్చి 30వుదయం జిల్లా ప్రతినిధి):**

సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ అన్ని విభాగాల జిల్లా అధికారులు, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, క్రిష్ణవేణి లతో అదేవిధంగా మండల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులు తీసుకొని వారి యొక్క వినతులను సవివరంగా విని సంబంధిత విభాగాల అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లను, ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి తక్షణమే క్లియర్ చేయాలని, కార్యాలయాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు జవాబుదారీ తనంగా ఉంటూ సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన వసతి గృహాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పిల్లలతో కలిసి బ్రేక్ ఫాస్ట్ ,భోజనం, డిన్నర్ చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే వెంటనే పరిష్కరించాలని తెలిపారు.ఈ సందర్భంగా ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం కు చెందిన గుండ్ల ఉపేందర్ తాను ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూమి వేరొకరి పేరు మీద పట్టా మార్పు జరిగిందని అట్టి భూమి తిరిగి తన పేరు మేరు మీద మార్పు చేసి పట్టా పాసు పుస్తకము ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. గంగారం మండలం దుబ్బగూడెం గ్రామానికి చెందిన గ్రామస్తులు స్థానికంగా ఉన్న ఫర్టిలైజర్ దుకాణ యజమానులు ఎరువులను ఎక్కువ ధరలకు అమ్ముతున్నారని, అదేవిధంగా తమ గ్రామానికి కేటాయించిన మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని వేరే గ్రామానికి తరలించారని తమపై అధిక వడ్డీ వ్యాపారం చేస్తున్నారని, మొక్కజొన్న తక్కువ ధరకు కొనుగోలు చేసి చెల్లిస్తున్నారని అట్టి ఫర్టిలైజర్ యజమానులపై చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

గార్ల మండలం బాలాజీ తండ కు చెందిన సరోజ తనకు గతంలో ఇందిరమ్మ ఇల్లు వచ్చినట్లు రికార్డులో చూపిస్తుందని కానీ ఇప్పటివరకు తనకు ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ కాలేదని రికార్డులను పరిశీలించి తనకు ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా న్యాయం చేయాలని కోరారు.సీరోలు మండలం సీత్లా తండ గ్రామ పంచాయతీ అందనాల వీడు కు చెందిన అంగోతు లచ్చు తనకున్న 2.20 ఎకరాలకు 2024 సంవత్సరము నుండి ఇప్పటివరకు తన ఖాతాలో రైతు భరోసా డబ్బులు జమ అవట్లేవని పరిశీలించి తనకు రైతు భరోసా డబ్బులు ఇప్పించగలరని కోరారు

ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి లో వచ్చిన (168) దరఖాస్తులను సంబందిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం, అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 1 నుండి ఈ-ఆఫీస్ ద్వారా మాత్రమే ఫైళ్ల నిర్వహణ

**నల్గొండమార్చి 30 (వుదయం ప్రతినిధి) :**

ఏప్రిల్ 1 నుండి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈఆఫీస్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి, ఫైళ్లను పూర్తిగా డిజిటల్ విధానంలోనే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. ఇప్పటికే అధికారులకు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించామని, అందరూ ఈ విధానానికి పూర్తిగా సిద్ధంగా ఉండాలని సూచించారు.

సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా పాలనప్రగతి ప్రణాళిక అమలు పై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు.ఏప్రిల్ 2న గ్రామసభలు, మున్సిపాలిటీలలో వార్డు సభలు నిర్వహించాలని, ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాల ప్రకారం ఈ సమావేశాలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలను గ్రామసభల్లో చదివి వినిపించడంతో పాటు ఫోటోలు, వీడియోల ద్వారా ప్రజలకు స్పష్టంగా వివరించాలని తెలిపారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు సమావేశాల మినిట్స్ను కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు.ప్రజా పాలన పరిధిలోకి రాని పథకాల ద్వారా లబ్ధి పొందిన వివరాలు కూడా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థుల ఉపకార వేతనాలు, ఇందిరమ్మ ఇండ్లు, 6 గ్యారంటీలు, ధరణి, భూభారతి, సోలార్ రూఫ్టాప్ వంటి పథకాల లబ్ధిదారుల వివరాలను గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సిద్ధం చేసి సీపీఓకు సమర్పించాలని తెలిపారు. ఈవెస్ట్ నిర్వహణపై కూడా వివరాలు ఇవ్వాలని సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించి పెండెన్సీ తగ్గించాలని ఆదేశించారు. ప్రస్తుతం రబీ ధాన్యం కొనుగోలు ప్రారంభమైనందున రాబోయే రెండున్నర నెలలు కీలకమని, అలాగే ప్రజా పాలనప్రగతి ప్రణాళిక, జన గణన, ధాన్యం కొనుగోలు వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తప్ప ఇతరులకు సెలవులు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు.మండల ప్రత్యేక అధికారులు టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులు చదువు ఆపకుండా ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి కోర్సుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా బాలికలు చదువు మధ్యలో నిలిపి పెళ్లిళ్ల వైపు వెళ్లకుండా ప్రోత్సహించాలని చెప్పారు.ధాన్యం కొనుగోలు సమయంలో రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖలలో పెండింగ్ ఫైళ్లను తక్షణమే క్లియర్ చేయాలని ఆదేశించారు. అనంతరం మార్కెటింగ్ శాఖ రూపొందించిన 202526 రబీ ధాన్యం కొనుగోలు గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా ముస్లిం ఉద్యోగుల టేబుల్ క్యాలెండర్ను విడుదల చేశారు.

27వ జాతీయ సీనియర్ చెవిటి క్రీడల ఛాంపియన్షిప్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను అభినందించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 126 ఫిర్యాదులు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ శాఖకు 69, ఇతర శాఖలకు 57 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, చండూర్ ఆర్డీఓ శ్రీదేవి, దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి మరియు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, వుదయం బ్యూరో మార్చి 30**

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన పి. నాగుల్ మీరా తమ గ్రామంలో వారం రోజులుగా పిచ్చి కుక్కలు తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, ఇట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎంపిడిఓ/ ఎంపిఓ లకు రాస్తూ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

కామేపల్లి మండలం శివారు లాల్ల తండ నివాసులు, గ్రామంలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతూ, అమ్మకాలు చేస్తున్నారని, ఈ భూమిని కాపాడి ప్రభుత్వ అభివృద్ధి పనులకు వినియోగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ, తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఖమ్మం కార్పొరేషన్ శ్రీరామ్ నగర్ రోడ్ నెంబర్ 13 కు చెందిన ప్రజలు తమకు సీసీ రోడ్డుతో పాటు సైడ్ డ్రైనేజీ, మిషన్ భగీరథ పైప్ లైన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఢాడి లంబాడి హక్కుల సాధన సమితి కార్యదర్శి డీ. శేఖర్ నాయక్ ఖమ్మం గ్రామీణ ప్రాంతంలో మున్నేరు నది సమీపంలో ఉన్న ఢాడి లంబాడ సమాజానికి చెందిన పూర్వీకుల సమాధి స్థలాన్ని రక్షించుటకు ప్రతిపాదిత రిటైనింగ్ వాల్ కు అనుబంధంగా ఉన్న సర్వీస్ రోడ్డు, డ్రైనేజ్ కాలువ నమూనా డిజైన్ మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం ఆర్డీఓ కు రాస్తూ పరిశీలించి తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలం బుర్హాన్ పురంకు చెందిన పి. కృష్ణమూర్తి తనకు పక్షవాతం వచ్చి పది సంవత్సరాలు అవుతుందని దివ్యాంగుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నానని ఇప్పటివరకు మంజూరు కాలేదని తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డీఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు

## అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలి



**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**ప్రజావాణిలో ప్రజల నుండి అర్జీలు**

**కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**ప్రజావాణి కార్యక్రమానికి 138 అర్జీలు**

**హనుమకొండ, మార్చి 30 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

ప్రజావాణి అర్జీలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు అదనపు కలెక్టర్ ఎన్. రవి లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ స్వీకరించారు. అర్జీలను అందిస్తూ ప్రజలు సమస్యలపై వివరాలు తెలియజేయగా కలెకర్ ఓపికగా విన్నారు. ప్రజావాణి సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే జిల్లా అధికారులతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు 138 అర్జీలు అందజేశారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి జిల్లా రెవెన్యూ అధికారి సత్య పాల్ రెడ్డి, డీఆర్డీవో మేన శ్రీను,

హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంతలో మరుగుదొడ్ల మరమ్మతులకు సర్పంచ్ కు వినతి

**నల్లబెల్లి, మార్చి 30(వుదయం):**

మండల కేంద్రంలోని వారపు సంతలో కనీస సౌకర్యాలు లేక వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతి సోమవారం జరిగే ఈ అంగడికి వందలాది మంది తరలివస్తుంటారు. అయితే, ఇక్కడ మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడంతో మహిళలు, వృద్ధులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ సమస్యపై తెలంగాణ ఉద్యమకారుడు మామిండ్ల చిన్న ఐలయ్య ఆధ్వర్యంలో సోమవారం సర్పంచ్కు వినతి పత్రం అందజేశారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలోని మరుగుదొడ్లను వెంటనే శుభ్రం చేయించాలని,వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజల ఇబ్బందులను తొలగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు, వ్యాపారులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఇసుక సరఫరా కోసం మొబైల్ యాప్

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**మన ఇసుక వాహనం మొబైల్ యాప్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం, మార్చి -30:**

పారదర్శకంగా ఇసుక సరఫరా కోసం మన ఇసుక వాహనం మొబైల్ యాప్ రూపకల్పన చేశామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, మన ఇసుక వాహనం మొబైల్ యాప్ ను అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏప్రిల్ 1 నుంచి మన ఇసుక వాహనం మొబైల్ యాప్ అమలులోకి వస్తుందని అన్నారు. గతంలో ఫిజికల్ కూపన్ ద్వారా ఇసుక తరలింపు జరిగేదని, దీనివల్ల కొన్ని అవకతవకలు జరిగే ఆస్కారం ఉండేదని, అక్రమ ఇసుక రవాణా అరికట్టేందుకు ప్రభుత్వం మన ఇసుక వాహనం మొబైల్ యాప్ ప్రవేశపెట్టిందని, దీని ద్వారా ప్రతి అంశం ఆన్ లైన్ ద్వారానే ఉంటుందని అన్నారు. ఇసుక ఎవరికి అవసరం ఉన్న యాప్ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని, సంబంధిత లబ్ధిదారులకు డెలివరీ చేసే విధంగా యాప్ తయారు చేశామని అన్నారు జిల్లాలో ఇక నుంచి ఇసుక సరఫరా ఫిజికల్ కూపన్లు జారీ చేయడానికి వీలు లేదని, దీనిపై తహసిల్దార్లకు ప్రత్యేకమైన సర్క్యులర్ జారీ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సామాన్యులు కూడా వినియోగించే విధంగా మన ఇసుక వాహనం మొబైల్ యాప్ తయారు చేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, భూగర్భ,గనుల సహాయ సంచాలకులు ఆర్. సాయినాథ్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## మెనూ ఖచ్చితంగా పాటించాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, (వుదయం ప్రతినిధి) విద్యార్థులకు మెనూ కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన భోజనం ఇవ్వాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్లారెడ్డి పేట మండలం దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) విద్యాలయంలో కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, స్టోర్ రూమ్ లో ఆహార సామగ్రి, కోడి గుడ్లు, కూరగాయలు, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలు, తరగతి, వసతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడి గుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతుండగా, కలెక్టర్ వారితో మాట్లాడి.. పలు సూచనలు చేశారు. విద్యార్థులందరూ చదువు పై శ్రద్ధ పెట్టాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. తాము అనుకున్న ఉద్యోగాలు, ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

### చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు..

## పకడ్బందీ ఏర్పాట్లు

**జగిత్యాల (వుదయం ప్రతినిధి)** జగిత్యాల జిల్లా కొండగట్టు చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు తేదీ 1 4 2026 నుండి 3 4 2026వ తేది వరకు జరగనున్న సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తెలిపారు సోమవారం కొండగట్టు ఆలయ పరిసరాల్లో నిర్వహించనున్న జయంతి ఉత్సవాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ జిల్లా సుపరెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఏర్పాట్లను ప్రత్యక్షంగా సమీక్షించారు అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని భావించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు దేవాలయం పరిసర ప్రాంతాల్లో 64 సీసీ కెమెరాలతో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు హెల్ప్ సెంటర్ ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలు 6 ప్రదేశాల్లో ఏర్పాటు ప్రత్యేక స్థలాల్లో భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక టెంట్ ల ఏర్పాటు మెట్ల దారి మార్గంలో లైటింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు దీక్ష విరమణ ప్రసాదాల కౌంటర్ ల వద్ద క్యూ లైన్ల వద్ద బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు అదే విధంగా పార్కింగ్ సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని అధికారులకు సూచించారు భక్తులకు తాగునీరు (చలి వేంద్రాలు) మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు కొండ పైన వైద్య సిబ్బందిని నియమించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని వడదెబ్బ నివారణకు గాను ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతూ 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించామని తెలిపారు జయంతి ఉత్సవ రోజుల్లో నిరంతరంగా 24 గంటల విద్యుత్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు కోనేరు యందు ఎప్పటికప్పుడు నీరు నింపుటకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు భక్తులు దీక్ష స్వాముల సౌకర్యార్థం వేములవాడ జగిత్యాల కరీంనగర్ నుండి ప్రత్యేకంగా బస్సుల నడుపనున్నట్లు తెలిపారు దేవస్థానం పరిధిలో గుట్ట కింద గల వీధులలో పారిశుధ్య సిబ్బందిని అవసరం మేరకు కేటాయించి నిరంతరం శానిటేషన్ చేయనున్నట్లు తెలిపారు ఆయా విధులు కేటాయించిన అధికారులకు వసతులు కల్పించిన చోటే బస చేసి అప్పగించిన విధులను భాద్యతగా నిర్వర్తించి జయంతి ఉత్సవాలు ఘనంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని తెలిపారు సంస్థల అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్ జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ డిపివో మదన్ మోహన్ ఆలయ ఏవో అంజనా రెడ్డి తహసిల్దార్ లు ఎంపిడివో లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు




### అంగన్వాడి స్కూల్ సేవలను..

## సద్వినియోగం చేసుకోవాలి

### రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మహేశ్వర్




**కరీంనగర్ (వుదయం ప్రతినిధి)** అంగన్వాడీ స్కూల్ లలో అందే సేవలను వినియోగించుకోవాలని కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మహేశ్వర్ సూచించారు.ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా కోతిరాంపూర్ అంగన్వాడీ సెంటర్లో ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆర్డీవో మహేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సిడిపిఓ సబితా, 39 డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్, కార్పొరేటర్ పడిశెట్టి వసంతలక్ష్మి భూమయ్యలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మహేశ్వర్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడీ స్కూల్ లు గొప్పగా పనిచేస్తున్నాయని, ఆట పాటలతో విద్యను బోధించడం జరుగుతుందని చెప్పారు. డిడబ్ల్యూఓ సరస్వతి మాట్లాడుతూ గర్భవతులు , బాలింతలు అంగన్వాడీ సెంటర్లో లభించే పౌష్టికహారం బాలామృతం తీసుకోవాలని సూచించారు. సీడీపీఓ సబిత మాట్లాడుతూ ప్రీ స్కూల్ ప్రాధాన్యత, మొదటి 1000 రోజులలో తీసుకోవాల్సిన జాగ్రత్త, పోషకహారం గురుంచి తల్లులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు .పి & జి ప్రతం మాస్టర్ ట్రయినర్ రాజేందర్ పిల్లలకు ఐదు అభివృద్ధిల పైన ఆటలు ఆడించారు. దాదాపు 200 మంది పిల్లలు ఆటలు, పాటలు, కథ, సంభాషణ, పూర్వ గణిత భావనలు తల్లి తండ్రులను మంత్ర ముగ్ధులను చేసాయి. భాష, మేధా, సాంఘిక అభివృద్ధి, సృజనత్మాకత గురించి పిల్లలకు వివరిస్తూ వారికీ రిపోర్ట్ కార్డు సీడీపీఓ సబిత,సూపర్వైజర్ అరుణ, నిర్మల, రేణుక చేతుల మీదుగా అందించడం జరిగింది. ప్రీస్కూల్ వస్తువుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది ఈ కార్యక్రమంలో బి.సి సతీష్ ,టీచర్స్ స్వరూప శ్యామల, సరిత,పిల్లలు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కలెక్టరేట్ లో అంబలి పంపిణీని ప్రారంభించిన కలెక్టర్

**నిజామాబాద్, (వుదయం ప్రతినిధి)** తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీఓ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ప్రారంభించారు. వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని ఉద్యోగులకు ఉపశమనం కల్పించేందుకు వీలుగా తాగునీటితో పాటు ఉచితంగా అంబలి పంపిణీకి చొరవ చూపడం అభినందనీయమని టీఎన్జీఓ సంఘాన్ని అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీఓ ప్రతినిధులు కృషి చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయం అని అన్నారు. కలెక్టరేట్ ఉద్యోగులతో పాటు వివిధ పనుల కోసం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయానికి వచ్చే వారికి ప్రస్తుత వేసవిలో అంబలి కేంద్రం ఉపశమనాన్ని అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్, రాష్ట్ర నాయకుడు గైని గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన మహిళ

### డబుల్ బెడ్ రూమ్ గృహాన్ని తిరిగి అప్పగించిన దంపతుల ను ప్రశంసించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, (వుదయం ప్రతినిధి)** పెద్దపల్లి జిల్లాకు చెందిన శ్రీమతి వరహ గిరి శైలజ, భర్త వెంకటరావు దంపతులు సోమవారం కలెక్టరేట్ లో ప్రభుత్వంచే మంజూరైన డబుల్ బెడ్ రూమ్ గృహాన్ని స్వచ్ఛందంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కు తిరిగి అప్పగించారు.తమ పిల్లలు సాఫ్ట్వేర్ ఉద్యోగం లో స్థిరపడిన నేపథ్యంలో తమకు ఈ గృహం అవసరం లేదని భావించి, వేరే నిరుపేద కుటుంబానికి కేటాయించాలని సోమవారం రోజున పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గృహాన్ని తిరిగి అప్పగించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, అవసరం లేక పోయినా ప్రభుత్వ ఆస్తిని తిరిగి ఇచ్చిన శ్రీమతి శైలజ దంపతులు నిజాయితీకి నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తి సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని ఆయన అభినందించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజంగా అవసరమైన వారికి అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, పాల్గొన్నారు.



## గ్రామ సభలకు అన్ని ఏర్పాట్లు చేయాలి




**కామారెడ్డి, (వుదయం ప్రతినిధి):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణలో ఏప్రిల్ 2న నిర్వహించనున్న గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు.ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామ సభలు, వార్డు, మున్సిపల్ సభల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. గ్రామ సభలు, మున్సిపల్ సభలను పండుగ వాతావరణంలో నిర్వహించడంతో పాటు ప్రజలు, ప్రజా ప్రతినిధులు చురుకుగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సభల నిర్వహణపై నివేదికలను సిద్ధం చేసి గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించాలని, ప్రజా ప్రతినిధులకు ముందస్తుగా ఆహ్వానాలు పంపించాలని ఆదేశించారు. గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, ఖర్చు చేసిన నిధులు తదితర వివరాలను గ్రామ సభల సందర్భంగా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. రైతు భరోసా, రుణమాఫీ, ధాన్యం సేకరణ, రైతులకు ₹500 బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ₹500 సిలిండర్ వంటి పథకాల లబ్ధిదారుల వివరాలను కరదీపికల రూపంలో తయారు చేసి సభకు వచ్చే ప్రతి ఒక్కరికి అందజేయాలని, అలాగే అర్జీలు స్వీకరించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని, గ్రామ సభలకు ప్రజలు అధికంగా హాజరయ్యేలా రెండు రోజుల ముందుగానే ప్రచారం నిర్వహించాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు టెంట్లు, షామియానాలు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, మినిట్ టు మినిట్ కార్యక్రమ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

### రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

**జగిత్యాల వుదయం ప్రతినిధి)** ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల తో జిల్లాలో స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ (ఎస్ఐఆర్) తేదీ 1 1 2026 పురస్కరించుకొని జగిత్యాల జిల్లాలో ఓటరు జాబితా ఇంటింటికి వెరిఫికేషన్ లో భాగంగా సోమవారం పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఇట్టి అవగాహన కార్యక్రమంలో పొలిటికల్ పార్టీల ప్రతినిధులు అడిగిన అనుమానాలను జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ నివృతం చేశారు ప్రతి పార్టీ నుంచి బూత్ లెవెల్ ఏజెంట్ నియమించుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ కోరారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బిఎస్ లత ఆర్డీవోలు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం : సీపీ





**కరీంనగర్ (వుదయం ప్రతినిధి)** రోడ్డు ప్రమాదాల నివారణ కేవలం పోలీసుల చర్యలతోనే సాధ్యం కాదని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండి, వాటిని బాధ్యతాయుతంగా పాటించినప్పుడే ప్రమాద రహిత సమాజం సాధ్యమవుతుందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు.సోమవారం కరీంనగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో, ఆటో డ్రైవర్లు,రాపిడో కెప్టెన్ల కోసం స్థానిక అస్త్ర కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన 'అరైవ్ అలైవ్' మూడవ దశ అవగాహనా కార్యక్రమానికి కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల వల్ల 200 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని కమిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వారికి 'రహవీర్' పథకం కింద ప్రభుత్వం రూ. 25,000 నగదు ప్రోత్సాహకం అందిస్తుందని తెలిపారు. అడిషనల్ డీసీపీ వెంకటరమణతో పాటు, ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి, ఇన్స్పెక్టర్లు సంజీవ్, కుమారస్వామి, కిరణ్ కుమార్, మెడికవర్ ఆసుపత్రి డాక్టర్ లోకేష్, రాపిడో అసోసియేట్ మేనేజర్ దుర్గారావు సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తులను

## ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

### జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)** ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వారు స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్లకు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జనగణన పకడ్బందీగా జరగాలి

### - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**అదిలాబాద్ : వుదయం** దేశ భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు, సంక్షేమ పథకాల అమలుకు జనగణన అత్యంత కీలకమని, జనగణన నుండి జన కల్యాణం' అనే నినాదంతో ఈ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలనిజిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.స్థానిక టీటీడీసీలో శనివారం ప్రారంభమై సోమవారంతో ముగిసిన 'సెన్సస్2027' ఫీల్డ్ ట్రైనర్ల మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో కలెక్టర్ పాల్గొని ట్రైనర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ గణనలో ప్రతి వ్యక్తి వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలని స్పష్టం చేశారు. జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో గణన నిర్వహించే సిబ్బందికి ఫీల్డ్ ట్రైనర్లు సమగ్ర అవగాహన కల్పించాలని అన్నారు. డిజిటల్ విధానంలో నిర్వహించనున్న ఈ ప్రక్రియలో సాంకేతిక అంశాలపై పూర్తి పట్టు సాధించాలని ఆయన కోరారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ట్రైనింగ్ కలెక్టర్ సలోని చాబ్రా, పర్యవేక్షకులు నలంద ప్రియ, మాస్టర్ ట్రైనర్లు కె. శ్రీహరి బాబు, యువరాజ్, సంబంధిత విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీని కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే



**నిజాంసాగర్, (వుదయం ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సోమవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్షనాయకుడు రాహుల్‌గాంధీని కలిశారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రచారంలో ఆదూర్ నియోజకవర్గానికి విచ్చేసిన రాహుల్‌గాంధీకి హెలిప్యాడ్ వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి తోట లక్ష్మీకాంతారావు స్వాగతం పలికారు.

## మామిడి తోట వేలం

**నాగిరెడ్డిపేట్,వుదయం** మండలంలోని మాల్తుమ్మెద గ్రామ పరిధిలో గల ప్రభుత్వ ఉద్యాన క్షేత్రంలో మామిడి తోట వేలంపాటను సోమవారం నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ హెచ్ఓ సంతోష్ రాణి తెలిపారు. సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మామిడి తోట పంటకు ఈ వేలం నిర్వహించగా, 1000 రూపాయల ధరావస్తు చెల్లించి మొత్తం 25 మంది పాల్గొన్నారు.ఈ వేలంలో గోపాల్పేట్ గ్రామానికి చెందిన మచ్చేందర్ గౌడ్ అత్యధికంగా రూ.1,01,000 బిడ్ చేసి తోటను దక్కించుకున్నారు. వేలం ఖరారైన అనంతరం కొంత మొత్తాన్ని రెండు రోజుల్లో, మిగతా మొత్తాన్ని వారం రోజుల్లో చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

### కామారెడ్డి ప్రజావాణిలో

## 117 దరఖాస్తులు

**కామారెడ్డి , (వుదయం ప్రతినిధి):** జిల్లా కలెక్టరేట్ లో ప్రతి సోమవారం సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో 117 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీలను అర్జీదారులు తమ సమస్యలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, మధుమోహన్, సీఈఓ చందర్, ఆర్డీవో ఎన్ వి గిరి లకు అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించిన వివిధ రకాల సమస్యల పై వచ్చిన అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, అర్జీదారుల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పెండింగ్ లో లేకుండా వెంట వెంటనే పరిష్కరించాలని, దరఖాస్తుల పై వివరంగా దరఖాస్తుదారునికి తెలపాలని అన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడా పాఠశాల జిల్లా స్థాయి ఎంపికలు పూర్తి

### -జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి

**మంచిర్యాల / (వుదయం ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడా పాఠశాలలలో ప్రవేశం కొరకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా క్రీడా మైదానం (జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వెనుక, బస్టాండ్ సమీపంలో) లో నిర్వహించగా, ఆన్ లైన్ లో ముందస్తుగా నమోదు చేసుకున్న అర్హులైన విద్యార్థులు పాల్గొన్నారని, ఎంపికలలో భాగంగా అభ్యర్థులకు శారీరక కొలతలు (ఎత్తు, బరువు), మోటార్ నైపుణ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 6 × 10 మీటర్ల షటిల్ రన్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, 1 కిలో మెడిసిన్ బాల్ పుట్, 800 మీటర్ల పరుగుతో పాటు వైద్య పరీక్షలు (ఏజ్ వెరిఫికేషన్) నిర్వహించడం జరిగిందని తెలిపారు. నియమ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం జరిగిందని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తదుపరి స్థాయికి ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు.

## ప్రైవేట్ కు ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు



**ఆదిలాబాద్ : వుదయం** ప్రైవేట్ వైద్యానికి ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ప్రజలు ఆ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. సోమవారం ప్రజాపాలన ప్రత్యేక ప్రణాళికల 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శాంతినగర్ లోని పుత్లీబౌలి అర్బన్ హెల్త్ సెంటర్లో స్పెషలిస్ట్ హెల్త్ క్యాంపు నిర్వహించారు. దీనికి మున్సిపల్ చైర్పర్సన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ప్రజలకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు చైర్పర్సన్ను కలిసి వారి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. తన వంతుగా ఆశాలకు సహకారం అందిస్తానని చైర్పర్సన్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. 99రోజుల ప్రత్యేక ప్రణాళికలతో స్పెషలిస్ట్ వైద్యులతో శిబిరాలను నిర్వహించి వారికి వైద్య సేవలను అందిస్తుందన్నారు. పుత్లీబౌలి అర్బన్ హెల్త్ సెంటర్ ప్రైవేట్ కు ధీటుగాఉందని, ఇక్కడ పరిశుభ్రత, వైద్యుల తీరు బాగుందని కొనియాడారు. డబ్బులున్న వారు ప్రైవేట్ కువైద్యం చేసుకుంటారని, అదే కూలీ పనులు చేసుకునే వారికి ప్రభుత్వ ఆస్పత్రులే దిక్కని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రైవేట్లో లభించే అన్ని రకాల టెస్టులు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ వైద్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ ఓ డాక్టర్ సాధన, స్థానిక కౌన్సిలర్ నజీర్,శ్రీకాంత్ స్పెషలిస్ట్ వైద్యులు సందీప్ కుమార్, దీపక్, ఆస్పత్రి నర్సింగ్ ఆఫీసర్ చంద్రకళ, సీఓ నవీన్ కుమార్, నాయకులు బండారి సతీష్ ,మనోజ్ ,తౌఫిక్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## రఘురామ దాస భజన
# కీర్తనల పుస్తకం ఆవిష్కరణ

**నాగర్ కర్నూల్ (వుదయం ప్రతినిధి)** ఆద్యాత్మిక భజన పాట, మాట శాంతి, రాజనీతి భావాలను తన రచనలలో ప్రతిబింబిస్తూ పుస్తకాలను రచిస్తున్న కవి పండితులు కర్నాటి రఘురాములు గౌడని పలువురు వక్తలు కొనియాడారు.సోమవారం నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జాతీయోన్నత పాఠశాలలో.రఘురాములగౌడ్ రచించిన "రఘు రామదాసు భజన కీర్తనలు" పుస్తకాన్ని ఆవిష్కరించారుఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి తాలూకాలోని గుండ్లగంటపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు కవి పండితుడు భజనపరులు రఘురాములు గౌడ్ ఉపాధ్యాయ వృత్తి చేస్తూనే దాదాపు నలబై సంవత్సరాలుగా ఆద్యాత్మిక పరమైన అంశాలు దేవుళ్లు గురువులు సామాజిక అంశాలు రాజనీతి తదితర అంశాలపై ఇప్పటివరకు ముప్పై మూడు పుస్తకాలను ఆవిష్కరించారని పుస్తకాలలో ఉన్న సారాంశం శాంతి,భక్తి ముక్తి మార్గంలో ప్రయాణం చేయాలని ,మానవుల మధ్య తీవ్ర అసమానతలు ఉన్నంతరకు భారతదేశం పురోగమించదని,యువతరానికి సంస్కార వంతమైన మార్గాన్ని చూయించాలని సమాజంలో ఉన్న అనేక రుగ్మతలు పోవాలని అంతరరాలు లేకుండా జీవించాలని సమధర్మం ఆయన రచనలలో కన్పిస్తుందని వక్తలు అన్నారు. రఘురాములు గౌడ ఆదర్శంతో ముందుకు సాగాలని కోరారు. నెలపొడుపు కవులు రచయిత కర్నాటి రఘురాములు గౌడ్ ను సన్మానించారు. అద్యక్షులు వనపట్ల సుబ్బయ్య,కందికొండ మోహన్, వహీద్ ఖాన్ , కాశన్న,జిల్లా నాటకసమాజం అద్యక్షులు ఆర్ సత్యం,కళా సమితి గౌరవ అద్యక్షుడు రాములు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను..
# నిర్ణీత కాలంలో పరిష్కరించాలి



**వికారాబాద్: వుదయం ప్రతినిధి:** ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ లో ఉంచక నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశము హాలు నందు నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో ప్రజల నుండి 186 పిర్యాదులు కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారులదే బాధ్యత అని,ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో తెలిపిన సమస్యలను పూర్తిగా తెలుసుకొని అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా వివిధ శాఖ ల వారిగా డి పి ఓ ,పంచాయతీ రాజ్, గృహ నిర్మాణము డీఆర్డీఏ, విద్యుత్ శాఖ, భూసమస్యలు , భూ సేకరణ విభాగాలకు చెందిన పెండింగ్లో ఉన్న దరఖాస్తులపై వివరణ ఇవ్వాలని కోరారు. పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్లో ఉన్నవి వంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జడ్.పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్ ,ఆర్ డి ఓ వాసు చంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### అధికారులకు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశాలు




## కన్నుల పండుగగా..
# సీతారాముల రథోత్సవ వేడుక



**వుదయం కునూరుపల్లి ప్రతినిధి** సోమవారం కుకునూర్పల్లి మండల కేంద్రంలో శ్రీ సీతారాముల రథోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతి యేడు లాగే ఆనవయితీగా వస్తున్న సీతారాముల కళ్యాణం జరిగినమూడో రోజున జరిపే రదోత్సవ వేడుకలను గోదాసమేత రామాలయంలో సోమవారం తెల్లవారు జామున ఉత్సవమూర్తులైన సీతారామ లక్ష్మణులను గరుడ వాహనంపై అలంకరించిగ్రామ వీధుల గుండా వైభవంగా రథోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, కళాకారుల కోలాట ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మహిళలు మంగళహారతులతో స్వామివారికి నీరాజనాలు అర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోడపట్ల అయిలం యాదవ్ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ మల్లం ఐలయ్య కనుకవ్వ, ఉప సర్పంచ్ దొంతి సత్యం, పిఎన్ఆర్ ట్రస్ట్ అధినేత పోల్కంపల్లి నరేందర్, మాజీ సర్పంచ్ కాసం నవీన్, మాజీ ఎంపిటీసీలు ఇండ్ల కనకయ్య, భూరమైన భూములు గౌడ్ , మేఘన ఫౌండేషన్ చైర్మన్ మల్లం ఐలయ్య, పాక్స్ మాజీ వైస్ చైర్మన్ పిష్క అమరేందర్ ,వాసవి క్లబ్ మాజీ అధ్యక్షుడు ఉప్పుల రాజు , గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆహార కేంద్రాల్లో తనిఖీలు పెంచాలి
## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల (వుదయం ప్రతినిధి)** జిల్లాలోని హోటల్స్, రెస్టారెంట్స్, తదితర ఆహార కేంద్రాల్లో సంబంధిత అధికారులు ఆహార పదార్థాలు మంచిగా ఉన్నాయో, లేదో తరచూ తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. సోమవారం ఐడిఓసీ సమావేశపు మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆహార సలహా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గ్రామస్థాయిలో ఉండే హోటల్స్ సైతం సంబంధిత గ్రామపంచాయతీ, ఫుడ్ సేఫ్టీ విభాగం నుంచి హోటల్స్ నిర్వహించేందుకు అనుమతులు తీసుకోవడం, రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి చేయాలన్నారు. జిల్లాలోని హోటల్స్ లో ఆహారాన్ని తయారు చేసేందుకు వినియోగించే నూనెలు, ఇతర సరుకులు నాణ్యతతో ఉన్నాయో లేదో సంబంధిత అధికారులు తరచు పరిశీలించాలన్నారు. ఆహార కేంద్రాల వంట గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. అక్కడ వినియోగించే పాత్రలు, నీళ్లు శుభ్రంగా లేకుంటే ఆహారం కల్తీ అయ్యే ప్రమాదం ఉన్నందున సంబంధిత అధికారులు తరచూ పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. వంట చేసే మాస్టర్లు, ఇతర సిబ్బంది నిబంధనల ప్రకారం జాగ్రత్తలు పాటిస్తూ శుచి, శుభ్రతతో వంటలు చేసేలా ఆదేశించాలన్నారు. ఒక నెలలో హోటల్స్ నుంచి సేకరించిన ఆహార పదార్థాల శాంపిల్స్ ను ల్యాబ్ కు పంపించి రిపోర్టును ఎప్పటికప్పుడు తమకు పంపించాలన్నారు. హోటల్ యజమానులు నిబంధనల ప్రకారం ఆయా ఆహార కేంద్రాలను నిర్వహించాలని, కల్తీ ఆహార పదార్థాలను విక్రయించే యాజమాన్యాలపై కేసులు బుక్ చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, అధికారులు, పాల్గొన్నారు.

## కళాశాలకు ఇస్తానన్న..
# 10 శాతం నిధులెక్కడా..?




**నారాయణపేట (వుదయం ప్రతినిధి)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో మున్సిపల్ అధికారులు నిర్మించిన కాంప్లెక్స్ రెంటల్ లో కళాశాలకు 10 శాతం ఇస్తామని 1996 లో అప్పట్లో బిజెపి చైర్మన్ కళాశాలకు అగ్రిమెంట్ చేయించి ఇచ్చారు. కానీ అప్పటినుండి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కళాశాలకు చెల్లించలేదని కళాశాల ప్రిన్సిపాల్ అంటున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కోసం రెంటల్ లో పది శాతం ఇస్తామంటేనే అప్పుడు కళాశాల మైదానాన్ని48 దుకాణాలుగా నిర్మించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు మున్సిపాలిటీకి అప్పగించారు. దానితో మునిసిపల్ అధికారులు కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టారు. కానీ 48 దుకాణాలు నిర్మాణం చేపట్టిన నాటినుండి నేటి వరకు రూపాయి చెల్లించకపోవడంలో అర్థం ఏముందని వారు ప్రశ్నిస్తున్నారు. కళాశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందని దీనిని అభివృద్ధి చేసేందుకు మున్సిపల్ కాంప్లెక్స్ నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రావలసిన 10 శాతం నిధులు ఇస్తే కళాశాలను పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టి విద్యాభివృద్ధికి కృషి చేయవచ్చునని కళాశాల సిబ్బంది ,విద్యార్థులు,విద్యార్థి సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మించేందుకు బిజెపి చైర్మన్ అగ్రిమెంట్ చేశారని ప్రస్తుతం బిజెపి చైర్పర్సన్ ఉండడంతో కళాశాలకు రావలసిన నిధులను కేటాయించి ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి విద్యాభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. కళాశాల అభివృద్ధికి 10 శాతం ఇవ్వాల్సిందే.... సిఐటియు జిల్లా కార్యదర్శి బాల్ రామ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్మించిన మున్సిపల్ కాంప్లెక్స్ లో 10 శాతం రెంటల్ కళాశాలకు కేటాయించాలని లేదంటే భవిష్యత్తులో ఆందోళనలు చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి బాల్ రామ్ ప్రస్తుత పాలకులను అధికారులను కోరుతున్నారు. గతంలో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం కళాశాలకు చెందాల్సిన 10 శాతం రెంటల్ ను వెంటనే చెల్లించాలని లేదంటే భవిష్యత్తులో ఆందోళనలు చేసి కళాశాల అభివృద్ధి విద్యాభివృద్ధి కోసం కృషిచేస్తామని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

# సబ్సిడీపై ఎలక్ట్రికల్ వాహనాలు



**మహబూబ్ నగర్(వుదయం ప్రతినిధి)** జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ ద్వారా సబ్సిడీపై ఎలక్ట్రికల్ వాహనాలు (టూ వీలర్, ఆటో రిక్షా),పాడి పశువులు,సోలార్ యూనిట్ అందించేందుకు ఏప్రిల్ 8 లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన అభ్యర్థులు స్వయం ఉపాధి అవకాశాలు తద్వారా ఆర్థిక పురోగతి పెంపొందిచాలనే లక్ష్యంతో షెడ్యూల్డు కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్, మహబూబ్ నగర్ జిల్లా ఎస్.సి. యాక్షన్ ప్లాన్ 202526 క్రింద రూ.1.00 లక్ష రూపాయల వరకు ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలు (90 శాతం సబ్సిడీ), రూ.3.00 లక్షల విలువ గల త్రిచక్ర ఎలక్ట్రికల్ ఆటో (ప్యాసింజర్/గూడ్స్) వాహనాలు (70 శాతం సబ్సిడీ), రూ.3.00 నుండి రూ.7.00 లక్షల (రూ.5.00 లక్షల వరకు 60 శాతం సబ్సిడీ) విలువ గల సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్, వ్యవసాయ అనుబంధ, పశు సంవర్ధక యూనిట్లకై ఆన్లైన్ పోర్టల్ లో ఏప్రిల్ 8 వ తేదీ లోగా దరఖాస్తులు నమోదు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ చైర్మన్,జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు. టూ వీలర్,ఆటో రిక్షాల యూనిట్లకు అభ్యర్థులవయస్సు 2150 సం,,లు కలిగి ఉండాలని, ఉపాధి హామీ పథకాలకు,భూసంబంధ, వ్యవసాయ, సోలార్ పరికరాలు, 2160 సం,,లు కల అభ్యర్థులు కలిగి ఉండాలని,పశు సంవర్ధక యూనిట్లకు భూమి కలిగి ఉండాలని తెలిపారు.అభ్యర్థి సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ,మున్సిపాలిటీ ప్రాంతాల వారికి రూ.2.00 లక్షలు మించి ఉండరాదని,మీసేవ నుండి పొందిన కులం, ఒక సంవత్సరం లోపు ఆదాయ ధృవపత్రం, ఆధార్ కార్డ్, ఫుడ్ సెక్యూరిటీ కార్డ్,డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన దారిద్ర్య రేఖకు దిగువన కల అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకొనగలరని ఆమె ఈ ప్రకటన లో తెలిపారు.ఆన్లైన్ లో ధరఖాస్తు చేసుకున్నవారు సంబంధిత పత్రాలు ఎస్.సి.కార్పోరేషన్ కార్యాలయం, మహబూబ్ నగర్ జిల్లా, రూమ్ నెం.105, మొదటి అంతస్తు, సమీకృత జిల్లా ఆఫీసుల కార్యాలయము, కలెక్టరేటు ఐడిఓసి నందు (2) జిరాక్స్ కాపీలు సమర్పించగలరని, ఇతర వివరములకు 9849905996 నందు సంప్రదించవలసినదిగా కలెక్టర్ పేర్కొన్నారు.

# ముగిసిన క్రీడా శిక్షణ శిబిరం



**మక్తల్, మార్చ్ 30 (వుదయం):** తెలంగాణ రాష్ట్ర క్రీడ పాఠశాలలలో 4వ తరగతిలో ప్రవేశం పొందుటకు, ప్రస్తుతము 3 వ, తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న మక్తల్ మండలంలోని 17 మంది బాల బాలికలకు 20 రోజులపాటు కోచ్ బి గోపాల ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. మక్తల్ మున్సిపాలిటీ ప్రక్కనగల ప్రాథమిక పాఠశాల (జిపి) నుండి, పాఠశాల ఎస్ జి టి టీచర్ ,జాతీయ స్థాయి క్రీడాకారిని బి. దీప ద్వారా 8 మంది దరఖాస్తు చేసుకున్న బాలబాలికలకు, ఇతర పాఠశాలల చెందిన 9 మంది బాలబాలికలకు ఈనెల 10 నుండి ఉచితంగా క్రీడా దుస్తులు అందజేసి, క్రీడా పాఠశాలకు సంబంధించిన తొమ్మిది క్రీడ అంశాలలో జిల్లా సైకిలింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత పి ఈ టి బి.గోపాలం ఈనెల 30 వరకు 20 రోజులపాటు మెరుగైన శిక్షణ ఇవ్వడము జరిగింది. ఈనెల 30న శిక్షణ ముగింపు కార్యక్రమంలో క్రీడా ప్రతిభను ప్రదర్శించిన బాలబాలికలకు మెడల్స్ అందజేసి అభినందించారు. సందర్భంగా బి.గోపాలం మాట్లాడుతూ ఈనెల 31న నారాయణపేట జిల్లా కేంద్రంలో జరుగు క్రీడా పాఠశాల ఎంపికలో ప్రతిభ చాటి, రాష్ట్రస్థాయి ఎంపికలకు ఎంపికై, తప్పకుండా రాష్ట్ర క్రీడా పాఠశాలలో ప్రవేశం పొందే విధంగా తర్ఫీదు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. మక్తల్ ప్రాథమిక పాఠశాల (జిపి) హెచ్ఎం అశోక్ మాట్లాడుతూ రిటైర్మెంట్ తర్వాత కూడా క్రీడలకు సేవలందిస్తున్న బి.గోపాలమును శాల్వతో ఘనంగా సన్మానించి అభినందించారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ హామీ ఏమైంది?



**మక్తల్, మార్చ్ 30 (వుదయం)** తెలంగాణ రాష్ట్ర అధికార కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలహామీతోపాటు,7 వ హామీగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని హామీ ఇచ్చిందని, కానీ ప్రజాస్వామ్య పరిరక్షణలో దారుణంగా విఫలమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి ఆర్ గోవింద్ రాజ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. చలో హైదరాబాద్ సందర్భంగా హైదరాబాద్ కు వెళ్లిన ఆశా కార్యకర్తలపై లాఠీ ఛార్జ్ చేయడానీ నిరసిస్తూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు సి ఆర్ గోవింద్ రాజ్ ఆధ్వర్యంలో మక్తల్ పట్టణ కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారో నిర్వహించారు.ఈ సందర్భంగ గోవిందరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆశా కార్యకర్తలకు 18 వేల రూపాయల ఫిక్స్డ్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని హామీలు అమలు చేయమని ప్రశ్నిస్తే ఆశా కార్యకర్తలపై అత్యంత నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు . తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిన ఆశలపై, రాష్ట్ర నాయకులపై నియంతృత్వంగా వ్యవహరించి లాఠీచార్జ్ చేయడమే కాకుండా రాత్రి వరకు ఆడపడుచులను పోలీస్ స్టేషన్లో పెట్టి నిర్బంధించడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు . ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని ఏడవ హామీగా చెప్పిన కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చిందని విమర్శించారు. కార్మిక వర్గ పోరాటాల పట్ల బాధ్యతరాహితంగా వ్యవహరించిన ఏ ప్రభుత్వము మనుగడ సాధించిన దాఖలాలు లేవన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి మిస్సింగ్ కార్యదర్శి, పుంజనూరు ఆంజనేయులు సిఐటియు మాజీ జిల్లా ఉపాధ్యక్షులు, భరత్ సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయమని అడిగితే ఆశా కార్యకర్తల ఇళ్ల దగ్గరికి వచ్చి అక్రమంగా అరెస్టులు చేయడమే కాకుండా మంచి నీళ్లు కూడా ఇవ్వకుండా పోలీస్ స్టేషన్లను నిర్బంధించారని విమర్శించారు. తమను విస్మరించి తమ పోరాటాలను అణచివేసిన గత ప్రభుత్వానికి ఏ గతి పట్టిందో గుర్తుతెరగాలని హెచ్చరించారు. తమకు ఫిక్స్డ్ వేతనం రూ.18000 ఇచ్చేంతవరకు, అదనపు పని భారాలు తగ్గించాలని, మట్టి ఖర్చులకు రూ.50,000, ఇన్సూరెన్స్ రూ.50 లక్షల చెల్లించేంతవరకు తమ పోరాటం ఆగిబోదని తక్షణమే ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో ఆశాలకు ప్రత్యేక నిధుల కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు గోవిందమ్మ, గౌరమ్మ, యశోద, అమీనా బేగం, ఇందిరా, అనురాధ, సుజాత, లక్ష్మి, నర్సింగమ్మ, వెంకటలక్ష్మి, పార్వతమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి
## చెక్కులు అందించిన కాంగ్రెస్ నాయకులు

**వుదయం న్యూస్ కొండపాక ప్రతినిధి** మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇరువురు గతంలో అనారోగ్యానికి గురై ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొందిన కొడారి శోభకు20వేల రూపాయలు, తాళ్లపల్లి సాయిలుకు 12,500 రూపాయల చెక్కులు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు కాగా సోమవారం రోజు లబ్ధిదారులకు అంకిరెడ్డిపల్లి గ్రామంలోఅట్టి చెక్కులను అందించారు స్థానిక కాంగ్రెస్ నాయకులు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కొండపాక మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గజవెల్లి సుదర్శన్ మాట్లాడుతూ ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం లాంటిదని, ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఇది ఒక గొప్పఆపన్న హస్తంఅన్నారు. అనారోగ్యానికి గురైనసమయంలో కుటుంబానికిఈ ముఖ్యమంత్రి సహాయానిది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు ,రాష్ట్రం లో పలు సంక్షేమ పథకాలతో పాటు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు,అర్హులైనవరికి పెన్షన్ అందిస్తూ ప్రజాపాలనకొనసాగిస్తుంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాలి బాలయ్య , ఉప సర్పంచ్ రంజిత్ , వార్డ్ మెంబర్స్ తాళ్లపల్లి రాజు, శిఖ అఖిల్, తలపాక మల్లేశం, రాశుల శ్రీనివాస్, తలపాక శంకర్ బాబు, దేవదానం, సనువాల కైలాష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి కి 45 ఫిర్యాదులు
## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**నారాయణపేట టౌన్ (వుదయం ప్రతినిధి)**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ సోమవారం ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 45 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి : జిల్లా ఎస్పీ



**గద్వాల (వుదయం ప్రతినిధి)** బాధితుల సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు.సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయం నందు గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్పీకి, జిల్లా నలుమూలల నుండి సుదూర ప్రాంతాల వారు నేరుగా ఫిర్యాదులను సమర్పించి వారి సమస్యలను విన్నవించుకున్నారు. సమస్యలను తెలియజేసిన వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి ఫిర్యాదుల పట్ల వారి సమస్యల పట్ల వెంటనే సిబ్బందిని కేటాయించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం వచ్చిన పిర్యాదులలో పొలానికి సంబంధించి 3, గొడవలకు సంబంధించి 1, గర్ల్ మిస్సింగ్ సంబంధించి 1, అధిక వడ్డీలకు సంబంధించి 1, ఇతర విషయాలకు సంబంధించి 4,మొత్తం 10 ఫిర్యాదులు అందాయి అని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గద్వాల్ డి.ఎస్పీ. వై మొగిలయ్య, గద్వాల్ శాంతినగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు టి. శ్రీను, ప్రదీప్, టాటాబాబు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 2న గ్రామసభలు

గద్వాల (వుదయం ప్రతినిధి)
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అన్ని శాఖల ప్రగతి వివరాలను ప్రస్తావించాలని సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అన్ని శాఖల్లోని అభివృద్ధి కార్యక్రమాల పూర్తి వివరాలను ఏప్రిల్ 2న జరిగే గ్రామసభల్లో ప్రస్తావించాలన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి, రైతు భరోసా, తదితర పథకాల గ్రామస్థాయి వివరాలను సేకరించి ఆయా గ్రామసభల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్ లు తరచూ తమ పరిధిలోని పాఠశాలలను, వసతి గృహాలను సందర్శించాలని, ప్రతి శుక్రవారం అక్కడే భోజనం చేయాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు సైతం సంబంధిత అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నారని చెప్పారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్స్ క్లియరెన్స్, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయిలో తాను ఇటీవల పలు మండలాల్లో పర్యటించి పరిశీలించగా చాలా కార్యాలయాల్లో పాత సామాన్లు అలాగే ఉన్నాయని, సంబంధిత అధికారులు ఆదేశాలను పాటించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికార యంత్రాంగం పనితీరులో చాలా మార్పు రావాల్సి ఉందని, నిర్లక్ష్యం వ్యవహరించే వారిపై తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీఓ శ్రీనివాసరావు, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఎండ తీవ్రతకు ప్రజలు జాగ్రత్తగుండాలి : కలెక్టర్



గద్వాల (వుదయం ప్రతినిధి)
జిల్లాలో ఎండ తీవ్రతలు 40 డిగ్రీలు ఉన్నందున వడదెబ్బకు గురి కాకుండా అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎండల తీవ్రతపై వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడ కూడా ఏ ఒక్కరూ వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని, ఇందులో భాగంగా మండలాల్లోని అన్ని ఎంపీడీవోలు, తహసీల్దార్ కార్యాలయాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల విద్యార్థులు అంగన్వాడి చిన్నారులకు వడదెబ్బ తగలకుండా అన్ని జాగ్రత్తలు చర్యలు చేపట్టాలని, పాఠశాల విద్యార్థులకు ఇప్పటికే సగం రోజు పాఠశాలలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వసతిగృహాలలో ఉండే విద్యార్థులు ఎండపూట బయటకు వెళ్లకుండా ఉపాధ్యాయులు తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. జిల్లా అధికారులు కూడా వడదెబ్బకు గురి కాకుండా టోపీలను వినియోగించాలని, తరచూ నీరు సేవించాలని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ కూలీలు కూడా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు నిర్వహించాలని అన్నారు. వైద్యాధికారులు అన్ని గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్ లు పంపిణీ చేయాలన్నారు. పక్షులు, పశువులకు కూడా నీటిని అందించేలా ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లకూడదని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. తరచూ తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, లేదా ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవలసిన చర్యలపై ఏప్రిల్ రెండవ తేదీ నుండి నిర్వహించే ప్రజా పాలన గ్రామ సభలలో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై ముద్రించిన గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, జిల్లా వైద్యాధికారి సంధ్య కిరణ్మయి, ఆర్డీఓ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులు పరిష్కరించని అధికారులకు మెమోలు

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల (వుదయం ప్రతినిధి)
ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 81 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీఓ శ్రీనివాసరావుకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ఆయా శాఖల వారీగా సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి వారం ప్రజావాణి కార్యక్రమానికి పెద్ద ఎత్తున అర్జీలు రావడమే కాక మామూలు రోజుల్లోనూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని అవే సమస్యలపై తన వద్దకు వస్తున్నట్లు చెప్పారు. ప్రజావాణికి వచ్చే చిన్న చిన్న సమస్యలను కూడా సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించకుండా అపరిష్కృతంగా ఉంచడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవిన్యూ, పురపాలక శాఖలలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించకపోవడానికి కారణమేంటని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ప్రతి బుధవారం ఆయా శాఖల జిల్లా అధికారులు తమ సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించినప్పటికీ చాలా మంది పాటించడం లేదని మండిపడ్డారు. ప్రజావాణి అర్జీలు అధిక సంఖ్యలో పెండింగ్ లో ఉంచిన అధికారులకు మెమోలు జారీ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

## హనుమాన్ పల్లి తండాలో సీసీ రోడ్ ప్రారంభం

ధన్వాడ (వుదయం ప్రతినిధి)
ధన్వాడ మండల కేంద్ర పరిధిలోని హనుమాన్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలో దోషం తాండ కు సోమవారం గ్రామ సర్పంచ్ తిరుపతి రెడ్డి పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు ఐదు లక్షల రూపాయలతో అండకు సీసీ రోడ్డు ప్రారంభించినాడు ఆయన ఈ సమావేశంలో మాట్లాడుతూ సర్పంచ్ ఎలక్షన్లు తాండకు హామీ ఇచ్చిన వెంటనే సీసీ రోడ్డు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని గ్రామస్తులు వాపోయారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాలప్ప సయ్యద్ తాండవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# విశ్రాంత ఉద్యోగులు సమాజసేవలో భాగం కావాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల (వుదయం ప్రతినిధి)
ప్రభుత్వ ఉద్యోగుల జీవితంలో బదిలీలు, ఉద్యోగ విరమణలు సర్వసాధారణమని విశ్రాంత ఉద్యోగులు తమ శేష జీవితంలో కొంత సమయాన్ని సమాజ సేవకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. జిల్లా యువజన క్రీడల అధికారిగా పనిచేసి పదవి విరమణ పొందుతున్న డివైఎస్ఓ కృష్ణయ్య ను సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణయ్య తన ఉద్యోగ జీవితాన్ని విజయవంతంగా పూర్తి చేశారని, భవిష్యత్తులో జిల్లా అధికార యంత్రాంగానికి ఆయన సేవలు అవసరమైతే వినియోగించుకుంటామన్నారు. కృష్ణయ్య శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, ఆరోగ్యంగా జీవించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం కృష్ణయ్యను జిల్లా కలెక్టర్ తో పాటు పలువురు అధికారులు ఘనంగా సన్మానించారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## సొంతింటి కల నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం

వెల్దండ మార్చి 30 (వు దయం ప్రతినిధి)
పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం అని గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని మోత్కు పార్వతమ్మకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవతో మంజూరు చేయిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్, కార్యదర్శి గిరి గౌడ్, వార్డు సభ్యులు మారేపల్లి మంజుల శ్రీను, ముదికొండ రమేష్, నాయకులు కొయ్యల పుల్లయ్య, తుంగ శ్రీను ,క్యాసరపు మల్లేష్, ఉడుత వెంకయ్య,జంగిలి ఆనంద్ , ఉడుత పరమేష్, దేవిడ్, మట్ట మల్లేష్ ,రాజు,లింగం తదితరులు పాల్గొన్నారు.



# ఇండ్ల గణన పక్కాగా నిర్వహించాలి

## డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్ భారతి హోళికేరి

గద్వాల (వుదయం ప్రతినిధి)
జనాభా గణన 2027లో భాగంగా మొదట ఈ ఏడాది ఇండ్ల గణనను పక్కాగా చేపట్టాలని డీసీఓ ( డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్) భారతీ హోళికేరి స్పష్టం చేశారు. జనగణనకు సంబంధించిన ప్రాథమిక కార్యకలాపాలపై సోమవారం హైదరాబాద్ నుంచి ఆమె సంబంధిత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడారు. హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ రూపకల్పన, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్ల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. జనగణన విజయవంతంగా నిర్వహించాలంటే ప్రాథమిక స్థాయిలో చేపట్టే పనులు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ విషయంలో సరైన రూపకల్పన, ఫీల్డ్ వెరిఫికేషన్, సిబ్బందికి సమానమైన వర్క్‌లోడ్ పంపిణీ జరగకపోతే క్షేత్ర స్థాయిలో సమస్యలు తలెత్తే అవకాశముందని హెచ్చరించారు. రక్షణ సంస్థలు, సున్నిత ప్రాంతాలు, జాతీయ ఆస్తులకు చెందిన ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీటిని సాధారణ జనగణన ప్రాంతాలుగా పరిగణించకూడదని స్పష్టం చేశారు. హెచ్ఎల్‌బీ అనేది జనగణనలో ఒక యూనిట్‌గా పనిచేస్తుందని వివరించారు. ప్రతి హెచ్ఎల్‌బీకి సుమారు 750-800 జనాభా ఉండేలా చూడాలన్నారు. 2011 తర్వాత భారీ మార్పులు జరిగిన నేపథ్యంలో కొత్త లేఅవుట్లు, అపార్ట్‌మెంట్లు,జనాభా పెరుగుదల ఇవన్నీ పరిగణలోకి తీసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలన తప్పనిసరి అని తెలిపారు. ఎన్యుమరేటర్లలో ఒకరికి తక్కువ పని, మరొకరికి ఎక్కువ పని ఉండకుండాసమానంగా బాధ్యతలు కేటాయించాలని సూచించారు. జనగణన అనేది ఒక జాతీయ ప్రాధాన్యత కలిగిన కార్యక్రమం అని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.గద్వాల ఐడిఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ, రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో సెన్సెస్ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, సిపిఓ పాపయ్య, డిపిఓ శ్రీకాంత్, ఇతర అధికారులు, పాల్గొన్నారు.



## జనగణను సమర్థవంతంగా నిర్వర్తించాలి

నాగర్ కర్నూల్ వుదయం ప్రతినిధి
జిల్లాలో నిర్వహించే జనగణన విధులను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి యాప్ ద్వారా జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వర్తించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జనగణన 2027 ఫేస్ - 1 గృహాల జాబితా, గృహ గణన (HLO) నిర్వహణలో భాగంగా, సెన్సెస్ ఫీల్డ్ ట్రేన్నర్స్ కు హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు ఫీల్డ్ ట్రైనర్లకు డిజిటల్ శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి, జిల్లాల కలెక్టర్లు తో శిక్షణ కార్యక్రమాలో, నాగర్ కర్నూలు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ మందిరము నుంచి అధికారులు తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలో జనగణన నాణ్యత క్షేత్రస్థాయి కార్యకర్తలపైనే ఆధారపడి ఉంటుందని వారికి సమర్థవంతంగా శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఫీల్డ్ శిక్షణ టీమ్‌లను కోరారు. క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చే బాధ్యత వారిపైనే ఉంటుంది కాబట్టి, శిక్షణా మాడ్యూల్‌ను సమర్థవంతంగా అర్థం చేసుకోవాలని జనాభా గణన ప్రక్రియ సమయంలో వారు సజావైన సమన్వయాన్ని కూడా పాటించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారుజిల్లాలోని 20 మండలాల ప్రణాళిక గణాంక అధికారులు చార్జ్ క్లర్క్, అసిస్టెంట్ ఛార్జ్ క్లర్క్ లుగా, కంప్యూటర్ ఆపరేటర్లు సాంకేతిక సహాయకులుగా తమకు నిర్దేశించిన విధులను సమర్థవంతంగా నిర్వహించేలా శిక్షణ తరగతులను అందించాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్డులు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి కాలనీ, , అపార్ట్మెంట్లు, చిన్నచిన్న వీధి ప్రాంతాల్లో నివసించే ప్రతి ఇంటిని ఇంటిలోని ప్రతి ఒకరి జనగణన విధిగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. ఏ ఒక్క ప్రాంతం,ఏ ఒక్కరినీ వదలకుండా, డూప్లికేషన్ లేకుండా వంద శాతం కచ్చితత్వంతో పూర్తి చేయడమే తమ లక్ష్యంతో జనగణన చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని మారుమూల గిరిజన తండాలు, ఆవాస ప్రాంతాలు హ్యాబిటేషన్లు, గ్రామాలు, మండలాలు, పట్టణ ప్రాంతాలు, జిల్లా స్థాయి వరకు జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వర్తించేలా కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ తెలిపారు. సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమా లో డిజిటల్ విధానం సాంకేతిక సమస్యలు తదితర అంశాలపై సవివరంగా వివరించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిని సుజాత, మాస్టర్ ట్రైనర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.



## మత్తుకు యువత దూరంగా ఉండాలి: డీఎస్పీ

మరికల్ ( వుదయం ప్రతినిధి)
మరికల్ మండల కేంద్రంలోని సోమవారం డ్రగ్స్ గంజాయి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని భారీ ఎత్తున విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు స్టేట్ ఈగల్ ఫోర్స్ డీఎస్పీ సైదులు నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజా పాలన పకృతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా డి.ఎస్.పి సైదులు ఈ సమావేశంలో మాట్లాడుతూడ్రగ్స్ గంజాయి వ్యతిరేకంగా మరికల్ కన్మనూర్ తీ లేరు గ్రామాలలో వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు మరియు విద్యార్థులు మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని చదువు మీద శ్రద్ధ చూపించాలని విద్యార్థి తల్లిదండ్రులు విద్యార్థులని స్కూలు పంపిన వెంటనే తిరిగి వచ్చేవరకు బాధ్యత తీసుకునే వరకు తల్లిదండ్రులు ముందుండాలని ఆయన అన్నారు మరియు మంచి విద్యార్థులు చదువుకొని మంచి ఉద్యోగాలు సంపాదించుకోవాలని మత్తు పానీయాలకు అలవాటు పడ్డవారు తమ జీవితాలు నాశనం అవుతాయని ఆయన అన్నారు మరియు విద్యార్థినిలు 1098 లేదా 100కు డయల్ చేయాలని పోకిరి వారికి పైన బుద్ధి చెప్తామని ఆయన అన్నారు సీఐ భగవంతు రెడ్డి మరికల్ ఎస్సై రాములు పోలీస్ సిబ్బంది మరియు విద్యార్థులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



### మహనీయుల జయంతి వేడుకలను

## ఘనంగా నిర్వహించాలి



గద్వాల (వుదయం ప్రతినిధి)
మహనీయులు డాక్టర్.బిఆర్ అంబేద్కర్,బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అందరు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ కోరారు. ఏప్రిల్ 5వ తేదీన బాబు జగ్జీవన్ రామ్,14వ తేదీన బీ.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కుల సంఘాలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయులు బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలను స్మరించేందుకు ప్రతి ఏడాది జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహనీయులు అందరివారని పేర్కొన్నారు.ఈ రెండు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు వివిధ సంఘాల నాయకుల అభిప్రాయాలను పరిగణలో తీసుకోని విజయవంతం చేసేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందువల్ల సంఘాల ప్రతినిధులు సమన్వయంతో ఉత్సవాల విజయవంతానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలకు ఘనమైన ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని సూచించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అనంతరం వివిధ సంఘాల ప్రతినిధులు పలు అంశాలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కి 45 ఫిర్యాదులు

నారాయణపేట టౌన్ మార్చి 30(వుదయం ప్రతినిధి)
ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ సోమవారం ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 45 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మార్జిన్ పెంచకపోతే..

# చికెన్ సెంటర్లు బంద్

**శ్రమ మాది.. లాభం పౌల్ట్రీ కంపెనీలది**

**కంపెనీల వ్యవహారంతో తీవ్రంగా నష్టపోతున్నాం**

**చికెన్ సెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్**

నాగర్ కర్నూల్ (వుదయం ప్రతినిధి)
పౌల్ట్రీ కంపెనీలు చికెన్ సెంటర్ యాజమాన్యాలకు మార్జిన్ పెంచని ఎడల ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి సామూహికంగా బంద్ నిర్వహించనున్నట్లు నాగర్ కర్నూల్ తాలూకా చికెన్ సెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల సుభాష్,ఉపాధ్యక్షులు సుల్తాన్, కార్యదర్శి మహమ్మద్ జహంగీర్, దివాకర్ రెడ్డి తదితరులు విలేకరుల సమావేశంలో తెలిపారు.పౌల్ట్రీ కంపెనీలు చికెన్ సెంటర్ నిర్వాహకులకు తక్కువ మార్జిన్ అందిస్తూ ఉండడం వల్ల తమకు గిట్టుబాటు కాక వర్కర్స్ జీతాలు దుకాణాల కిరాయిలు విద్యుత్ బిల్లులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు. చికెన్ సెంటర్ యాజమాన్యం సమక్షంలో సమావేశం నిర్వహించి ఏప్రిల్ 1వ తేదీ నుంచి సామూహికంగా బందు పాటించాలని నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చికెన్ సెంటర్ నిర్వాహకుల యాజమాన్యుల ఆధ్వర్యంలో యూనియన్ తీసుకున్న నిర్ణయం మేరకు నాగర్కర్నూల్ తాలూకాలో కూడా పూర్తిస్థాయిలో బంద్ పాటించాలని ఇందుకోసం ప్రతి చికెన్ సెంటర్ నిర్వాహకుడు సహకరించాలని కోరారు. పౌల్ట్రీ కంపెనీల ఆధిపత్యంతో తీవ్రంగా నలిగిపోతున్నది చికెన్ సెంటర్ నిర్వాహకులే అన్నారు. తాము ఉపాధి పొందుతూ నలుగురికి పని కల్పించి ఉపాధి కల్పించే చికెన్ సెంటర్ నిర్వహణ భారంగా మారి అప్పులపాలు అవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పౌల్ట్రీ యాజమాన్యాలకు ప్రభుత్వాల ద్వారా నియంత్రణ లేకపోవడం వల్ల వారు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుందని, ఇష్టానుసారంగా ధరలు పెంచుకుంటూ తమకు మాత్రం తక్కువ మార్జిన్ చెల్లిస్తూ ఉండడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని వారు పేర్కొన్నారు. పౌల్ట్రీ కంపెనీల యాజమాన్యం తమ డిమాండ్కు అనుగుణంగా మార్జిన్ పెంచని ఎడల రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని పౌల్ట్రీ యాజమాన్యాల సారథ్యంలోని చికెన్ దుకాణాలను సైతం బందు చేయిస్తామని వారు హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పౌల్ట్రీ యాజమాన్యాలపై నియంత్రణ ఉండే విధంగా చట్టాన్ని తీసుకురావడంతో పాటు వారి వద్ద కోళ్లను కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్న చికెన్ సెంటర్ ల నిర్వాహకులకు మెరుగైన ఉపాధి కోసం ఆలోచన చేయాలని వారు ఈ మేరకు డిమాండ్ చేశారు. పౌల్ట్రీ యాజమాన్యం చికెన్ సెంటర్ నిర్వాహకులకు మెరుగైన మార్జిన్ అందించే విధంగా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని అలా జరగని పక్షంలో ఒకటవ తేదీ నుంచి దుకాణాలు మూసి నిరసన తెలుపుతామని వారు పేర్కొన్నారు.




# వంద మంది విద్యార్థులకు వాటర్ బాటిల్ల పంపిణీ

మక్తల్, మార్చి 30 (వుదయం)
మక్తల్ మండల పరిధిలోని సామాన్ పల్లి, నర్సిరెడ్డిపల్లి గ్రామంలో గల మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు నాగర్ కర్నూల్ క్లాస్మేట్ క్లబ్, వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాలెండరు ఇంచార్జి వాస రాఘవేందర్ కుమారుడు వంశీకృష్ణ, కూతురు వందన కమల్ పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో అలాగే వాసవియన్ చంద్రకళ జక్లేర్ గవర్నమెంట్ హై స్కూల్ జిహెచ్ఎం కాంప్లెక్స్ ఉపాధ్యాయురాలు వారి చేయూతతో సోమవారం మక్తల్ వాసవి క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో మక్తల్, జక్లేర్ గ్రామ ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ కార్యవర్గ సభ్యులు సలహాదారులు వారి కోఆర్డినేషన్ తో మక్తల్ మండలం సామాన్ పల్లి అలాగే నర్సిరెడ్డి పల్లి (బొందల్ కుంట ) గవర్నమెంట్ మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతినిత్యం విద్యార్థులకు అవసరమయ్యే వాటర్ బాటిల్ సుమారు వంద మంది విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. కాంప్లెక్స్ ఉపాధ్యాయురాలు చంద్రకళ మేడం మాట్లాడుతూ నాగర్ కర్నూల్ వాస్తవ్యులు వాస రాఘవేందర్ సార్ క్లాస్మేట్ క్లబ్, వాసవి క్లబ్ నుండి ఎన్నో సేవలను అందించిన వారి కూతురు వందన కమల్ కుమారుడు వంశీకృష్ణ ల పుట్టినరోజు సందర్భంగా మా వాస రవీందర్ వాటర్ బాటిల్స్ డొనేట్ చేయడం శుభ పరిమాణామామని, పిల్లలు ఎవరు కూడా అధైర్య పడకుండా చక్కగా చదివి నాలుగో తరగతి తర్వాత కూడా గవర్నమెంట్ పాఠశాలలోనే చదవాలని, నేను జక్లేర్ జిహెచ్ఎం గా ఉన్నంతవరకు ఐదవ తరగతి తమ పాఠశాలలోనే చదివించాలని ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు తెలుపుతూ, తన వంతుగా ఏదైనా సహాయ సహకారాలు పిల్లలకి ఎప్పుడూ ఉంటాయని ఈ సందర్భంగా తెలిపారు..వాసవి క్లబ్ అధ్యక్షులు హరి కృష్ణ మాట్లాడుతూ... వాసవి క్లబ్ అంటే సేవ కాబట్టి చిన్నారుల పుట్టినరోజు సందర్భంగా మాకు ఈ రెండు పాఠశాలలకు సేవ చేసే భాగ్యం కల్పించిన నాగర్ కర్నూల్ వాస్తవ్యులు వాసవి క్లబ్ డిస్టిక్ క్యాలండర్ ఈవెంట్ ఇంచార్జ్, వాసవి క్లబ్ అధ్యక్షులు మేడిశెట్టి హరికృష్ణ, జక్లేర్ గవర్నమెంట్ ఉన్నత పాఠశాల జిహెచ్ఎం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ మేడం, సామన్ పల్లి ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి,నర్సిరెడ్డి పల్లి ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి,ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు నర్మద, పంచాయతీ సెక్రెటరీ ,వాసవి క్లబ్ జక్లేర్ కార్యవర్గ సభ్యులు సలహాదారులు ఎర్మల్ నరేందర్ శెట్టి, కందూరి వెంకటయ్యశెట్టి,ఎర్మల్ కృష్ణ మూర్తి,కందూరి విజయ్ భాస్కర్ శెట్టి కందూరి సంతోష్శెట్టి కందూరి అఖిల్ శెట్టి ఎర్మల్ మహా నందు శెట్టి ఎర్మల్ లక్ష్మణ్ శెట్టి ఎర్మల్ వెంకటేష్ శెట్టి, ఆర్య వైశ్య సంఘము సభ్యులు పాల్గొన్నారు.



# చక్కని ఆరోగ్యం


## పొట్ట కొవ్వు కరగాలంటే ఏది బెస్ట్ ఎక్సర్‌సైజ్?



బరువు తగ్గాలనుకునే వారు తరచుగా ఎదుర్కొనే ప్రశ్న నడక మంచిదా లేక పరుగు మంచిదా?. ఈ రెండూ అద్భుతమైన కార్డియో వ్యాయామాలే అయినప్పటికీ, శరీర తీరును బట్టి వాటి ఫలితాలు మారుతుంటాయి. ఆరోగ్యంగా ఉండాలన్నా, బరువు తగ్గాలన్నా వ్యాయామం తప్పనిసరి. అందులోనూ వాకింగ్, రన్నింగ్ అత్యంత ప్రజాదరణ పొందిన మార్గాలు. ఆరోగ్యంగా ఉండాలన్నా, బరువు తగ్గాలన్నా వ్యాయామం తప్పనిసరి. అందులోనూ వాకింగ్, రన్నింగ్ అత్యంత ప్రజాదరణ పొందిన మార్గాలు. అయితే, వీటిలో ఏది త్వరగా ఫలితాన్ని ఇస్తుంది? ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకుపోయిన మొండి కొవ్వును కరిగించడానికి ఏ వ్యాయామం ఎలా సహాయపడుతుంది.? వయస్సు, ఫిట్‌నెస్ స్థాయి, ఆరోగ్య స్థితిని బట్టి ఏది ఎంచుకోవాలో ఈ చిట్కాలు స్పష్టం చేస్తాయి. బరువు తగ్గడానికి సిద్ధమవుతున్న వారికి ఇది ఒక సరైన గైడ్. శరీరానికి ఏది సరిపోతుంది? అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం. కేలరీల ఖర్చు: సాధారణంగా ఒక గంట పాటు వేగంగా నడవడం వల్ల సుమారు 200 నుండి 300 కేలరీలు ఖర్చవుతాయి. అదే ఒక గంట పాటు రన్నింగ్ చేస్తే 500 నుండి 800 కేలరీలు వరకు కరిగించవచ్చు. అంటే, తక్కువ సమయంలో ఎక్కువ కేలరీలు ఖర్చు చేయాలంటే రన్నింగ్ ఉత్తమ ఎంపిక. పొట్ట కొవ్వుపై ప్రభావం : పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును కరిగించడానికి రన్నింగ్ చాలా వేగంగా పనిచేస్తుంది. ఇది శరీరంలోని మెటబాలిజం రేటును పెంచి, వ్యాయామం ముగిసిన తర్వాత కూడా కేలరీలు ఖర్చయ్యేలా చేస్తుంది. అయితే, నడక వల్ల కూడా క్రమంగా కొవ్వు తగ్గుతుంది, కానీ దీనికి ఎక్కువ సమయం పడుతుంది. ఎవరికి ఏది మంచిది?: నడక: వయసు పైబడిన వారు, అధిక బరువు ఉన్నవారు, కీళ్ల నొప్పులు లేదా గుండె సమస్యలు ఉన్నవారికి నడక సురక్షితం. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది. పరుగు: వేగంగా బరువు తగ్గాలనుకునే యువకులు, ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేనివారు రన్నింగ్ ఎంచుకోవచ్చు. ఇది ఎముకల బలాన్ని పెంచుతుంది. జాగింగ్ లబ రన్నింగ్: రన్నింగ్ కంటే కొంచెం తక్కువ వేగంతో పరిగెత్తడాన్ని జాగింగ్ అంటారు. రన్నింగ్ చేయలేని వారు జాగింగ్‌తో ప్రారంభించి, నెమ్మదిగా వేగాన్ని పెంచవచ్చు. ముఖ్యమైన చిట్కాలు: ఏదో ఒక రోజు చేయడం కంటే, రోజూ కనీసం 30–45 నిమిషాల పాటు వ్యాయామం చేయడం ముఖ్యం. కీళ్లపై ఒత్తిడి పడకుండా ఉండటానికి మంచి వాకింగ్ లేదా రన్నింగ్ షూస్ ధరించాలి. వ్యాయామంతో పాటు సరైన పోషకాహారం తీసుకున్నప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి. రు ఇప్పుడే ఫిట్‌నెస్ ప్రయాణాన్ని ప్రారంభిస్తుంటే, నడకతో మొదలుపెట్టి నెమ్మదిగా రన్నింగ్‌కు మారడం మంచిది. లక్ష్యం కేవలం ఫిట్‌నెస్ అయితే నడక సరిపోతుంది. అదే బరువు తగ్గడం అయితే రన్నింగ్ లేదా జాగింగ్ మేలు.

## హఠాత్తుగా బరువు తగ్గుతున్నారా?

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో అందరూ ఫిట్‌గా, స్లిమ్‌గా కనిపించాలని కోరుకుంటున్నారు. అయితే, ఈ క్రమంలో చాలామంది సోషల్ డియాలో కనిపించే 'క్రాష్ డైట్స్' లేదా 'షార్ట్‌కట్' పద్ధతులను నమ్మి అతి తక్కువ సమయంలోనే ఎక్కువ బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్నారు. పైకి ఇది మంచి ఫలితమే అనిపించినా, లోలోపల మన శరీరంలోని కీలక అవయవాలైన కిడ్నీలు, లివర్‌పై ఇది తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బరువు తగ్గడం అనేది ఒక నిరంతర ప్రక్రియ. కానీ ఎటువంటి శారీరక శ్రమ లేకుండా, కేవలం ఆహారం మానేసి లేదా సప్లిమెంట్స్ వాడి వేగంగా బరువు తగ్గడం వల్ల శరీరంలోని అంతర్గత వ్యవస్థ దెబ్బతింటుంది. బరువు తగ్గడం అంటే ఆహారం మానేయడం కాదు, సరైన ఆహారం తీసుకోవడం. రోజుకు 3–4 లీటర్ల నీరు తాగడం, 7–8 గంటల నిద్ర, క్రమం తప్పకుండా 30 నిమిషాల నడక ఉంటే ఆరోగ్యకరమైన వెయిట్ లాస్ సాధ్యమవుతుంది.శరీరం కేలరీల కొరతను ఎదుర్కొన్నప్పుడు, అది కేవలం కొవ్వునే కాకుండా కండరాలను కూడా శక్తి కోసం కరిగించేస్తుంది. దీనివల్ల శరీరం లోపల బలహీనపడిపోతుంది.



హఠాత్తుగా ఆహారం మానేయడం వల్ల శరీరంలోని వ్యర్థాలను శుద్ధి చేసే క్రమంలో కాలేయం, మూత్రపిండాలపై భారం పెరుగుతుంది. ఇది దీర్ఘకాలిక అవయవ వైఫల్యానికి దారితీయవచ్చు.కేలరీలు ఒక్కసారిగా తగ్గితే శరీరంలో ఎలక్ట్రోలైట్స్ సమతుల్యత దెబ్బతింటుంది. ఇది గుండె లయలో మార్పులకు దారితీసి ప్రాణాపాయం కలిగించవచ్చు.విపరీతమైన డైటింగ్ వల్ల పిత్తాశయంలో రాళ్లు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. వేగంగా బరువు తగ్గడం వల్ల జీవక్రియ వేగం తగ్గిపోతుంది. దీనివల్ల డైట్ ఆపగానే మళ్ళీ కోల్పోయిన బరువు కంటే రెట్టింపు బరువు పెరిగే అవకాశం ఉంటుంది.దీనివల్ల నిరంతరం అలసట, నీరసం, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.జుట్టు రాలడం, చర్మం పాలిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. మాయోక్లినిక్ నివేదిక ప్రకారం, వారానికి 0.5 నుంచి 1 కిలోగ్రాము బరువు తగ్గడం అనేది అత్యంత సురక్షితమైన పద్ధతి. దీనికోసం ప్రతిరోజూ తీసుకునే కేలరీల సంఖ్యను 500–1000 వరకు తగ్గించి, వ్యాయామాన్ని జోడించాలి.

## ఎండాకాలంలో ఏ పిండి రొట్టె తినడం ఆరోగ్యానికి మంచిది?

సెగలు గక్కుతున్న ఎండలతో బాడీ హీట్ పెరిగిపోతుందా? అయితే వంటింట్లో చిన్న మార్పు చేయాల్సిన సమయం వచ్చేసింది. మనం రోజూ తినే గోధుమ రొట్టె కంటే, వేసవిలో అమృతంలా పనిచేసే కొన్ని ప్రత్యేక రొట్టెలు ఉన్నాయని కు తెలుసా? ప్రముఖ మాస్టర్ చెఫ్ పంకజ్ భదౌరియా వేసవి తాపం నుంచి తప్పించుకోవడానికి ఇచ్చిన అద్భుతమైన



సలహాలు. మార్చిలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. పెరుగుతున్న వేడి దృష్ట్యా, ప్రజలు తమ ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏ సీజన్‌లో ఏ రొట్టె తినాలి: సాధారణంగా అందరూ ఏడాది పొడవునా గోధుమ రొట్టెనే తింటారు. కానీ వాతావరణాన్ని బట్టి ధాన్యాలను మార్చడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని పంకజ్ భదౌరియా సూచించారు. వేసవిలో బార్లీ రొట్టె అమృతంతో సమానం. ఇది శరీరాన్ని చల్లబరచడమే కాకుండా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఎండలో ఎక్కువగా తిరిగే వారికి, త్వరగా అలసిపోయేవారికి ఇది ఉత్తమ ఎంపిక. రాగిరొట్టెలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఎముకలను బలోపేతం చేయడమే కాకుండా ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇక జొన్న రొట్టె ఏడాది పొడవునా తినవచ్చు. ఇందులో ఉండే పీచు పదార్థం కడుపును తేలికగా ఉంచుతుంది. అయితే చలికాలంలో మేలు చేసే మొక్కజొన్న, సజ్జ రొట్టెలకు వేసవిలో దూరంగా ఉండటం మంచిది. ఎందుకంటే ఇవి శరీరంలో వేడిని పెంచుతాయి. వేసవిలో కేవలం నీళ్లు తాగడం మాత్రమే సరిపోదు. ఆహారంలో నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను చేర్చుకోవాలి. పుచ్చకాయ, కర్బూజా, నారింజ, ద్రాక్ష, మామిడి పండ్లు శరీరానికి అవసరమైన విటమిన్లను, తేమను అందిస్తాయి. దోసకాయ, సొర కాయ, పాలకూర వంటివి సులభంగా జీర్ణమై శరీర వేడిని తగ్గి స్తాయి. కొబ్బరి నీరు సహజ ఎలక్ట్రోలైట్‌గా పనిచేస్తుంది. మజ్జిగలో కొంచెం జీలకర్ర పొడి, ఉప్పు కలుపుకుని తాగడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. నిమ్మరసం వడదెబ్బ తగలకుండా రక్షిస్తుంది. వేసవిలో మసాలాలు, నూనె పదార్థాలు, బరువైన ఆహారానికి దూరంగా ఉండాలి. వీలైనంత వరకు కిచిడీ, సలాడ్స్ వంటి తేలికపాటి ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమం.

## ఎండాకాలంలో సోంపు తింటే ఏమవుతుంది..?

వేసవిలో ఎండలు పెరుగుతున్న కొద్దీ మన శరీరంలో వేడి, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు కూడా పెరుగుతుంటాయి. అయితే ప్రతి చిన్న సమస్యకు డాక్టర్ దగ్గరికి వెళ్లి మందులు వాడాల్సిన అవసరం లేదని కు తెలుసా? మన వంటగదిలో ఉండే ఒకే ఒక్క వస్తువుతో కడుపును మంచులా చల్లబరచవచ్చు. భానుడి భగభగలు మొదలయ్యాయి. వేసవి కాలం ప్రారంభంతో పాటే అనేక ఆరోగ్య సమస్యలు కూడా చుట్టుముడుతున్నాయి. ముఖ్యంగా ఎండల తీవ్రత వల్ల కడుపులో వేడి, గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి జీర్ణ సంబంధిత సమస్యలు సామాన్యులను వేధిస్తున్నాయి. అయితే ప్రతి చిన్న సమస్యకు మందుల ద ఆధారపడకుండా మన వంటగదిలోని సోంపు గింజలతో వీటికి సులభంగా పరిష్కారం చూపవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం.. సోంపు శరీరంలోని పైత్య దోషాన్ని సమతుల్యం చేస్తుంది. ఇది చలువ చేసే గుణం కలిగి ఉండటం వల్ల వేసవి ఉష్ణోగ్రతల నుండి శరీరాన్ని కాపాడుతుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద నివేదికల ప్రకారం.. సోంపులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్, సహజ సిద్ధమైన నొప్పి నివారణ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. భోజనం తర్వాత ఒక చెంచా సోంపు నమలడం వల్ల లాలాజలం ఉత్పత్తి పెరిగి జీర్ణక్రియ వేగవంతం అవుతుంది. భారీగా తిన్నప్పుడు కలిగే అజీర్ణం, కడుపు భారంగా అనిపించే సమస్య నుండి ఇది తక్షణ ఉపశమనం ఇస్తుంది. గ్యాస్ ఉబ్బరం నుండి విముక్తి: కడుపులో గ్యాస్ నిండి ఉబ్బరంగా అనిపించినప్పుడు సోంపు నీరు తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇది ప్రేగుల పని తీరును క్రమబద్ధీకరించి, మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తుంది. కడుపు నొప్పి నివారణ: సోంపులోని యాంటీ బాక్టీరియల్ గుణాలు సాధారణ కడుపు నొప్పిని తగ్గించడమే కాకుండా నెలసరి సమయంలో వచ్చే తీవ్రమైన కడుపు నొప్పి, అసౌకర్యం నుండి కూడా ఉపశమనం కలిగిస్తాయి. అలసటను తరిమికొట్టే సోంపు టీ: వేసవిలో వచ్చే నీరసం, ఆఫీసు పని వల్ల కలిగే అలసటను తగ్గించడానికి సోంపు టీ అద్భుతంగా పనిచేస్తుంది. ఇది మనస్సును, శరీరాన్ని ప్రశాంతంగా ఉంచి రీఫ్రెష్ చేస్తుంది.



## వేడి నుంచి ఉపశమనానికి చల్లని నీళ్లు తాగుతున్నారా?

కాబట్టి చల్లటి నీరు తాగడం వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయో ఇక్కడ తెలుసుకుందాం.. నిపుణుల అభిప్రాయం ప్రకారం చల్లటి నీళ్లు తాగడం జీర్ణక్రియను ప్రభావితం చేస్తుంది. దీనివల్ల ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడం,



ఎండ, చెమటతో అలసిపోయిన వారికి చల్లటి నీళ్లు తక్షణ చల్లదనాన్ని, ఉపశమనాన్ని అందిస్తుంది. అందువల్ల చాలా ఇళ్లలో ఫ్రిజ్ నీళ్లు లేదా ఐస్ వాటర్ తాగేందుకు ఇష్టపడతారు. అయితే ప్రతి అలవాటు శరీరంపై వివిధ రకాలుగా ప్రభావం చూపుతుందని మనం మర్చిపోకూడదు. చల్లటి నీళ్లు కూడా దీనికి మినహాయింపు కాదు. కొంతమందికి పదేపదే చల్లటి నీళ్లు తాగే అలవాటు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి చాలా మంది చల్లటి నీళ్లు తాగడానికి ఎక్కువ ఆసక్తి చూపుతారు. ఎండ, చెమటతో అలసిపోయిన వారికి చల్లటి నీళ్లు తక్షణ చల్లదనాన్ని, ఉపశమనాన్ని అందిస్తుంది. అందువల్ల చాలా ఇళ్లలో ఫ్రిజ్ నీళ్లు లేదా ఐస్ వాటర్ తాగేందుకు ఇష్టపడతారు. అయితే ప్రతి అలవాటు శరీరంపై వివిధ రకాలుగా ప్రభావం చూపుతుందని మనం మర్చిపోకూడదు. చల్లటి నీళ్లు కూడా దీనికి మినహాయింపు కాదు. కొంతమందికి పదేపదే చల్లటి నీళ్లు తాగే అలవాటు ఉంటుంది. ముఖ్యంగా వాతరణం వేడిగా ఉన్నప్పుడు హఠాత్తుగా చల్లటి నీళ్లు తాగడం వల్ల ప్రయోజనాల కంటే సమస్యలే ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు పెరగడానికి కూడా దారితీయవచ్చు. కడుపులో భారంగా ఉండటం, గ్యాస్ట్రిక్ సమస్యలు తలెత్తవచ్చు. అంతేకాకుండా చల్లటి నీళ్లు గొంతులో గరగర కలిగించవచ్చు. ముఖ్యంగా శరీరం వేడిగా ఉండే వేసవిలో ఇలా ఒకేసారి చల్లటి నీళ్లు తాగడం వలన శరీర ఉష్ణోగ్రతలో ఆకస్మిక మార్పు వస్తుంది. కొంతమందికి తలనొప్పి లేదా అలసట కూడా కలిగిస్తుంది. అంతేకాదు ఇది రక్త ప్రసరణను కూడా ప్రభావితం చేస్తుంది. నిరంతరం చల్లటి నీళ్లు తాగే అలవాటు శరీర సహజ ప్రక్రియలను నెమ్మదింపజేస్తుంది. ఇది దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఐస్ లేదా మరీ చల్లని నీళ్లు తాగడం మంచిది కాదు. ఎండ నుంచి ఇంటికి లేదా బయటకు వచ్చిన వెంటనే చల్లని నీళ్లు తాగకూడదు. కొన్ని నిమిషాలు విశ్రాంతి తీసుకుని ఆ తర్వాత నీళ్లు తాగాలి. ఒకేసారి కాకుండా రోజంతా కొద్దికొద్దిగా నీళ్లు తాగాలి. గొంతు నొప్పి లేదా ఇతర సమస్యలు ఉంటే చల్లటి నీళ్లు తాగవద్దు.

## ఖాళీ కడుపుతో అరటిపండు తింటే ఏమవుతుంది?

మనందరికీ అందుబాటులో ఉండే సూపర్ ఫుడ్ అరటిపండు. తక్షణ శక్తి కోసం, ఆకలి తీర్చుకోవడం కోసం చాలామంది ఉదయాన్నే ఖాళీ కడుపుతో అరటిపండు తినేస్తుంటారు. అయితే అమృతంలాంటి ఈ పండును ఖాళీ కడుపుతో తింటే అది గుండెపై ప్రభావం చూపుతుందని కు తెలుసా? అసలు అరటిపండును ఏ సమయంలో తింటే ఆరోగ్యం? ఖాళీ కడుపుతో తింటే వచ్చే నష్టాలేంటి? తక్షణ శక్తినిచ్చే పండ్లలో అరటిపండు మొదటి వరుసలో ఉంటుంది. అందుకే చాలా మంది ఉదయం జిమ్‌కు వెళ్లాలన్నా లేదా ఆఫీస్ హడావిడిలో ఆకలి వేసినా వెంటనే అరటిపండు తినేస్తుంటారు. అయితే ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఈ పండును చాలా మంది ఖాళీ కడుపుతో తింటారు. ఇలా తినడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అరటిపండులో పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ ః6, పీచు పదార్థం పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. అయితే ఇందులో ఉండే సహజ చక్కెరలు ఖాళీ కడుపుతో తిన్నప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలను ఒక్కసారిగా పెంచి, ఆ తర్వాత అంతే వేగంగా తగ్గించేస్తాయి. దీనివల్ల కొద్దిసేపటికే మళ్లీ ఆకలి వేయడం లేదా విపరీతమైన అలసట రావడం జరుగుతుంది. గుండె ఆరోగ్యంపై ప్రభావం: అరటిపండులో మెగ్నీషియం అధికంగా ఉంటుంది. ఖాళీ కడుపుతో దీనిని తీసుకోవడం వల్ల రక్తంలో మెగ్నీషియం, కాల్షియంల మధ్య సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉంది. ఇది గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. అలాగే ఇందులో ఉండే ఆమ్ల స్వభావం వల్ల కొందరిలో గ్యాస్, కడుపు ఉబ్బరం లేదా గుండెల్లో మంట వంటి సమస్యలు తలెత్తవచ్చు. అరటిపండును నేరుగా ఖాళీ కడుపుతో తినడం కంటే ఇతర ఆహార పదార్థాలతో కలిపి తీసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండు ముక్కలను పెరుగులో లేదా ఓట్స్‌లో కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి కావలసిన ప్రోటీన్ అందుతుంది. అలాగే పండులోని ఆమ్లత్వం తగ్గుతుంది. బాదం లేదా వాల్‌నట్స్‌తో కలిపి తినడం వల్ల శరీరానికి పోషకాలు నెమ్మదిగా అందుతాయి. బ్రేక్‌ఫాస్ట్ చేసిన తర్వాత అరటిపండు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడటంతో పాటు రోజంతా ఉత్సాహంగా ఉంటారు. ఏదైనా సరే పరిమితంగా, సరైన సమయంలో తీసుకున్నప్పుడే అది ఔషధంలా పనిచేస్తుంది.



## సన్‌స్క్రీన్ రాస్తున్నారా?

ఎండ వేడి ఎంతగా పెరిగిపోతోందో! మధ్యాహ్నం వేళ కాసేపు బయట అడుగు పెట్టామంటే చాలు ముఖం, చేతులకు ట్యాన్ ఖాయం. కాబట్టే, సన్‌స్క్రీన్ రాయడం తప్పనిసరి. అది రాసినా ట్యాన్ తప్పట్లేదా? అయితే ఈ పొరపాట్లు చేస్తున్నట్లే! సరిగానే రాస్తున్నారా? మామూలుగా మాయిశ్చరైజర్‌ని శనగ గింజ అంత పరిమాణంలో రాయాలని చెబుతారు కదా! కానీ సన్‌స్క్రీన్ విషయంలో అది సరిపోదు. రెండు వేళ్లమీద లైన్లుగా గీసుకుంటూ వెళుతూ ఆ మొత్తాన్నీ ముఖానికి పట్టించాలి అంటారు నిపుణులు. లేదా పావు స్పూను క్రీమునైనా రాయాలి. తక్కువ రాస్తే యూవీ కిరణాల ప్రభావం పడి... చర్మం నల్లబడుతుంది. ఒకసారి రాసి ఊరుకుంటాం అంటే కుదరదు. ఎండలో ఉంటే రెండు గంటలకోసారి తిరిగి రాస్తూనే ఉండాలి. అలాగే రాయగానే కాలు బయటపెడతా అన్నా కష్టమే. అది ప్రభావం చూపడానికి కనీసం పావుగంటైనా పడుతుంది. కాబట్టి, ఎండలోకి వెళ్లే పావుగంట ముందే రాయండి. ఎస్‌పీఎఫ్ ఉందా లేదా అని చూసుకుంటే సరిపోదు. కనీసం 30 ఉండాలి. అలాగే యూవీ కిరణాల నుంచి రక్షణ కావాలంటే బ్రాడ్‌స్పెక్ట్రమ్, పీఏ++ వంటివీ ఉండేలా చూసుకోవాలి. ఇంతకీ ఎలా ఎంచుకున్నారు? ఫలానా వాళ్లు బాగుంది అన్నారని మాత్రం చెప్పకండి. మీ చర్మతత్వానికి తగ్గది ఎంచుకోవాలి. అలాగే చెమటకి పోయే అవకాశం ఉంది కాబట్టి, వాటర్ రెసిస్టెన్స్ ఉందా అన్నదీ గమనించుకోవాలి. అలాగే సువాసనలు, ఆక్సీబెంజోన్ వంటివీ ఉండొద్దు. వీటన్నింటినీ గమనించుకుని వాడండి.



## రోజ్ వాటర్ ఇలా కూడా!

సౌందర్య పోషణకి వంటింటి చిట్కాలు పాటించే వాళ్ల దగ్గర తప్పక ఉండేదేదంటే రోజ్ వాటరే గుర్తొస్తుంది కదూ! దీన్ని ఫేస్ ప్యాక్‌లకే కాదు.. ఇంకా చాలా రకాలుగానూ వాడొచ్చని తెలుసా? జుట్టు నిర్జీవంగా, గడ్డిలా కనిపిస్తోందా? అయితే రోజ్ వాటర్ స్ప్రే చేసి, ఆపై నెమ్మదిగా దువ్వండి. తేమ అంది, కురులు మెరుస్తాయి. మెత్తగా నిగనిగలాడుతూ కనిపించాలంటే గులాబీ నీటికి కొన్ని చుక్కలు ఆర్గాన్ ఆయిల్‌ని కలిపితే సరి. సరిగా నిద్ర లేకపోయినా... బాగా అలసిపోయినా ఆ ప్రభావం కనిపించేది కళ్ల దగ్గరే కదూ! రోజ్ వాటర్‌ని కాసేపు ఫ్రిజ్‌లో ఉంచండి. తరవాత బయటకు తీసి, కాటన్ ప్యాడ్ మీద చిలకరించండి. ఆపైవాటిని కళ్లమీద ఉంచి, కాసేపు విశ్రాంతి తీసుకుంటే సరి. కళ్ల వాపు, ఎర్రదనం, అలసట... అన్నిటినీ మటుమాయం చేస్తుంది. ఎండ వేడి, ఏసీ చల్లదనం ఏవైనా ముఖాన్ని నిర్జీవంగా మారుస్తాయి. అలాంటప్పుడు ముఖమ్మీద దీన్ని స్ప్రే చేసుకోండి. తేమను అందించడమే కాదు... తాజాగానూ మారుస్తుంది. పైగా మేకప్ వేసుకున్నా పనిచేస్తుంది. మిస్ట్‌లా పనికొస్తుంది కాబట్టి, బ్యాగులో తప్పక ఉంచుకోండి మరి. ఎండలో కాసేపు ఉంటే చాలు చర్మం ఎర్రబడిపోతుంది చాలామందికి. ఆపై దురద, మంట. అలాంటప్పుడు చర్మాన్ని మరింత ఇరిటేట్ చేయని, ఇన్‌ఫ్లమేషన్ పెంచని పరిష్కారాలు కావాలా? అయితే రోజ్‌వాటర్‌ని కలబంద గుజ్జుతో కలిపి రాస్తే చాలు. లిప్‌బామ్ ఎంత రాసినా ప్రయోజనం లేదా? ముందు కాస్త రోజ్‌వాటర్ పట్టించి, తరవాత లిప్‌బామ్ రాయాలి.




## సెయిల్ నూతన సీఎండీగా అశోక్ కుమార్ పాండా



ప్రభుత్వరంగ దిగ్గజం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) నూతన చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)అశోక్ కుమార్ పాండా ను పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ సెలక్షన్ బోర్డ్ సిఫారసు చేసింది. ప్రస్తుతం సెయిల్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా బాధ్యతలు నిర్వహిస్తున్న పాండాకు ఈ సంస్థలో మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ అనుభవం ఉంది. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీఈ పూర్తి చేసి మేనేజ్‌మెంట్ ట్రయినీగా సెయిల్‌లో కెరీర్ ప్రారంభించిన ఆయన బిజినెస్ ఫైనాన్స్‌లో పిహెచ్‌డి కూడా పొందారు. గతంలో ఆయన డైరెక్టర్ (కమర్షియల్)గా అదనపు బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించారు.




## రేమండ్ మాజీ చైర్మన్ కన్నుమూత



ప్రముఖ పారిశ్రామికవేత్త, రేమండ్ గ్రూప్ మాజీ చైర్మన్ విజయ్‌పథ్ సింఘానియా కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, ముంబైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. భారతీయ టెక్స్‌ల్ రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలోనూ, రేమండ్ బ్రాండ్‌ను ''ద కంప్లీట్ మ్యాన్'' అనే నినాదంతో ప్రతి ఇంటికి చేరువ చేసిన ఘనత ఆయనదే కావడం విశేషం. విజయ్‌పథ్ సింఘానియా సారథ్యంలో రేమండ్ గ్రూప్ కేవలం ఒక బట్టల మిల్లు స్థాయి నుండి అంతర్జాతీయ ఫ్యాషన్ బ్రాండ్‌గా ఎదిగింది. నాణ్యత, లేటెస్ట్ ట్రెండ్స్ విషయంలో ఇండియన్ మెన్ ఫ్యాషన్ రంగంలో సింఘానియా విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. దేశవ్యాప్తంగా రిల్ నెట్‌వర్క్‌ను విస్తరించడమే కాకుండా, విదేశీ మార్కెట్లలో కూడా భారతీయ వస్త్రాలకు గుర్తింపు తెచ్చారు. ఆయన వ్యాపార దక్షతకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 2006లో ఆయనను పద్మభూషణ్ పురస్కారంతో గౌరవించింది. వ్యాపారంతో ఆయన ఎవరూ చేయని సాహసాలు కూడా చేసారు. 1988లో లండన్ నుండి ఢిల్లీ వరకు మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో ఒంటరిగా ప్రయాణించి ప్రపంచ రికార్డు సృష్టించారు. అలాగే, 2005లో 67 ఏళ్ల వయసులో హాట్ ఎయిర్ బెలూన్‌లో అత్యధిక ఎత్తుకు (సుమారు 69,000 అడుగులు) ప్రయాణించి గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పారు. ముంబై నగరానికి గౌరవ షెరీఫ్‌గా కూడా ఆయన సేవలందించారు. అయితే వ్యాపార రంగంలో అగ్రస్థానానికి ఎదిగిన సింఘానియా చివరి రోజులు విషాదకరంగా సాగాయి. తన కుమారుడు గౌతమ్ సింఘానియాతో ఏర్పడిన ఆస్తి తగాదాలు, కోర్టు వివాదాలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశమయ్యాయి.

## తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు

గ్యాస్ ధరలు సామాన్య ప్రజలకు భారీ షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ ఉద్రిక్తతల



(ఇరాన్-ఇజ్రాయెల్ వివాదం) కారణంగా చమురు మార్కెటింగ్ కంపెనీలు దేశీయ వంట గ్యాస్ సిలిండర్ ధరలను పెంచాయి. ఈ తరుణంలో ఇంట్లో ఉపయోగించే సాధారణ వంట గ్యాస్ సిలిండర్ ధర రూ. 60 పెరిగింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో 14.2 కిలోల సిలిండర్ ధర సుమారు రూ. 965కు చేరుకుంది. హోటల్స్, రెస్టారెంట్లు వాడే 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ.115 పెరిగింది. దీంతో కొన్ని హోటల్స్ మూసి వేసుకునే పరిస్థితి నెలకొంది. ఇతర నగరాలతో పోల్చి చూస్తే వరంగల్‌లోనే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరలు ఎక్కువగా ఉన్నాయి.

## మందగించిన ఆర్థిక సూచీల వృద్ధి

పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో నెలకొన్న పరిమితులు ఆర్థిక సూచికల వృద్ధి మందగింపును సూచిస్తున్నాయని ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో పేర్కొంది. మార్చి నెలవారీ ఆర్థిక సక్షను ఆర్థిక వ్యవహారాల శాఖ (డిఇఎ) శనివారం విడుదల చేసింది. పశ్చిమాసియాతో బలమైన వాణిజ్య, పెట్టుబడి, విదేశాలకు నగదు బదిలీ సంబంధాలు కలిగిన భారతదేశానికి (ప్రధాన ఇంధన దిగుమతిదారు) ఈ సంఘర్షణలు ఉసంక్లిష్టమైన, బహుళ అంచెల ఆర్థిక ఇబ్బందులను'' కలిగిస్తున్నాయని పేర్కొంది. ఉ2026 మార్చి నాటి తొలి ఆర్థిక నివేదికలు ఈ ప్రపంచ పరిణామాల ప్రభావాన్ని ప్రతిబింబించేలా వృద్ధిలో మందగమనాన్ని సూచిస్తున్నాయి'' అని నివేదిక తెలిపింది. ''మార్చి 22 వరకు నెలవారీ ఇవే బిల్లుల జారీ 5.3 శాతం తగ్గింది. ఇది వస్తువుల రవాణాలో కొంత మందగమనాన్ని సూచిస్తుంది. అయితే వార్షిక ప్రాతిపదికన లెక్కిస్తే.. ఇది 9.4శాతం అధికంగానే ఉంది. ఇంధన ధరల పెరుగుదల షాక్ తర్వాత ఉత్పత్తి వృద్ధిలో మందగమనాన్ని పిఎంఐ (పర్చేజింగ్ మానేజర్స్ ఇండెక్స్) సూచిస్తోంది'' అని నివేదిక తెలిపింది. వాహన రిజిస్ట్రేషన్లు మార్చి 24 వరకు గతేడాదితో పోలిస్తే 19.1శాతం పెరిగాయని, మార్చి 22 వరకు డిజిటల్ చెల్లింపులు రెండంకెల వృద్ధిని కొనసాగించిందని తెలిపింది. గ్రాణ ఆర్థిక పరిస్థితులు, అభిప్రాయాల



సర్వే మార్చి 2026లో గ్రాణ అభిప్రాయాల్లో కొంత తగ్గుదల ఉన్నట్లు సూచిస్తోంది. అయితే వినియోగ వృద్ధి బలపడింది. ఈ సర్వేను 2026 ఫిబ్రవరి చివరి వారంలో మరియు మార్చి మొదటి వారంలో నిర్వహించినట్లు తెలిపింది. భారతదేశం చమురు, ఎల్‌పిజి, ఎల్ఎన్‌జి అవసరాల కోసం దిగుమతులపై, ముఖ్యంగా పశ్చిమాసియా దేశాలపై ఆధారపడింది. దీంతో నిర్దిష్ట రంగాలపై స్థూల ఆర్థిక ప్రభావాన్ని కూడా నివేదిక చర్చించింది. అనేక రంగాల్లో ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలైన గాజు లేదా సిరామిక్స్ వంటి నిరంతరం ఉత్పత్తి కొనసాగే పరిశ్రమలకు ఇంధనాలను, ముడిపదార్థాలు అందకపోవడంతో ఉత్పత్తి కోతకు, తాత్కాలిక మూసివేతకు దారి తీశాయని నివేదిక తెలిపింది. లభ్యత లేకపోవడం, వ్యయ పెరుగుదల రెండూ కూడా లాభాల మార్జిన్లు, ఉత్పత్తిపై ఒత్తిడిని తీవ్రతరం చేస్తున్నాయి. రవాణా అంతరాయాలు, సరఫరా మార్గాల మార్పులు, యుద్ధ ప్రమాద ప్రీమియంలతో సరుకు రవాణా, బీమా ఖర్చులు గణనీయంగా పెరిగాయని, అదే సమయంలో రవాణా ఆలస్యం కావడం, డెలివరీ సమయాన్ని పొడిగించాయని పేర్కొంది. దీంతో కీలకమైన ముడి సరుకుల దిగుమతులకు, ఎగుమతులకు నిబంధనలు తీవ్ర నష్టం కలిగిస్తోందని తెలిపింది.

## పెట్రోల్ బంకుల ద్వారా కిరోసిన్ పంపిణీ



మిడిల్ ఈస్ట్ వార్ నేపథ్యంలో దేశంలో ఇంధన కొరత ఏర్పడటంతో కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హార్మూజ్ జలసంధిలో ఏర్పడిన అంతరాయాల వల్ల భారతదేశానికి అందాల్సిన దిగుమతులు దాదాపు 50 శాతం మేర పడిపోయాయి. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు దేశీయంగా వంట గ్యాస్ కొరత ఏర్పడకుండా పెట్రోలియం భద్రతా మరియు లైసెన్సింగ్ నిబంధనలను తాత్కాలికంగా సడలిస్తూ కేంద్రం ఆదివారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా గతంలో నిలిపివేసిన పి.డి.ఎస్ కిరోసిన్ పంపిణీని తిరిగి పునరుద్ధరించడమే కాకుండా, దానిని ఎంపిక చేసిన పెట్రోల్ బంకుల ద్వారా కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ నూతన విధానం ప్రకారం.. ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్, గుజరాత్ వంటి 21 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ సడలింపులు వర్తిస్తాయి. సాధారణంగా రేషన్ షాపులకే పరిమితమయ్యే కిరోసిన్, ఇప్పుడు ఎంపిక చేసిన పెట్రోల్ బంకుల్లో కూడా లభ్యం కానుంది. గ్యాస్ సిలిండర్ల కొరత భయాల నేపథ్యంలో తక్కువ ఆదాయ వర్గాలకు, గ్రాణ ప్రాంత ప్రజలకు కిరోసిన్‌ను ఒక ప్రత్యామ్నాయ ఇంధనంగా అందుబాటులో ఉంచడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ తాత్కాలిక ఏర్పాటు సుమారు 60 రోజుల పాటు అమలులో ఉంటుంది. దీనికోసం ప్రభుత్వం అదనంగా 48,000 కిలో లీటర్ల కిరోసిన్‌ను కేటాయించింది. గృహఅవసరాలకు కిరోసిన్‌ను వాడుకునే వెసులుబాటుకల్పించడంద్వారా వంటింట్లో గ్యాస్ వినియోగంపై ఒత్తిడిని తగ్గించాలని యోచిస్తోంది.

## కంపెనీలూ చర్యలు చేపట్టాలి



పశ్చిమాసియా సంక్షోభం వల్ల దేశీయంగా తలెత్తిన అంతరాయాలను చక్కదిద్దేందుకు, మన ప్రభుత్వం వేగంగా ప్రతిస్పందించినందుకు భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆదివారం కృతజ్ఞతలు తెలిపింది. సరఫరా వ్యవస్థలు సక్రమంగా పని చేసేలా చూడటం, ఎగుమతిదార్లకు మద్దతు ఇవ్వడం, కుటుంబాలను కాపాడటం, స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని రక్షించడంపై ప్రభుత్వం సారించిందని వివరించారు. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించడానికి, పారిశ్రామిక కార్యకలాపాలు కొనసాగడానికి, ఉద్యోగాల రక్షణకు, జీవనోపాధికి ప్రభుత్వం మద్దతు ఇచ్చినట్లు వివరించారు. ప్రభుత్వ చర్యలకు తోడు, దేశీయ కంపెనీలు కూడా తగిన విధంగా స్పందించాలని 12 సూత్రాలను సీఐఐ తెలిపింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం-పరిశ్రమల మధ్య నిరంతర సమన్వయం అవసరమని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పేర్కొన్నారు. అయితే సరఫరా వైపు అంతరాయం ఉందని.. ఇంధన - రవాణా వ్యయాలు పెరగడం, వర్కింగ్ క్యాపిటల్‌లో ఒత్తిళ్లు పెరుగుతున్నట్లు సీఐఐ గమనించిందని బెనర్జీ వెల్లడించారు. పరిశ్రమల నిర్వాహకులు కూడా తగిన చర్యలు తీసుకోవాలని సీఐఐ సూచించింది.

## 66,500 డాలర్లకు పడిపోయిన బిట్ కాయిన్

ప్రస్తుతం అంతర్జాతీయ క్రిప్టో మార్కెట్‌లో డిజిటల్ కరెన్సీ అయిన బిట్‌కాయిన్ (ఃతిబిఇనీతిని) తీవ్రమైన ఒడిదుకులను ఎదుర్కొంటోంది. గత కొద్ది రోజులుగా బిట్‌కాయిన్ ధర 65,900 నుంచి 66,500 డాలర్ల మధ్య కొనసుగుతోంది.మార్చి 27న 65,720 డాలర్ల కనిష్ఠ స్థాయికి కూడా పడిపోయింది. గత 24 గంటల్లో సుమారు 1 శాతం, గత వారం రోజుల్లో దాదాపు 4 శాతం మేర విలువను కోల్పోయిన బిట్‌కాయిన్, ఈ ఏడాదిలో ఇప్పటికే మూడుసార్లు ఇదే స్థాయి వద్ద నిలదొక్కుకుంది. అయితే, ఈసారి అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఈ సపోర్ట్ లెవల్ ఎంతవరకు నిలబడుతుందనేది ఇప్పుడు మార్కెట్ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. బిట్‌కాయిన్ ధరల ఆకస్మిక పతనానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి. మొదటిది మిడిల్ ఈస్ట్ వార్ ఉద్రిక్తల నేపథ్యంలో ఇన్వెస్టర్లు భయాందోళనకు గురై బిట్‌కాయిన్ వంటి రిస్క్ ఎక్కువగా ఉండే ఆస్తులను విక్రయించి, సురక్షితమైన బంగారం వంటి వాటిపై పెట్టుబడులు పెడుతున్నారు. రెండవది మార్చి 27న ముగిసిన సుమారు 14 బిలియన్ల డాలర్ల విలువైన ఆప్షన్స్ ఎక్స్‌పైరీ. ఈ భారీ ఎక్స్‌పైరీ కారణంగా




ట్రేడర్లు తమ పొజిషన్లను క్లోజ్ చేయడం వల్ల మార్కెట్‌లో విపరీతమైన అమ్మకాల ఒత్తిడి ఏర్పడింది. ఇక మూడవది అమెరికా ఫెడరల్ రిజర్వ్ (ఈవట) సమావేశం తర్వాత వడ్డీ రేట్లు తగ్గకపోవచ్చనే అంచనాలతో రిస్క్-ఆఫ్ సెంటిమెంట్ బలపడి, క్రిప్టో మార్కెట్ మొత్తం రెడ్ మార్క్‌లో ట్రేడ్ అవుతోంది. దీంతో రానున్న రోజుల్లో బిట్‌కాయిన్ గమనం ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఒకవేళ ప్రస్తుతం ఉన్న 66,000 డాలర్ల వద్దనే నిలబడితే, మార్కెట్ తిరిగి పుంజుకుని 68,000 నుంచి 70,000 డాలర్లకు చేరే అవకాశం ఉంది. కానీ, ఒకవేళ ఈ సపోర్ట్ బ్రేక్ అయితే మాత్రం, ధర నేరుగా 60,000 డాలర్లకు పడిపోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కేవలం బిట్‌కాయిన్ మాత్రమే కాకుండా ఎథరియం, సొలానా వంటి ఇతర ప్రధాన క్రిప్టో కరెన్సీలు కూడా 3 నుండి 5 శాతం మేర నష్టపోవడం వల్ల మార్కెట్ అంతా అనిశ్చితిలో ఉంది. ఇరాన్ చర్చల ఫలితాలు, పెరుగుతున్న చమురు ధరలు, ఫెడ్ తీసుకునే తదుపరి నిర్ణయాల బట్టి బిట్‌కాయిన్ ధరల్లో త్వరలోనే పెను మార్పులు సంభవించే అవకాశం ఉంది.




## ప్రొఫెషనల్ బాక్సింగ్‌లోకి మేరీకోమ్?




భారత దిగ్గజం, ఆరు సార్లు ప్రపంచ ఛాంపియన్ మేరీకోమ్ ప్రొఫెషనల్ బాక్సింగ్ రింగ్‌లో అడుగుపెట్టాలని భావిస్తోంది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకంతో ఈ ఘనత సాధించిన తొలి మహిళా భారత బాక్సర్‌గా చరిత్ర సృష్టించిన 43 ఏళ్ల మేరీ.. అమెచ్యూర్ బాక్సింగ్‌లో పోటీపడే వయోపరిమితిని అధిగమించింది. దీంతో దేశం తరపున అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనలేకపోతోంది. ''ఆరుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లు గెలవడం అద్భుతమైన అనుభూతి. వయోపరిమితి వల్ల అమెచ్యూర్ బాక్సింగ్‌కు దూరం కావాల్సి వచ్చింది. అయితే ప్రొఫెషనల్ బాక్సింగ్ రూపంలో నాకు కొత్త అవకాశం కనిపిస్తోంది. ఈ విషయం గురించి ఆలోచించడానికి కొంత సమయం తీసుకుంటున్నా. నేనింకా ఏం చేయగలనో ప్రజలకు చూపించడానికి పునరాగమనం కోసం ప్రయత్నిస్తున్నా. ప్రస్తుతం నా అకాడపైనే పూర్తిగా దృష్టిసారించా. తరచూ ప్రయాణాలు చేస్తున్నా.

## అదరగొట్టిన రోహిత్, రికెల్టన్..



ఐపిఎల్ 2026లో భాగంగా కెకెఆర్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముంబయి లోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కెకెఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేయగా.. ముంబయి ఇండియన్స్ మరో 5 బంతులు మిగిలుండగానే (19.1 ఓవర్లలో) 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. రోహిత్ శర్మ (38 బంతుల్లో 78; 6 ఫోర్లు, 6 సిక్సర్లు), ర్యాన్ రికెల్టన్ (43 బంతుల్లో 81; 4 ఫోర్లు, 8 సిక్సర్లు) విధ్వంసకర అర్ధ శతకాలతో ముంబయి గెలుపును ఖరారు చేయగా.. ఆతర్వాత వచ్చిన సూర్యకుమార్ యాదవ్ (8 బంతుల్లో 16; 3 ఫోర్లు), తిలక్ వర్మ (14 బంతుల్లో 20; 4 ఫోర్లు), హార్దిక్ పాండ్యా (11 బంతుల్లో 18 నాటౌట్; 3 ఫోర్లు), నమన్ ధిర్ (2 బంతుల్లో 5 నాటౌట్; ఫోర్) మ్యాచ్‌ను లాంఛనంగా ముగించారు. కెకెఆర్ బౌలర్లలో వైభవ్ అరోరా, కార్తీక్ త్యాగి, సునీల్ నరైన్ తలో వికెట్ తీయగా.. రికెల్టన్‌ను అనుకూల్ రారు అద్భుతమైన డైరెక్ట్ త్రోతో రనౌట్ చేశాడు. అంతకుముందు రహానే (40 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 67 పరుగులు), ఫిన్ అలెన్ (17 బంతుల్లోనే 6 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 37 పరుగులు), అంగ్క్రిష్ రఘువంశీ (29 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 51 పరుగులు), రింకూ సింగ్ (21 బంతుల్లో 4 ఫోర్ల సాయంతో 33 నాటౌట్) సత్తా చాటడంతో కేకేఆర్ భారీ స్కోర్ చేసింది. కేకేఆర్ ఇన్నింగ్స్‌లో కెమరూన్ గ్రీన్ (18) ఒక్కడే నిరాశపరిచాడు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ (4-0-39-3), ట్రెంట్ బౌల్ట్ (4-0-38-0) అద్భుతంగా బౌలింగ్ చేయగా..హార్దిక్ పాండ్యా ఓ వికెట్ తీశాడు.

## ఇలా ఆడితే, విరాట్ కోహ్లీని ఆపడం కష్టమే




ఇలా ఆడితే, విరాట్ కోహ్లీని ఆపడం కష్టమే అంటూ సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ వెల్లడించారు. బెంగళూరు చేతిలో సన్ రైజర్స్ తొలి మ్యాచ్ ఓడింది. ఈ మ్యాచ్ లో విరాట్ కోహ్లీ 69 పరుగులతో ఇరగదీశాడు. ఈ దెబ్బకు 6 వికెట్ల తేడాతో హైదరాబాద్ చిత్తుగా ఓడిం ది. ఇక ఈ మ్యాచ్ అనంతరం విరాట్ కోహ్లీ బ్యాటింగ్, హైదరాబాద్ ఓటమిపై కెప్టెన్ ఇషాన్ కిషన్ స్పందించాడు. తొలి మ్యాచ్ లో బెంగళూరు బ్యాటింగ్ అద్భుతంగా ఉందని ప్రశంసించాడు. ముఖ్యంగా ఛేజింగ్ చేసేటప్పుడు విరాట్ కోహ్లీ అస్సలు పట్టు వదలబోడని.. ఇలాంటి ఇన్నింగ్స్ అతను ఎన్నో ఆడాడని గుర్తు చేశారు. అయితే విరాట్ కోహ్లీని త్వరగా ఔట్ చేయాలని చాలా ప్రయత్నం చేశాం.. కానీ అతను మాత్రం అస్సలు చిక్కలేదని వెల్లడించారు ఇషాన్ కిషన్. లేకపోతే, మేమే గెలిచే వాళ్ళం అన్నా రు. అయితే ఈ టోర్నమెంటులో విరాట్ కోహ్లీ ఫామ్ ఇలాగే కొనసాగితే అతన్ని ఆపడం ఎవరి తరం కాదన్నా రు. బెంగళూరు మ్యాచ్ లో తమ బ్యాటింగ్ అద్భుతంగా ఉన్నప్పటికీ..బౌలింగ్ లో విఫలమైనట్లు తెలిపారు. తర్వాతి మ్యాచ్ లో వీటన్నిటిని చక్కదిద్దుకొని, కం బ్యాక్ ఇస్తామని ప్రకటించాడు కొత్త కెప్టెన్ ఇషాన్ కిషన్. కాగా ఈ మ్యాచ్ లో మొదటిబ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ 201 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని కేవలం 15.4 ఓవర్లలో ఫినిష్ చేసింది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. దీంతో ఆరు వికెట్ల తేడాతో విక్టరీ అందుకుంది బెంగళూరు.

## చాంపియన్ సబలెంక ఫైనల్లో కొకో గాఫ్‌పై గెలుపు

మయామి ఓపెన్ మహిళల సింగిల్స్ టిల్ వరల్డ్ నం.1, టాప్ సీడ్ అరినా సబలెంక (బెలారస్) సొంతమైంది. ఆదివారం జరిగిన టిల్ పోరులో అమెరికా యంగ్‌స్టర్, వరల్డ్ నం.4 కొకొ గాఫ్‌పై 6-2, 4-6, 6-3తో అరినా సబలెంక ఘన విజయం సాధించింది. మూడు సెట్ల పాటు ఉత్కంఠగా సాగిన అంతిమ సమరంలో బెలారస్ భామ పైచేయి సాధించింది. ర్యాలీలు, నెట్ గేమ్‌తో కొకొ గాఫ్‌ను ఇరకాటంలో పడేసిన సబలెంక.. పవర్‌ఫుల్ సర్వ్‌లతో అమెరికా అమ్మాయిని మట్టి కరిపించింది. 3 ఏస్‌లు, 4 బ్రేక్ పాయింట్లు సాధించిన సబలెంక.. మూడు సెట్ల సమరంలో ఆధిపత్యం చెలాయించింది. పాయింట్ల పరంగా 94-82తో కొకొ గాఫ్‌పై సబలెంక స్పష్టమైన పైచేయి సాధించింది. సబలెంక 16 గేమ్‌లు గెలుపొందగా, కొకొ గాఫ్ 11 గేమ్‌లు నెగ్గింది. కొకొ గాఫ్ సర్వ్‌ను బ్రేక్ చేసి తొలి సెట్లో ఆధిక్యం సాధించిన సబలెంక.. అదే జోరుతో సెట్‌ను ఖాతాలో వేసుకుంది. కానీ రెండో సెట్లో కొకొ గాఫ్ గట్టిగా పోరాడింది. ఓసారి సబలెంక సర్వ్‌ను బ్రేక్ చేసింది. సబలెంక సైతం పట్టు వదలకుండా పోరాడినా 6-4తో కొకొ గాఫ్ రెండో సెట్‌ను ఖాతాలో వేసుకుంది. టిల్ ఫైట్‌ను నిర్ణయాత్మక మూడో సెట్‌కు తీసుకెళ్లింది. ఉత్కంఠభరిత నిర్ణయాత్మక సెట్లో సబలెంక జోరందుకుంది. గాఫ్ సర్వ్‌ను బ్రేక్ చేసింది. విలువైన ఆధిక్యం దక్కించుకుని



6-4తో సెట్‌తో పాటు మ్యాచ్‌ను.. మహిళల సింగిల్స్ టిల్‌ను ఎగరేసుకుపోయింది. వరుసగా ఇండియన్‌వెల్స్, మయామి ఓపెన్ టిల్స్ సాధించిన అరినా సబలెంక.. ఇగా స్వైటెక్ (2022) తర్వాత ఒకే సీజన్‌లో 'సన్‌షైన్ డబుల్' టిల్స్ సాధించిన క్రీడాకారిణిగా నిలిచింది. సబలెంక, స్వైటెక్, విక్టోరియ అజరెంక, కిమ్ క్లిస్టర్స్, స్టెఫీగ్రాఫ్‌లు మాత్రమే ఈ ఘనతను సాధించిన వారిలో ఉన్నారు. ఈ ఏడాది డబ్ల్యూటీఏ సీజన్‌లో మూడు టిల్స్ సాధించిన సబలెంక.. 24 మ్యాచ్‌ల్లో 23 విజయాలు సాధించింది. ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో వరల్డ్ నం.2 ఎలెనా రిబకినా చేతిలో ఓడిన తర్వాత సబలెంక.. మరో మ్యాచ్‌లో పరాజయం పాలవలేదు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ తర్వాత సబలెంకను మూడు సెట్లు ఆడించిన తొలి ప్రత్యర్థి కొకొ గాఫ్ కావటం గమనార్హం. 'గత కొన్ని నెలలుగా ఏం జరిగిందో వెనక్కి తిరిగి చూసుకునే క్షణం తీరిక లేదు. టెన్నిస్ కోర్టులో నేను సాధించిన ఘనత పట్ల ఎంతో గర్వంగా ఉన్నాను. కొకొ గాఫ్ ప్రతి అవకాశం కోసం పోరాడుతుంది. ఫైనల్లో గాఫ్ నమ్మశక్యం కాని రీతిలో ఆడింది. కానీ నేను మానసికంగా ఎంతో దృఢంగా ఉన్నాను. నేను అంతా బాగానే ఆడుతున్నాను, ఒకట్రెండు పాయింట్లు సాధిస్తే సరిపోతుందనే ఆలోచనతో ఉన్నాను' అని సబలెంక తెలిపింది. 22 ఏండ్ల కొకొ గాఫ్ సాధించిన రెండు గ్రాండ్‌స్లామ్ విజయాలు సబలెంకను ఓడించి దక్కించుకున్నవే. మయామి ఓపెన్‌లో సబలెంక విజయంతో ఈ ఇద్దరి ముఖాముఖి రికార్డు 6-6తో సమమైంది.

## ఆ ప్రశ్న క్రికెట్ ఆస్ట్రేలియాను అడగండి

ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ మొదటి మ్యాచ్‌లోనే ఓటమి పాలైంది. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక మొత్తం దక్కించుకున్న విదేశీ క్రికెటర్‌గా రికార్డు సృష్టించిన కామెరూన్ గ్రీన్ ఎలా ఆడతాడో అని అంతా ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే, అతడు బ్యాటింగ్‌లో కేవలం 18 పరుగులే చేయగా.. బౌలింగ్‌లో ఒక్క ఓవరూ వేయక పోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. రూ. 25.20 కోట్లతో ఆల్‌రౌండర్ కోటాలో అతడిని తీసుకొన్న కోల్‌కతా ఎందుకు బౌలింగ్ చేయించలేదని సందేహం ఫ్యాన్స్‌కు వచ్చింది. ఇదే ప్రశ్నను కెప్టెన్ అజింక్య రహానె ఎదుట కామెంటేటర్ ఉంచారు. దానికి సమాధానం ఇచ్చిన రహానె ఓటమికి గల కారణాలేంటో వెల్లడించాడు. తన ఫిట్‌నెస్ పైనా స్పష్టత ఇచ్చాడు. ''ఇప్పుడు అంతా బాగానే ఉంది. మ్యాచ్ సమయంలో కాస్త కండరాలు పట్టేసినట్లు అనిపించింది. ప్రస్తుతం సర్దుకుంది. ఇక ముంబయికి నిర్దేశించిన 220+ లక్ష్యం సరిపోతుందని భావించా. బ్యాటింగ్‌లో మెరుగ్గానే ఆడాం. కానీ, అంతగా అనుభవం లేని బౌలింగ్ యూనిట్ కావడంతో కాస్త ఇబ్బందిపడ్డాం. స్ట్రాంగ్ బ్యాటింగ్ లైనప్ ఉన్న ముంబయిని అడ్డుకోవడం పెద్ద సవాలే. ముజరబాని ఐపీఎల్‌కు కొత్త. వైభవ్ అరోరా, కార్తిక్ త్యాగి కుర్రాళ్లు. ఇంకా నేర్చుకుంటున్నారు. ఇద్దరు అనుభవమైన స్పిన్నర్లు ఉన్నప్పటికీ.. ముంబయి బ్యాటర్లు అద్భుతంగా ఆడటంతో ఓటమి తప్పలేదు. నాకు ఇప్పుడు 37 ఏళ్లు. అయినా ఫిట్‌నెస్ పరంగా కుర్రాడిగానే భావిస్తా. ముంబయిలో చాలా ఉక్కపోతగా ఉండటంతో మా బౌలర్లకు కాస్త ఇబ్బందిగా అనిపించింది. భారీ మొత్తం పెట్టి కొనుగోలు చేసిన కామెరూన్ గ్రీన్‌తో ఎందుకు బౌలింగ్ చేయించలేదని సందేహం రావచ్చు. అయితే, అతడు త్వరలోనే బౌలింగ్ చేస్తాడు. ఈ మ్యాచ్‌లో ఎందుకు చేయించలేదని మాత్రం అడిగితే.. ఆ ప్రశ్నను క్రికెట్ ఆస్ట్రేలియాను అడగమని చెబుతా.




## చెన్నై కోటను బద్దలు కొట్టేందుకు రాజస్థాన్ రెడీ

ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య పోరుకు రంగం సిద్ధమైంది. ఈసారి రాజస్థాన్ జట్టులో ఉన్న ఈ ఐదుగురు మాత్రం చెన్నై విజయావకాశాలను దెబ్బతీసేలా కనిపిస్తున్నారు. ఐపీఎల్ 2026 సీజన్ మూడో మ్యాచ్‌గా చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు గువహటిలోని బర్సాపరా స్టేడియంలో తలపడనున్నాయి. ఈ మ్యాచ్ కోసం క్రికెట్ అభిమానులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. చెన్నై జట్టు ఎప్పుడూ పటిష్టంగానే ఉన్నా, ఈసారి రాజస్థాన్ జట్టులో ఉన్న ఐదుగురు ఆటగాళ్లు మాత్రం చెన్నై విజయావకాశాలను దెబ్బతీసేలా కనిపిస్తున్నారు. తమ అద్భుతమైన ఫామ్, పాత రికార్డులతో చెన్నై బౌలర్లకు, బ్యాటర్లకు వీరు చుక్కలు చూపించడం ఖాయం. రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ చెన్నై బౌలర్లకు మెయిన్ విలన్ కానున్నాడు. కేవలం పవర్ ప్లేలోని ఆరు ఓవర్లు ఇతడు క్రీజులో ఉంటే చాలు, స్కోర్ బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్తుంది. గత సీజన్‌లో 206 స్ట్రైక్ రేట్‌తో విరుచుకుపడ్డ వైభవ్, ఇప్పుడు మరింత రాటుదేలాడు. ఇతడిని త్వరగా అవుట్ చేయకపోతే చెన్నై బౌలింగ్ అటాక్ కుప్పకూలడం ఖాయం. ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు చెన్నై సూపర్ కింగ్స్ అంటే ఏదో తెలియని ప్రేమ. ఆ జట్టుపై ఆడిన 8 మ్యాచ్‌ల్లో మూడు హాఫ్ సెంచరీలు బాది 161 స్ట్రైక్ రేట్‌తో చెలరేగాడు.






## ఆరాధ్య నుంచి నీ పుట్టుకే ఓ వరం



మన ఎమోషన్ పిక్చర్స్ బ్యానర్ పై విడుదల కానున్న ఆరాధ్య చిత్రం నుండి నేడు ఒక అద్భుతమైన పాటను విడుదల చేయడం జరిగింది. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుకలో 'నీ పుట్టుకే ఓ వరం' అంటూ మనసుని హత్తుకునే పాటను విడుదల చేయడం జరిగింది. కెపిఎస్ చిన్న రచన దర్శకత్వంలో వచ్చిన ఈ పాటకు గోపినాథ్ కొండ సంగీతం అందించగా డానియల్ మదాసు సినిమాటోగ్రఫీ అందించారు. పాటను విన్న వేడుకలో ఉన్న వారు అంతా చాలా బాగా రెస్పాండ్ అయ్యారు. పాటలో నటించిన పాప అలాగే తండ్రి పాత్ర చాలా బాగా నటిస్తూ పాటలను ఎమోషన్ అద్భుతంగా ముందుకు తీసుకుని వెళ్లారు.



# పట్టుదలతో అద్భుత ట్రాన్స్ ఫర్మేషన్

### సర్‌ప్రైజ్ చేయడానికి శర్వా సిద్ధం

చార్మింగ్ స్టార్ శర్వా మోస్ట్ ఎవైటెడ్ మూవీ బైకర్ కోసం అద్భుతంగా ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. వ్యక్తిగతంగా, క్రియేటివ్‌గా తనను మళ్లీ ఛాలెంజ్ చేసే పాత్ర బైకర్ రూపంలో వచ్చింది. ఇందులో అతను 18 ఏళ్ల రేసర్‌గా కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం అతను తన శరీరాన్ని, మనసును పూర్తిగా మార్చుకున్నారు. ఈ చిత్రానికి అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహించగా, యువి క్రియేషన్స్ నిర్మిస్తోంది. సినిమా ఏప్రిల్ 3న విడుదల కానుంది.
ఇప్పటికే మేకర్స్ శర్వా ట్రాన్స్ ఫర్మేషన్ వీడియోను విడుదల చేయగా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.
ఒకసారి కమిట్ అయిన తర్వాత శర్వా పూర్తిగా తనను డెడికేట్ చేశారు. ఉదయం సూర్యోదయం కంటే ముందే మొదలయ్యే రోజు, అలసటతో ముగిసేది. లాంగ్ డిస్టెన్స్ పరుగులు, కఠినమైన స్ట్రెంగ్త్ ట్రైనింగ్, మొబిలిటీ సెషన్స్‌తో అతను తన పరిమితులను దాటాడు. ఇది కేవలం శారీరకంగా మాత్రమే కాదు, మానసికంగా కూడా ఛాలెంజ్ గా మారింది.
ఈ ప్రయాణంలో యోగా అతనికి కీలకంగా నిలిచింది. జిమ్ అతనికి బలం, సహనం ఇచ్చినప్పుడు, యోగా అతని ఆలోచనలను ప్రశాంతం చేసి, ఫోకస్‌ను పెంచింది. ఈ ఫెరోసిటీ, ప్రశాంతత కలయికే అతని మార్పుకు బలం అయింది. దీంతో అతను బరువు తగ్గి, మరింత షార్ప్ లుక్‌తో పాటు కొత్త కాన్ఫిడెన్స్ ను పొందారు.

> బైకర్
> "ఏప్రిల్ 3 విడుదలకు సిద్ధమవుతుండగా, శర్వా కొత్త అవతార్‌కి అద్భుత స్పందన వస్తోంది. శర్వా మాట్లాడుతూ.. షూటింగ్ మొదటి రోజు అద్దంలో చూసుకున్నప్పుడు, నేను సిద్ధంగా ఉన్న, క్రమశిక్షణతో ఉన్న, అప్‌డేటెడ్ వ్యక్తిని చూశాను. ఈ ప్రయాణం నాకు ఒక విషయం నేర్పింది..ఎంత నిరాశలో ఉన్నా.. ఒక నిర్ణయం తీసుకుంటే పూర్తిగా మారిపోవచ్చు. ఏప్రిల్ 3న మీరు స్క్రీన్‌పై విక్కీని చూస్తే, అది కేవలం నటన కాదు – రెండు సంవత్సరాల కష్టం, మారాలనే పట్టుదల ఫలితాన్నిని చూస్తారు"

## రాఘవ మీడియా ఆధ్వర్యంలో
# సౌత్ ఇండియన్ టీవీ సీరియల్ అవార్డ్స్



హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో సౌత్ ఇండియన్ టీవీ సీరియల్ అవార్డ్స్ కర్టెన్ రైజర్ ఈవెంట్ అట్టహాసంగా జరిగింది. రాఘవి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలుగు సీరియల్ ప్రముఖులు, యాక్టర్లు, డైరెక్టర్లు, నిర్మాతలు హాజరయ్యారు. టెలివిజన్ సీరియల్ పరిశ్రమను గౌరవించడమే లక్ష్యంగా మొదలైన అవార్డ్స్, దక్షిణ భారతదేశంలో నాలుగు భాషల సీరియల్స్‌ను ఒకే వేదికపైకి తీసుకొచ్చి చరిత్ర సృష్టించనుంది. ఇంతవరకు ప్రతి ఛానల్ తన సొంత అవార్డులు విడివిడిగా నిర్వహించేది. ఇప్పుడు నాలుగు భాషలు, నాలుగు రాష్ట్రాలను ఒకేసారి గౌరవించడం ఇండస్ట్రీలో మైలురాయిగా కాబోతుంది.
కర్టెన్ రైజర్ ఈవెంట్‌లో నామినేషన్లు, ఓటింగ్ విధానం, ఎక్స్‌పెక్టెడ్ నామినీలు, సీరియల్ ఆర్టిస్టుల పాల్గొన్నారు. ఈ అవకాశం కల్పించినందుకు మధు గారికి, రాఘవి మీడియా టీమ్‌కి అందరూ ధన్యవాదాలు తెలిపారు. టెలివిజన్ పరిశ్రమ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇలాంటి అవార్డ్ ఫంక్షన్ ఇదే మొదటిసారి. ఈవెంట్‌లో మాట్లాడిన ప్రముఖులు.. టీవీ కళాకారులు, టెక్నీషియన్లు గత 50 ఏళ్లుగా ప్రతి ఇంట్లోకి వెళ్తున్నా, వారికి గుర్తింపు ఇవ్వడంలో జరిగిన లోపాలను గుర్తు చేశారు. ప్రభుత్వాలు, సంస్థలు ముందుకు రాకపోవడం వలన చిన్న చిన్న సంస్థలే అవార్డులు ఇచ్చేవి. ఇప్పుడు రాఘవి మీడియా ద్వారా సౌత్ ఇండియా మొత్తం టీవీ పరిశ్రమకు గౌరవం లభించడం గర్వకారణమని అందరూ అభిప్రాయపడ్డారు.

## సైలేష్ ఏంటో అంతా సరికొత్తగా
### ఫస్ట్ లుక్ పోస్టర్ అవిష్కరణ



"పోస్టర్ చూడగానే ఒక ఫ్రెష్ ఫీలింగ్ వచ్చింది. టైటిల్ కూడా చాలా కొత్తగా, ఆకర్షణీయంగా ఉంది. ప్రస్తుతం ప్రేక్షకులు కొత్త కంటెంట్, కొత్త కథలను ఎక్కువగా ఆదరిస్తున్నారు. ఈ సినిమా కూడా అదే దిశలో మంచి ప్రయత్నంగా కనిపిస్తోంది. టీమ్ అంతా కొత్త ఎనర్జీతో పనిచేస్తున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. రాజ్ బోను గారు కథ, స్క్రీన్ ప్లే మరియు దర్శకత్వం వహించడం చాలా ఆసక్తికరంగా ఉంది. ఆయన కథ చెప్పే విధానం ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని నమ్ముతున్నాను. రాము గారు ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించడం అభినందనీయం. మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమా తప్పకుండా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను," అని తెలిపారు.
ఈ చిత్రానికి రాజ్ బోను కథ, స్క్రీన్ ప్లే మరియు దర్శకత్వం వహిస్తున్నారు. రాము.ఎం నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సంగీతం రిషి.ఎం, సినిమాటోగ్రఫీ వేణు కొత్తకోట, ఎడిటింగ్ హరీష్ జె.ఆర్ కృష్ణ అందిస్తున్నారు.

## 23కి గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు

మల్లేశం, మెట్రో 8ఎఎమ్ వంటి ఆలోచనత్మక సినిమాలను రూపందించిన దర్శకుడు రాజ్ రాచకొండ రూపొందించిన చిత్రం 23(ఇరవై మూడు). నేరస్థుల పరివర్తన, నేరలను తగ్గిస్తుందనే కథంశంతో రూపొందిన '23' గతఏడాది విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది. విమర్శకుల ప్రశంసలతో పాటు గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు ను దక్కించుకుంది. ఈ సందర్భంగా చిత్ర బృందానికి జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభ లో సౌమ్య మిశ్రా మాట్లాడుతూ.. ఈ సినిమా నిర్మాణం అత్యంత బాధ్యత తోనూ, కష్టం తోనూ కూడుకున్నది. ఈ సినిమా చూసాను అది చాలా ప్రభావవంతం గా ఉంది. ఈ ప్రయత్నం చేసిన టీం ని అభినందిస్తున్నాను. నేరస్థుల పరివర్తన అనే అంశాలు కథలో బాగా పొందుపరిచారు. జైలు జీవితాలను ఇంత వాస్తవికతం గా తెరమీద ఇప్పటి వరకూ చూపలేదు. ది షాషాంక్ రిడెంప్షన్ వంటి గొప్ప చిత్రాల సరసన నిలబడే చిత్రం 23. ఈ సినిమా ఖచ్చితంగా ఖైదీలకు ప్రదర్శించేందుకు ఏర్పాటు చేస్తాం. కొందరిలో మార్పు వచ్చినా అది ఈ సినిమా సాధించిన గొప్ప విజయం. 23 చిత్రం తెలంగాణ గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు గెలుచుకున్నందుకు అభినందనలు.




## చెన్నై లవ్ స్టోరీ సాంగ్ లాంఛ్




హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా "కలర్ ఫోటో", "బేబి" వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందుతున్న "చెన్నై లవ్ స్టోరీ" సినిమాకు బిజినెస్ పరంగా మంచి క్రేజ్ ఏర్పడుతోంది. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశలో ఉంది. మెలోడీ బ్రహ్మ మణిశర్మ "చెన్నై లవ్ స్టోరీ" సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా నుంచి గుర్తుందా సాంగ్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు.
ఎడిటర్ సంతోష్‌నాయుడు మాట్లాడుతూ మణిశర్మ నా ఫేవరేట్ మ్యూజిక్ డైరెక్టర్. ఆయన మ్యూజిక్ చేస్తున్న "చెన్నై లవ్ స్టోరీ" మూవీ టీమ్ లో నేను వర్క్ చేయడం సంతోషంగా ఉంది. ఈ మూవీకి మీ అందరి సపోర్ట్ ఉండాలని కోరుకుంటున్నా. అన్నారు.
ఎడిటర్ విప్లవ్ మాట్లాడుతూ గుర్తుందా పాట మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను. ఈ మూవీ ప్రమోషనల్ కంటెంట్ కు నేను వర్క్ చేస్తున్నాను. మణిశర్మ గారితో కలిసి వర్క్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఎస్ కేఎన్, సాయి రాజేశ్..ఇలా నా సొంత టీమ్ తో మళ్లీ కలిసి వర్క్ చేసే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. అన్నారు.
నటుడు మహేందర్ మాట్లాడుతూ నా లైఫ్ లో విన్న ఎక్కువ మ్యూజిక్ మణిశర్మ గారిదే. ఈ పాట పోస్టర్ లో కనిపిస్తున్న స్టిల్ కోసం మూడు గంటలు హీరో హీరోయిన్స్ కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ చలిలో బీచ్ లో అలా కూర్చుని ఉన్నారు. వారు ఈ మూవీ కోసం ఎంత డెడికేటెడ్ గా వర్క్ చేశారో దీంతో అర్థం చేసుకోవచ్చు. అన్నారు.
డీవోపీ విశ్వాస్ డేనియల్ మాట్లాడుతూ నేను కిరణ్ అబ్బవరం గారితో చేస్తున్న ఐదో చిత్రమిది. అమేజింగ్ స్టోరీతో ఈ సినిమా మీ ముందుకు రాబోతోంది. గుర్తుందా సాంగ్ ఎంత బాగుందో మూవీ మొత్తం అదే ఫీల్ తో ఉంటుంది. మా అందరికీ ఇదొక కొత్త తరహా మూవీ. ఇకపై మా సినిమా నుంచి రాబోయే ప్రతి కంటెంట్ మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. అన్నారు.
లిరిసిస్ట్ అనంత శ్రీరామ్ మాట్లాడుతూ మేము చెప్పింది గొప్ప అనే అహాన్ని మరచి ప్రతి ఒక్కరూ ఈ సినిమా కోసం పనిచేశారు. ఎవరు ఏం చేసినా, ఏం చెప్పినా సినిమా కోసమే అనుకున్నారు. అందుకే ఈ మూవీ ప్రతి విషయంలో గెలుస్తుంది అని చెప్పగలను. ఈ సాంగ్ కోసం నేను పల్లవి రాశాక మణిశర్మ గారు సంగీతాన్ని అందించారు, చరణం మణిశర్మ గారు కంపోజ్ చేశాక నేను లిరిక్స్ రాశాను. ఎలాంటి ఈగో లేకుండా మేమంతా వర్క్ చేశాం. మేమంతా ఇంతమంచి వాతావరణంలో కలిసి పని చేసిన ఈ సినిమా తప్పకుండా మీ అందరి మనసులను గెలుచుకుంటుంది. మంచి వసూళ్లు సాధిస్తుంది. అన్నారు.
నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ బేబి సినిమా తర్వాత "చెన్నై లవ్ స్టోరీ" తో మరోసారి తమతో కలిసి వర్క్ చేసే అవకాశం కల్పించిన సాయి రాజేశ్, ఎస్ కేఎన్ కు థ్యాంక్స్ చెబుతున్నా. బేబి సినిమా కంటే పది రెట్ల పెద్ద విజయాన్ని ఈ సినిమా సాధిస్తుంది. ఈ చిత్రంలో ఏడు పాటలు ఉన్నాయి. మొదటి పాట ఇది. ఈ చిత్రంలోని పాటలన్నీ ఒక్కోటి 100 మిలియన్ వ్యూస్ దాటేస్తాయి. ఈ కథ విన్నప్పుడే హీరో కిరణ్ అబ్బవరం బ్లాక్ బస్టర్ మూవీ చేస్తున్నామని ఒకే చెప్పారు. క సినిమా తర్వాత ఆయన ఒప్పుకున్న చిత్రమిది.

## హృదయానికి హత్తుకునే సినిమా
# కార్మేని సెల్వం

### సంగీత దర్శకుడు రామానుజన్

పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపి, కోతండం, కరణ్ చక్రవర్తి, శంకర నారాయణ్ వి, హరిత పరాకోడ్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. మ్యూజిక్ యాజ్ ఏ సర్వీస్ అంటూ మ్యూజిక్ క్లౌడ్ స్టూడియో అండ్ టెక్నాలజీ పేరుతో రామానుజన్ ఎంకే తమ సంస్థ ద్వారా ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఇప్పటికే విడుదలైన 'అరెరె' పాట ఎమోషనల్‌గా ప్రేక్షకుల మనసులను హత్తుకుంది. ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రం థియేటర్స్ లోకి రాబోతుంది. ఈ సందర్భంగా సంగీతం దర్శకుడు రామానుజన్ ఎంకే చిత్ర విశేషాల గురించి ఇలా వివరించారు.
"ఒక చిత్రానికి సంగీతాన్ని అందించిన ఘనత ఏ ఒక్క వ్యక్తికీ కాకుండా, ఒక సంస్థకు దక్కాలని కోరుకున్నాం. అందుకే 2017లో బెంగళూరులో 'మ్యూజిక్ క్లౌడ్ స్టూడియో అండ్ టెక్నాలజీ' ప్రారంభించాను. మొదట్లో కార్పొరేట్ ప్రాజెక్టులను స్వీకరిస్తూ, నెమ్మదిగా నా పనితీరును మెరుగుపరుచుకోవడం మొదలుపెట్టాను. ఆ తర్వాత మీడియా సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకోవడం ప్రారంభించాను. మేము సౌండ్ డిజైన్, వాయిస్‌ఓవర్లు మరియు డబ్బింగ్ వంటి అన్ని సేవలను అందించాము. ప్రస్తుతం 'కార్మేని సెల్వం' ప్రాజెక్టును విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఈ సినిమాకు సంగీతం దర్శకుడి పేరు కాకుండా.. (మ్యూజిక్ యాజ్ ఏ సర్వీస్) మ్యూజిక్ క్లౌడ్ స్టూడియో అండ్ టెక్నాలజీ పేరును ప్రకటించాం. ప్రస్తుతం సినిమా నిర్మాణ వ్యయం రోజురోజుకూ పెరిగిపోతోంది. మంచి కథాంశాలను ప్రోత్సహించాలంటే, నిర్మాణ వ్యయాన్ని తప్పనిసరిగా తగ్గించాల్సి ఉంది. ఆ దిశగా అడుగులు వేయడానికి ఉన్న మార్గాలలో ఒకటి సంగీత నిర్మాణానికి అయ్యే ఖర్చును తగ్గించాలనుకుని ఈ చిత్రం విషయంలో ఇలా ప్లాన్ చేశాం. ఇటువంటి సేవను వినియోగించుకోవడం ద్వారా, చిత్ర నిర్మాతలకు మ్యూజిక్ క్లౌడ్ స్టూడియోకు మధ్య ఒక రెవెన్యూ మోడల్ రూపొందించబడింది. ఈ ఆదాయ నమూనా కింద, సౌండ్ ఇంజనీర్లు, వాయిద్యకారులు, ప్రోగ్రామర్లు సహా ఈ ప్రక్రియలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ రాయల్టీలో వాటా లభిస్తుంది. మేము సంగీత నిర్మాణానికి ఒక కార్పొరేట్ నిర్మాణాన్ని తీసుకు వస్తున్నాము. సినీ సంగీత రంగంలో ఇదొక కొత్త ప్రభంజనం అనుకోవచ్చు. నేను గతంలో దర్శకుడు రామ్‌తో కలిసి అమృత శ్రీనివాసన్ ప్రధాన పాత్ర పోషించిన 'కురైయొండ్రుమ్ ఇల్లై' చిత్రానికి పనిచేశా. ఇప్పుడు 'కార్మేని సెల్వం' లాంటి గొప్ప ఫ్యామిలీ ఎమోషనల్ చిత్రానికి సంగీతం అందించే అవకాశం వచ్చింది.



## దిల్ రాజు మరో భారీ ప్రాజెక్ట్



సినీ ఇండస్ట్రీలో ఒక్కసారిగా సంచలనం రేపిన ఈ భారీ అనౌన్స్మెంట్ ను సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి, దిల్ రాజు సోషల్ మీడియాలో అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రం వచ్చే నెలలోనే సెట్స్ పైకి వెళ్లనుంది.
బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్, బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ వంశీ పైడిపల్లి, ప్రతిష్టాత్మక శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సక్సెస్ ఫుల్ నిర్మాత దిల్ రాజు కలసి హై ఆక్టేన్ యాక్షన్ డ్రామా చేయబోతున్నారు. ఈ హై పవర్డ్ కొలాబరేషన్ అనౌన్స్ మెంట్ అభిమానులు, పరిశ్రమలో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ త్రయం ఈ ప్రాజెక్ట్ ను సోషల్ మీడియాలో అనౌన్స్ చేశారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ 2027లో బిగ్గెస్ట్ సినిమా ఈవెంట్ లలో ఒకటిగా నిలుస్తోంది, ఈ చిత్రం ఏప్రిల్‌లో సెట్స్ పైకి వెళ్లనుంది. బిగ్ స్కేల్ ఎంటర్‌టైనర్స్ ను ఎమోషన్స్ తో మేళవిస్తూ చిత్రాలను రూపొందించే దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు వంశీ పైడిపల్లి. ప్రభాస్, ఎన్టీఆర్, మహేష్ బాబు, రామ్ చరణ్, అల్లు అర్జున్, విజయ్ వంటి అగ్ర హీరోలతో పని చేసి, విభిన్న జానర్స్ లో తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన 'మహర్షి' జాతీయ అవార్డు సాధించడం ఆయన విజన్ కి నిదర్శనం. దిల్ రాజు తన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై మరో భారీ ప్రాజెక్ట్ కు శ్రీకారం చుడుతున్నారు. 60కి పైగా చిత్రాలను నిర్మించిన ఆయన, కంటెంట్, కమర్షియల్ విజయాలతో సక్సెస్ ఫుల్ గా నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు. 'మహర్షి', 'శతమానం భవతి' చిత్రాలకు జాతీయ అవార్డులు అందుకోవడం ఆయన క్యాలిటీకి నిదర్శనం.

# హరుడు
## మే 8న రిలీజ్



ఓజీ,శ్రీ సీతా రాముల కల్యాణం చూతము రారండి, అన్నయ్య, ప్రేమ కోసం, శివ రామరాజు లాంటి బ్లాక్ బస్టర్ సినిమాలతో అలరించిన హీరో వెంకట్ సినిమాల్లోకి కమ్ బ్యాక్ ఇస్తున్నారు. విఆర్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో వెంకట్ హీరో రూపొందుతున్న మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'హరుడు'. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహిస్తున్నారు.సహా నిర్మాతలు గా డా.. దిక్కల లక్ష్మణ్ రావు డా.. ప్రవిణ్ రెడ్డి ఉన్నారు.. ఇప్పటికే విడుదలైన టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. సమ్మర్ స్పెషల్ గా మే 8న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది.
'ఇది కంప్లీట్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్. ప్రేక్షకులు కొరుకునే అన్ని ఎలిమెంట్స్ ఇందులో వుంటాయి. ఇది అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించే కథ. వెంకట్ గారి ఇది మంచి కం బ్యాక్ మూవీ అవుతుంది' చిత్ర నిర్మాతలు తెలియజేశారు.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.